
'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 128

సోమవారం 23-1-2023




హతవిధి!
ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత్ బోల్తా.. షూటౌట్‌లో కివీస్ చేతిలో ఓటమి -12లో




ముందే రిటైర్మెంటా..!
పెట్టుబడులు 20 ప్లస్‌లో ఆరంభిస్తే బెటర్ -13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మరో ఆరు రహస్య ఫైళ్లు
రహస్య ఫైళ్ల వ్యవహారం అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు చుట్టుకుంటోంది. ఆయన నివాసంలో చేపట్టిన సోదాల్లో మరో ఆరు ఫైళ్లు దొరికాయి.
వివరాలు 6లో ▸



వృద్ధుడిని లాక్కెళ్లిన కారు
బిహార్‌లో సైకిల్‌పై వెళ్తున్న వృద్ధుడిని కారుతో ఢీకొట్టి.. 8 కిలోమీటర్ల దూరం లాక్కెళ్లారు. దీంతో అతను ప్రాణాలు కోల్పోయాడు.
వివరాలు 6లో ▸



పెరూలో హింసాత్మకం
పెరూలో ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. డిసెంబర్ నుంచి ఇప్పటిదాకా 55 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.
వివరాలు 6లో ▸



పటిష్ట భద్రత మధ్య జోడో యాత్ర
జమ్మూలో జంటపేలుళ్ల నేపథ్యంలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పాదయాత్రకు అత్యంత కట్టుదిట్టమైన భద్రత కల్పించారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఎంత పని చేశావ్.. తల్లీ!



నరసరావుపేటలో కనిపించకుండాపోయిన ఏడాది బాలుడు బావిలో శవమై తేలాడు. పోలీసులు అనుమానంతో తల్లిని ప్రశ్నించగా.. పిల్లాడిని ఆడిస్తుండగా పొరపాటున బావిలో పడిపోయాడని తెలిపింది. కొంత కాలంగా ఆమె మానసిక స్థితి సరిగా లేకపోవడంతో చికిత్స తీసుకుంటోందని కుటుంబసభ్యులు తెలిపారు.
వివరాలు 5 ▸

'పాన్'కథా చిత్రమ్



బాహుబలి తర్వాత తెలుగు సినీ పరిశ్రమ పాన్ ఇండియా రేంజ్‌కు ఎదిగింది. ఇప్పుడు 'పాన్ కథ'లకే ఇప్పుడు ఇండస్ట్రీ మొగ్గు చూపుతోంది. ఈ ఏడాది టాలీవుడ్ నుంచి దాదాపు డజనుకు పైగా పాన్ ఇండియా చిత్రాలు రానున్నాయి.
వివరాలు 12 ▸

నాన్న జ్ఞాపకాలు పదిలం



'నాన్నను బొలీవియాలో అమెరికా అనుకూల బొలివీయా దళాలు కాల్చి చంపినప్పుడు నాకు సుమారు ఏడేళ్లు. అయినప్పటికీ ఆయనతో గడిపిన క్షణాలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి' అని విప్లవ వీరుడు చేగువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా తెలిపారు.
వివరాలు 14 ▸

చేరువలో చికిత్స

గత 9 నెలల్లో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్స్‌లో 43,10,363 మందికి సేవలు

నగరాలు, పట్టణాల్లో రోజుకు సగటున 18,970 మందికి చికిత్స

రాష్ట్ర వ్యాప్తంగా 542 అర్బన్ హెల్త్ క్లినిక్‌లలో వైద్యం

- 216 రకాల మందులు, 60 రకాల వైద్య పరీక్షలు
- 7.51 లక్షల మందికి వైద్య పరీక్షలు.. నేరుగా వారి వాట్సాప్‌కు ఫలితాలు
- గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం 259 యూపీహెచ్‌సీలే
- దీంతో చిన్న జబ్బులకూ జిల్లా, బోధనాస్పత్రులకు వెళ్లి అవస్థలు
- ఈ ప్రభుత్వం రాగానే ఆ పరిస్థితులకు చెక్ పెడుతూ విప్లవాత్మక చర్యలు
- 25 వేల జనాభాకు ఒక అర్బన్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు

2లో



గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడులో సేవలందిస్తున్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్

అందిస్తున్న వైద్య సేవలు ఇలా..

- ప్రతి వార్డుకు 2–3 కి.మీ దూరంలోపు లేదా 15 నిమిషాల నడక దూరంలో క్లినిక్ ఉంటుంది.
- గతంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఒక్క నర్సు మాత్రమే అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం ఒక మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఇతర సిబ్బందిని అందుబాటులోకి తెచ్చారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 3,920 మంది ఉద్యోగులను ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్‌లకు మంజూరు చేసింది. నియామకాలు దాదాపు పూర్తయ్యాయి.
- గతంలో ఓపీ సేవలు మాత్రమే అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం పది పడకలతో ఇన్‌పేషెంట్ విభాగం కూడా అందుబాటులోకి వచ్చింది.
- గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శాఖ అమలు చేసే ఆరోగ్య కార్యక్రమాలన్నీ అర్బన్ హెల్త్ క్లినిక్‌లతో పట్టణ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి.
- పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ప్రతి ఆరు ఆరోగ్య కేంద్రాలను ఒక క్లస్టర్‌గా చేసి, అక్కడ ఈ సేవలు అందించేందుకు ఇప్పటికే వైద్య శాఖ అల్ట్రాసౌండ్ మిషన్‌లను కొనుగోలు చేసింది.

అమెరికాలో కాల్పులు

10 మంది మృతి

మరో 10 మందికి గాయాలు

అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నగరంలో భారీ కాల్పుల ఘటన చోటుచేసుకుంది. మాంటెరీ పార్క్‌లోని ఓ డ్యాన్స్ క్లబ్‌లోకి గన్‌తో ప్రవేశించిన ఓ దుండగుడు.. చైనా నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో 10 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. దుండగుడికి సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

- వివరాలు 6లో



కాల్పుల్లో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న సహాయక సిబ్బంది

స్వియాటెక్ అవుట్




పోలాండ్ మహిళా టెన్నిస్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్‌కు కొత్త ఏడాది కలసి రాలేదు. గత ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో కలిపి ఎనిమిది టైటిల్స్ గెలిచి స్థిరంగా టాప్ ర్యాంక్‌లో కొనసాగిన స్వియాటెక్.. కొత్త ఏడాదిలో ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రిక్వార్టర్ ఫైనల్లోనే వెనుతిరిగింది. స్వియాటెక్ జోరుకు 25వ ర్యాంకర్, కజకిస్తాన్ అమ్మాయి రిబాకినా కళ్లెం వేసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో 6-4, 6-4తో స్వియాటెక్‌ను ఓడించింది. మరోవైపు మహిళల డబుల్స్‌లో భారత స్టార్ సానియా మీర్జా పోరాటం కూడా రెండో రౌండ్‌లో ముగిసింది.

12లో

మిషన్ మిల్లెట్

ఈ ఏడాదంతా చిరుధాన్యాల కార్యకలాపాలు

- సాగు, వినియోగం పెంచడమే ప్రధాన లక్ష్యం.. రాష్ట్రంలో 4.87 లక్షల టన్నుల దిగుబడి లక్ష్యం
- రైతులు, స్వయం సహాయక సంఘాలు, విద్యార్థులకు విస్తృత అవగాహన.. రైతులతో మిల్లెట్ క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు
- ఈ నెల 31 వరకు జిల్లాలవారీగా నిర్వహణ
- పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సీఎస్ సూచన



సాక్షి, అమరావతి: ఈ ఏడాదిని అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా గుర్తించిన నేపథ్యంలో ఆరోగ్యం, పోషక విలువలతో కూడిన చిరుధాన్యాల సాగును ప్రోత్సహించి విస్తృత అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలను ఆహారంగా తీసుకునేలా ప్రచారం చేస్తూ జనవరి నుంచి డిసెంబర్ వరకు ప్రణాళిక రూపొందించింది. రైతులు, స్వయం సహాయక సంఘాలు, విద్యార్థుల్లో
మిగతా 5వ పేజీలో ▶

దిగుబడి పెంచేలా ప్రణాళిక

దేశవ్యాప్తంగా 2022 – 23 ఖరీఫ్, రబీలో జొన్నలు, సజ్జలు, రాగులు, తృణ ధాన్యాలు 205 లక్షల టన్నుల దిగుబడి సాధించాలని కేంద్రం లక్ష్యంగా నిర్ధారించింది. ఏపీలో 4.87 లక్షల టన్నుల చిరుధాన్యాల ఉత్పత్తిని లక్ష్యంగా నిర్ణయించారు. తృణధాన్యాల ఉత్పత్తి పెంచడానికి జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద 14 రాష్ట్రాల్లోని 212 జిల్లాల్లో చర్యలు చేపట్టినట్లు కేంద్రం పేర్కొంది. క్లస్టర్ ప్రదర్శనలతో పాటు పంటల విధానంపై అవగాహన కల్పించడం, అధిక దిగుబడి ఇచ్చే హైబ్రీడ్ విత్తనాల పంపిణీ, వ్యవసాయ యంత్రాలు, ఉపకరణాలను రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా చేపడుతున్నట్లు తెలిపింది.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్.. మరో పదేళ్లు పొడిగింపు

- రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ
- ఇది తీసుకురాకుంటే సబ్‌ప్లాన్ చట్టం రద్దయ్యే పరిస్థితి
- ఎస్సీ, ఎస్టీలపట్ల సీఎంకున్న ప్రేమ మరోసారి రుజువైంది
- ఆ వర్గాల్లో వెల్లువెత్తిన హర్షాతిరేకాలు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి నిర్దేశించిన సబ్‌ప్లాన్ (ఉప ప్రణాళిక)ను ప్రభుత్వం మరో పదేళ్లు పొడిగించింది. ఈ మేరకు ఆదివారం ఆర్డినెన్స్‌ను జారీచేసింది. దళిత, గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం పదేళ్ల కాలపరిమితితో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ఈ నెల 23తో ముగియనుంది. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ సబ్‌ప్లాన్‌ను కొనసాగించేందుకు సీఎం వైఎస్ జగన్
మిగతా 10వ పేజీలో ▶

ఫీజులు గుంజేసి.. బకాయిలు మింగేసి!

- హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ట్రస్టు నిర్వాకాలు
- కరోనా సాకుతో టీచర్లకు సగం జీతాలే
- విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు కాగానే బకాయిలన్నీ చెల్లిస్తామంటూ మోసం
- న్యాయ పోరాటానికి దిగిన అధ్యాపకులు
- ప్రధాని కార్యాలయం, తెలంగాణ ప్రభుత్వానికి ఫిర్యాదు



2లో



సుజలం.. సురక్షితం

- గ్రామీణ ప్రజలకు సురక్షిత తాగునీటి సరఫరా కోసం తీసుకుంటున్న చర్యల్లో దేశంలోనే ఏపీ టాప్
- రాష్ట్రాల వారీగా ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలకు కేంద్రం మార్కులు
- 'స్వచ్ఛ జల్ సే సురక్ష' పేరుతో దేశవ్యాప్తంగా కార్యక్రమం
- గ్రామాల్లో నీటి నాణ్యత పరీక్షలు, సరఫరా తదితర అంశాల వారీగా మార్కులు
- రెండో స్థానం సాధించిన ఏపీ

2లో

ఫిబ్రవరి చివరికి 222 గ్రామకంఠాలకు హక్కు పత్రాలు

ఈ నెలాఖరుకల్లా 13 నంబరు నోటిఫికేషన్లు

ఫిబ్రవరి చివరికి ఆర్‌వోఆర్ సిద్ధం

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 222 గ్రామాల్లో గ్రామకంఠాల పరిధిలో ఇళ్లు, ఇళ్లస్థలాల యజమానులకు అధికారిక హక్కుదారు పత్రాలు ఫిబ్రవరి నెలాఖరుకు సిద్ధం కాబోతున్నాయి. ఈ నెలాఖరుకల్లా ఆయా గ్రామకంఠాల్లో ఏ ఆస్తికి ఎవరు యజమాని అన్న వివరాలతో 13 నంబరు నోటిఫికేషన్లు జారీచేయనున్నారు. ఫిబ్రవరి చివరికల్లా గ్రామకంఠాల పరిధిలోని ఆస్తి యజమానులకు హక్కుపత్రాలు అందజేసేందుకు వీలుగా రికార్డు ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)ను సిద్ధంచేసే ప్రక్రియను పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు వేగవంతం చేశాయి. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. నంద్యాల జిల్లాలో రెండు గ్రామాల్లోను, అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, గుంటూరు జిల్లాలు మినహా మిగిలిన 22 జిల్లాల్లో పదేసి గ్రామాల్లోను ఈ ప్రక్రియ పూర్తికానుంది.

ఇదండీ సంగతి



ఊరోక్కండి సార్! రాత్రి మీకు కలొచ్చినట్లుంది అంతే! లైట్ తీస్కోండి!!

పిల్లలపై కోవిడ్ ప్రతాపం

29% మంది విద్యార్థుల్లో లోపించిన ఏకాగ్రత

43 శాతం మందిలో ఇప్పటికీ మానసిక వేదన

అధిగమించేలా తోడ్పాటు ఇవ్వాలి

తల్లిదండ్రులు, టీచర్లకు ఎన్‌సీఈఆర్టీ సూచన

సాక్షి, అమరావతి: కరోనా క్రమంగా కనుమరుగైనా విద్యార్థులను మాత్రం మానసిక వేదనకు గురి చేస్తూనే ఉంది. వీటిని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) పలు సూచనలు చేసింది. కోవిడ్ తరువాత విద్యార్థుల మానసిక స్థితిగతులపై మనోదర్పణ్ సర్వే నివేదికను ఎన్‌సీఈఆర్టీ ఇటీవల విడుదల చేసింది. 29 శాతం మంది విద్యార్థుల్లో ఏకాగ్రత లోపించి చదువులపై దృష్టి కేంద్రీకృతం చేయడం లేదని సర్వేలో తేలింది. టీచర్లు, తల్లిదండ్రులు వీటిని అధిగమించేలా పిల్లలకు తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందని ఎన్‌సీఈఆర్టీ అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా 6 నుంచి 12 తరగతి చదివే 3.79 లక్షల మంది విద్యార్థులు సర్వేలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 9,660 మంది విద్యార్థులను ప్రశ్నించి ఫలితాలు రూపొందించారు. సర్వే చేయడంతోపాటు మానసిక ఆందోళన, ఇతర సమస్యల నుంచి బయటపడేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఎన్‌సీఈఆర్టీ సూచించింది.

సర్వేలో తేలిన సమస్యలు

- 29 శాతం మంది విద్యార్థులలో ఏకాగ్రత లోపించగా 43 శాతం మందిని మానసిక ఆందోళన వెంటాడుతోంది. పాఠశాలలు తెరిచిన తరువాత

మిగతా 14వ పేజీలో ▶



ఏం చేయాలంటే..

విద్యార్థుల్లో విశ్వాసం, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు తల్లిదండ్రులు, పెద్దలకు టీచర్లు దిశానిర్దేశం చేయాలి. విద్యార్థుల్లో ప్రత్యేక లక్షణాలను గుర్తించి ప్రోత్సహించాలి.

మానసిక, భావోద్వేగ పరిస్థితులు నియంత్రించే అంశాలను పాఠ్యాంశాలకు అనుసంధానించాలి. భావోద్వేగాలను నియంత్రించేలా నైపుణ్యాలను పెంపొందించాలి.

కుటుంబం పరిస్థితులు, ఆత్మన్యూనతతో ఒత్తిడికి గురయ్యే కౌమార దశ విద్యార్థుల్లో భయాలను టీచర్లు పోగొట్టాలి. తల్లిదండ్రులతో సంప్రదిస్తూ సున్నితంగా వ్యవహరించాలి. అవసరమైతే మానసిక నిపుణులతో చర్చించేలా సూచనలు చేయాలి.

క్లుప్తంగా...

అసైన్డ్ భూములపై అధ్యయనానికి వెళ్లిన ప్రత్యేక బృందం

సాక్షి, అమరావతి: తమిళనాడు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు అసైన్డ్ భూములపై అవలంబిస్తున్న పద్ధతులను అధ్యయనం చేసేందుకు మన రాష్ట్రం నుంచి ప్రత్యేక బృందం బయలుదేరి వెళ్లింది. రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో ఐదుగురు మంత్రులు, 9 మంది ఎమ్మెల్యేలతో కూడిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ఆదివారం రాత్రి విజయవాడ నుంచి విమానంలో చెన్నై బయలుదేరింది. బృందంలో సీసీఎల్ఏ అదనపు కమిషనర్ ఏఎండీ ఇంతియాజ్ కూడా ఉన్నారు.

తెలంగాణ

ఇక శనివారాల్లోనూ వీసా అపాయింట్‌మెంట్లు

- నిరీక్షణ సమయం తగ్గించేందుకు యూఎస్ కాన్సులేట్ల చర్యలు



సాక్షి, హైదరాబాద్: తొలిసారిగా వీసా కోసం దరఖాస్తు చేసుకున్నవారి నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు ఢిల్లీలోని యూఎస్ ఎంబసీతోపాటు ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్లు 'శనివారం ప్రత్యేక ఇంటర్వ్యూల'కు చర్యలు చేపట్టాయి. వ్యక్తిగత ఇంటర్వ్యూల నిర్వహణ కోసం ఈ నెల 21న తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. రాబోయే నెలల్లో సైతం ఎంపిక చేసిన శనివారాల్లో వీసా అపాయింట్‌మెంట్ల కోసం అదనపు స్లాట్‌లను జారీ చేయనున్నట్టు న్యూఢిల్లీలోని యూఎస్ ఎంబసీ ఒక ప్రకటనలో తెలిపింది. కోవిడ్–19 కారణంగా భారీగా పెండింగ్‌లో ఉన్న వీసా దరఖాస్తులను పరిష్కరించేందుకు వివిధ రకాల చర్యలను యూఎస్ ఎంబసీ, కాన్సులేట్లు చేపట్టాయి. గతంలో అమెరికా వీసా పొందిన దరఖాస్తుదారులు మళ్లీ వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే ఇంటర్వ్యూ ఇవ్వాల్సిన అవసరం లేదు. వీరి కోసం ఇంటర్వ్యూలను యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ మాఫీ చేసిందని ఢిల్లీలోని యూఎస్ దౌత్య కార్యాలయం గుర్తు చేసింది. వీసాల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచేందుకు 2023 జనవరి–మార్చి మధ్యకాలంలో వాషింగ్టన్, ఇతర ఎంబసీల నుంచి డజన్ల మంది అధికారులు భారతదేశానికి రానున్నారు. భారతదేశంలోని అమెరికా దౌత్య కార్యాలయంతోపాటు కాన్సులేట్లలో శాశ్వత సిబ్బంది సంఖ్యను సైతం స్టేట్ డిపార్ట్‌మెంట్ పెంచబోతోంది. ఇటీవల భారతదేశంలో 2.50 లక్షలకుపైగా అదనపు బీ1/బీ2 వీసా అపాయింట్‌మెంట్లను జారీ చేసింది. అదనపు అపాయింట్‌మెంట్ల జారీకి ముంబైలోని కాన్సులేట్ వారపు పనివేళలను పెంచింది. వేసవి నాటికి దేశంలోని యూఎస్ ఎంబసీ, కాన్సులేట్లు పూర్తిస్థాయి సిబ్బందితో కోవిడ్–19 మహమ్మారికి ముందునాటి స్థాయిలో వీసాల ప్రాసెసింగ్ చేపడతాయని న్యూఢిల్లీలోని యూఎస్ ఎంబసీ ఆశాభావం వ్యక్తం చేసింది.

అత్యంత భయానక పరిస్థితి ఎదుర్కొన్నా

- తెలంగాణ మహిళా ఐఏఎస్ స్మితా సబర్వాల్



సాక్షి, హైదరాబాద్: 'నా ఇంట్లో ఒక అగంతకుడు చొరబడటంతో గత రాత్రి అత్యంత భయానక పరిస్థితిని ఎదుర్కొన్నా. అప్రమత్తతతో ఉండటంతో నా ప్రాణాలను రక్షించుకోగలిగాను' అని తెలంగాణ ముఖ్యమంత్రి కార్యదర్శి స్మిత సబర్వాల్ ఆదివారం ట్విట్టర్ ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. 'ఎంత సురక్షితంగా ఉన్నామనే భావనలో ఉన్నా.. ప్రతిసారీ తలుపులు, గడియలను స్వయంగా మనమే సరిచూసుకోవాలి' అన్న పాఠాన్ని ఈ ఘటన నేర్పిందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. కాగా తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలక పదవిలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ ఇంట్లోకి శనివారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా ప్రవేశించిన డిప్యూటీ తహసీల్దార్ చెరుకు ఆనంద్‌కుమార్ రెడ్డి మానసిక స్థితిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్నేహితుడు బాబుతో కలిసి రాత్రి 11.34 గంటలకు ఆమె ఇంట్లోకి ప్రవేశించిన ఆనంద్ అక్కడినుంచి 'ఎట్ యువర్ డోర్ స్టెప్' అంటూ ట్వీట్ చేశాడు.

అంతధీమాగా ఎలా..?

స్మితా సబర్వాల్ నివాసముంటున్న ప్లాట్ యూసుఫ్‌గూడ పోలీసు లైన్స్‌లోని ప్లెజెంట్ వాలీ గేటెడ్ కమ్యూనిటీలో 24 గంటలు పోలీసు సెక్యూరిటీ ఉంటుంది. ఇంత బందోబస్తు ఉన్న ప్లాట్‌లోకి అంత ధీమాతో ఎలా వెళ్లాడన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆ సమయంలో నిందితుడు మద్యం తాగి ఉన్నాడా లేక మానసిక స్థితి కోల్పోయాడా అన్నది తేలాల్సి ఉంది. ఉద్యోగం విషయం మాట్లాడాలంటే పగలు రావాలిగానీ రాత్రి ఎందుకు వచ్చారు అన్నది అర్థం కావడం లేదు.

అత్తోటలో.. విత్తననిధి

- 2016లో మూడు రకాల వరి విత్తనాలతో మొదలు
- నేడు 365 రకాలకు చేరిక
- ప్రైవేటు రంగంలో ఇదే తొలి విత్తన నిధి
- ప్రకృతి వ్యవసాయానికి పెద్ద పీట
- ఈ యజ్ఞానికి తానా సహకారం
- ఒక్క ఊరిలోనే 80 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం లోకి..



అత్తోటలో భూమి భారతి ప్రాంగణం (ఇన్‌సెట్‌లో) ప్రకృతి వ్యవసాయం విత్తనాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: దేశీయ వరి విత్తనాలకు పెద్దపీట వేస్తూ ప్రకృతి వ్యవసాయంతో అద్భుతాలు చేస్తున్నారు అత్తోట రైతులు. 2016లో మూడు రకాల వరి వంగడాలతో ప్రారంభించి ఈ ఏడాది 365 దేశవాళీ రకాలను పండిస్తూ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. వరి వంగడాలను పండించడమే కాకుండా భూమి భారతి పేరుతో విత్తన నిధిని ఏర్పాటు చేశారు. దేశీయ వరి రకాలకు సంబంధించి ప్రైవేటు రంగంలో ఇదే తొలి విత్తన నిధి కావడం గమనార్హం. ఈ యజ్ఞానికి తానా తన వంతు సహకారం అందించింది. మొదట్లో ఏడెనిమిది మంది రైతులతో ఐదు ఎకరాల్లో ప్రారంభించిన ఈ ప్రక్రియ ఈ రోజున ఒక్క అత్తోట గ్రామంలోనే ఎనభై మందికి పైగా రైతులు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఈ దేశీయ వరి రకాలను పండిస్తున్నారు. రసాయనాల ప్రసక్తి లేకుండా కేవలం ప్రకృతి ఆధారిత సాగు పద్ధతుల్లో తీసిన విత్తనాలతో 'దేశవాళీ విత్తన నిధి' ఏర్పాటు చేశారు.

ప్రకృతి వ్యవసాయం–దేశీయ వంగడాలు

గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోట గ్రామంలో రైతులు కొన్నేళ్లుగా దేశవాళి వరి వంగడాలను ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్నారు. గ్రామరైతు యర్రు బాపన్న నేతృత్వంలో మరో ఏడుగురు కలిసి దేశవాళీ వరి రకాల విత్తనాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఒక రైతు పంటను వేసుకోవడంతో పాటు విత్తనాలను కూడా తానే తయారు చేసుకునే అవకాశం దేశవాళీ విత్తనాలపై ఉంది. గత ఏడాది 365 రకాలను పండించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుకు కావాల్సిన ద్రవ, ఘన జీవామృతాలు, కషాయాలను స్వయంగా తయారుచేసుకుంటున్నారు. అవసరమైన సాంకేతిక సహకారాన్ని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీతో పాటు ఇతర ప్రభుత్వ సంస్థలు అందిస్తున్నాయి.

'దేశవాళీ విత్తన నిధి' ఏర్పాటు

అత్తోట రైతు యర్రు బాపయ్య గత ఆరేళ్లుగా ఈ విత్తనాలను సేకరిస్తూ సాగులో ఉన్నారు. ఆయన తానా సహకారంతో అత్తోట శివారులో విత్తననిధిని ఏర్పాటు చేశారు. ఇక్కడ 365 రకాల ధాన్యం అందుబాటులో ఉంచారు. ఈ పంటలు వేసుకునే రైతులకు ఆయా రకాలను అందిస్తున్నారు. ధాన్యం కావాలనే వారికి మర ఆడించి ఇచ్చేందుకు చిన్నస్థాయి రైస్‌మిల్‌ను తమ ఆవరణలోనే ఏర్పాటు చేసుకున్నారు. మెట్టలో తొలినుంచీ ప్రకృతి సేద్యం చేస్తున్న నామన రోశయ్య వీరికి స్ఫూర్తిగా నిలిచారు. 78 ఏళ్ల వయసులో కూడా ముప్పాతిక ఎకరం (75సెంట్లు)లో వ్యవసాయం చేస్తూ ఏడాదికి లక్షన్నరకు పైగా ఆదాయం సంపాదిస్తున్నాడు. ఈ వయసులోనూ కొబ్బరిచెట్లను అవలీలగా ఎక్కుతూ గెలలను దింపుతూ మార్కెటింగ్ చేసుకుంటున్నాడు. కొబ్బరి సహా 23 రకాల పండ్ల చెట్లు సాగు చేస్తున్నాడు.

అన్నీ ఆరోగ్య ప్రయోజనాలనిచ్చే రకాలే..

ఇక్కడ అరుదైన రకాలను సేకరించి సాగుచేశారు. బీపీటీ తరహాలోనే రోజువారీ ఆహార వినియోగానికి తగినట్టుండే 'రత్నచోళి'ని సాగుచేశారు. వర్షాధారమై, ఎక్కువ పోషకాలుండే 'సారంగనలి' మరో రకం. వండేటపుడు చక్కని సువాసననిచ్చే పొడుగైన బియ్యం 'ఢిల్లీ బాసుమతి', 'ఇంద్రాణి' రకాలు, గడ్డి నుంచి బియ్యం వరకు సమస్తం నలుపురంగులో ఉండి రోగనిరోధక శక్తినిచ్చే 'కాలాబట్టి' (బ్లాక్‌రైస్), తెగుళ్లు, దోమకాటు దరిచేరని 'దానమతి', మధుమేహాన్ని అదుపుచేసే నవారా, బలవర్థకమైన 'మాపిళై సాంబ'తోపాటు నెల్లూరు మొలకొలుకులు, తులసీబాసో, బాస్మతి, బహురూపి, చినుకుమిని, కుంకుమసాలి, దురేశ్వర్, పంచరత్న, రక్తశాలి, చింతలూరి సన్నం, కుజపటాలియా వంటివి ప్రముఖమైనవి. ఈ రకాలన్నీ ఆరోగ్య ప్రయోజనాలనిచ్చేవే.

దేశవాళీ సాగును ప్రోత్సహించడమే..



దేశవాళీ వరి వంగడాల్లో గణనీయమైన జన్యువైవిధ్యాలున్నాయి. వివిధ కారణాలతో అనేక రకాలు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. వీటి సంరక్షణకు మా వంతు కృషి చేస్తున్నాం. దేశవాళీ సాగు ఎప్పుడూ దెబ్బతీయదు. అత్యంత అధ్వాన్నమైన పరిస్థితుల్లోనూ కనీసం యాభై శాతం ఫలితాన్ని అందిస్తుంది.అందుకే రైతులకు విత్తనాలు అందించేందుకు వీలుగా తానా సహకారంతో భూమి భారతి విత్తన నిధిని ఏర్పాటు చేశాము. – యర్రు బాపన్న, సంప్రదాయ సాగు రైతు, అత్తోట

సుజలం.. సురక్షితం


సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రజలకు సురక్షిత తాగునీటి సరఫరా కోసం తీసుకుంటున్న చర్యల ద్వారా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే టాప్‌లో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. 'స్వచ్ఛ జల్ సే సురక్ష' పేరుతో గతేడాది అక్టోబర్ 2 నుంచి ఈ ఏడాది జనవరి 26 వరకు కేంద్ర జలశక్తి శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో దేశంలోని అన్ని గ్రామాల్లో సురక్షిత నీటి వాడకంపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అలాగే రాష్ట్రాల్లో రక్షిత తాగునీటి సరఫరాకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి మార్కులు కేటాయించింది. గ్రామీణ ప్రాంతాల్లోని తాగునీటి వనరులు(రక్షిత మంచినీటి పథకాలు, బోర్లు, బావులు తదితరాలు) వద్ద నీటి నాణ్యత పరీక్షల నిర్వహణను కేంద్ర జల శక్తి శాఖ పరిశీలించింది. అలాగే నీటిలో ఫ్లోరైడ్, నైట్రేట్ తదితర రసాయనాలతో పాటు ఈ–కోలి తదితర బ్యాక్టీరియా కారకాలను గుర్తించినప్పుడు ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను పరిగణనలోకి తీసుకుంది. వర్షాకాలం ముందు, తర్వాత నిర్వహించిన నీటి నాణ్యత పరీక్షల సంఖ్యను.. స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి వసతి సౌకర్యాలను, నాణ్యత పరీక్షల నిర్వహణకున్న వసతులు, అందులో స్థానిక మహిళలకు తగిన శిక్షణ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను కూడా కేంద్ర జల శక్తి శాఖ పరిశీలించింది. వీటన్నింటి ఆధారంగా 900 మార్కులకు గానురాష్ట్రాలకు మార్కులు కేటాయించింది. ఈసారి 900 మార్కులకు గాను 598 మార్కులతో తమిళనాడు మొదటి స్థానంలో నిలవగా.. ఆంధ్రప్రదేశ్ 568 మార్కులతో రెండో స్థానం దక్కించుకుంది.

96% నీటి వనరుల వద్ద నాణ్యత పరీక్షలు..

ఏపీలో 87 శాతానికి పైగా గ్రామాల్లో స్థానికంగానే తాగునీటి నాణ్యత పరీక్షల నిర్వహణకు అవసరమైన కిట్లను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచినట్లు కేంద్ర జలశక్తి శాఖ గణాంకాల్లో తేలింది. 18,393 గ్రామాలుండగా, 96 శాతానికి పైగా అంటే 17,772 గ్రామాల్లోని వనరుల వద్ద రెండు విడతల పాటు పరీక్షలు నిర్వహించినట్టు వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లో 1.64 లక్షల తాగునీటి వనరుల వద్ద పరీక్షలు నిర్వహించగా, 21,193 చోట్ల వివిధ రకాల కాలుష్య కారకాలను గుర్తించారని తెలిపింది. అందులో 20,739 చోట్ల ఏపీ ప్రభుత్వం అప్పటికప్పుడే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రక్షిత మంచినీటి వనరులు కల్పించినట్టు కేంద్ర జలశక్తి శాఖ పేర్కొంది.

రక్షిత తాగునీటిలో టాప్‌-10లో నిలిచిన రాష్ట్రాలు, అవి సాధించిన మార్కులు

రాష్ట్రం	మార్కులు (మొత్తం 900కి)		
తమిళనాడు	598	నాగాలాండ్	471.5
ఆంధ్రప్రదేశ్	568	లక్షద్వీప్	437
కర్ణాటక	533	మణిపూర్	390
హిమాచల్‌ప్రదేశ్	472	హరియాణా	377
		గుజరాత్	371
		పంజాబ్	364



తెలంగాణ

కొత్త కోడళ్ల భేటింగ్

- నాగోబా ఆలయంలో మెస్రం వంశీయుల పూజలు



ఇంద్రవెల్లి (ఖానాపూర్): ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో మెస్రం వంశీయుల పూజలు కొనసాగుతున్నాయి. కొత్త కోడళ్ల భేటింగ్ ఆదివారం వేకువజాము వరకు కొనసాగింది. ముందుగా ఆలయ సమీపంలోని గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేసి సంప్రదాయ వాయిద్యాలతో ఆలయానికి చేరుకున్నారు. 190 మంది కొత్త కోడళ్లు సతీదేవత ఆలయంలో పూజల అనంతరం భేటింగ్ (పరిచయం)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. ఉదయం కోనేరు నుంచి పవిత్ర జలాన్ని గోవడ్ వద్దకు తీసుకువచ్చారు. ఆ నీటితో నైవేద్యం తయారు చేసి నాగోబా, సతీదేవతలకు సమర్పించారు. ఈ ప్రక్రియ అనంతరం వారంతా మెస్రం వంశంలో చేరినట్లుగా భావిస్తారు. అనంతరం కొత్తకోడళ్లు దీక్ష విరమించారు. ఆదివారం జాతరకు భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈనెల 28 వరకు జాతర కొనసాగుతుందని ఈవో రాజమౌళి, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం తెలిపారు.



'కర్తవ్యపథ్'లో ప్రభల తీర్థం!

గణతంత్ర వేడుకల్లో అలరించనున్న ఆంధ్రప్రదేశ్ శకటం

సాక్షి, న్యూఢిల్లీ: తాటి శూలం, టేకు చెక్కలు, మర్రి ఊడలు, వెదురు బద్దలు, రంగురంగుల నూలు దారాలు, నెమలి పింఛాలు, వరి కంకులు, కూరగాయలు ఇలా శ్రమజీవుల కష్టాన్ని ఇంద్ర ధనస్సును మరిపించేలా, ఐకమత్యం ప్రస్ఫుటించేలా రూపొందించే 'ప్రభ'లు గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కర్తవ్యపథ్‌లో దేశ రాజధానికి కోనసీమ తీర్థాన్ని కళ్లకు చూపెట్టనున్నాయి. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా గురువారం నిర్వహించే శకటాల ప్రదర్శనలో 'కోనసీమ ప్రభల తీర్థం' థీమ్‌తో రూపొందిన ఏపీ శకటం ప్రత్యేక ఆకర్షణ కానుంది. సంక్రాంతి, కనుమ రోజుల్లో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఊరువాడా ఏకమై నిర్వహించే ప్రభల తీర్థానికి వందల సంవత్సరాల చరిత్ర ఉంది. గ్రామంలో అందరూ సుఖ సంతోషాలతో కరువు కాటకాలు లేకుండా జీవించాలని ఆశించి ఈ తీర్థం నిర్వహిస్తారని ఏపీ సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. సంక్రాంతి సంబరాలకు రైతు కుటుంబం ఎలా సన్నద్ధమవుతారు, పొలాల మధ్య నుంచి వరి కంకులతో ఎద్దుల బండి ఎలా వెళ్తుంది, ప్రభల తీర్థం నిర్వహణ, సంప్రదాయ గరగ నృత్యం ఇవన్నీ కలబోసి శకటం రూపొందించామని కిరణ్‌కుమార్ వివరించారు. కోనసీమ అందాలు చూపించే క్రమంలో వరిధాన్యం, కొబ్బరిచెట్లు వంటివి వాస్తవంగా అమర్చామని పేర్కొన్నారు.

ఫీజులు గుంజేసి.. బకాయిలు మింగేసి!

హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ట్రస్టు నిర్వాకాలు..

- కరోనా సాకుతో టీచర్లకు సగం జీతాలే
- విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు కాగానే బకాయిలన్నీ చెల్లిస్తామంటూ మోసం
- న్యాయ పోరాటానికి దిగిన అధ్యాపకులు..
- ప్రధాని కార్యాలయం, తెలంగాణ ప్రభుత్వానికి ఫిర్యాదు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: కరోనా విపత్తులోనూ విద్యార్థుల నుంచి ముక్కుపిండి మరీ ఫీజులు వసూలు చేసిన ఎన్టీఆర్ ట్రస్టు యాజమాన్యం అధ్యాపకులకు మాత్రం బకాయిలు చెల్లించకుండా ఎగ్గొట్టడంపై ప్రధాని కార్యాలయంతోపాటు తెలంగాణ ప్రభుత్వం, గవర్నర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులకు బాధితులు ఫిర్యాదు చేశారు. మరోవైపు దీనిపై న్యాయ పోరాటానికి కూడా దిగారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గండిపేట సమీపంలో హైస్కూలు, జూనియర్, డిగ్రీ కాలేజీలు నడుస్తున్నాయి. కాలేజీల్లో 900 మందికి పైగా, హైస్కూల్‌లో 500 మంది వరకు విద్యార్థులున్నారు. విద్యార్థుల నుంచి ఏటా రూ.1.50 లక్షల నుంచి రూ.1.75 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. కరోనా నేపథ్యంలో జీతాల్లో 50 శాతం తాత్కాలికంగా కోత విధిస్తున్నామని, ఫీజులు వసూలయ్యాక మినహాయించిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని 2020 మే 20వ తేదీన జూమ్ మీటింగ్‌లో ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో రాజేంద్రకుమార్ సిబ్బందికి హామీ ఇచ్చారు.

వంద మంది బోధనా సిబ్బంది, 20 మందికి పైగా బోధనేతర సిబ్బంది ఇక్కడ పని చేస్తుండగా రూ.పది వేలకు మించి జీతాలు చెల్లిస్తున్న వారికి 16 నెలలు కోత విధించారు. పలువురు అధ్యాపకులకు రూ.2 లక్షల నుంచి రూ.5.25 లక్షల వరకు జీతాల బకాయిలను ట్రస్టు చెల్లించాల్సి ఉంది. కరోనా కష్టకాలంలోనూ కళాశాల నుంచే ఆన్‌లైన్ ద్వారా తరగతులు నిర్వహించిన తమకు కనీసం హెల్త్‌కార్డులు ఇవ్వలేదని, గ్రాట్యుటీ ఊసే లేదని ఉద్యోగులు వాపోతున్నారు.

వసూలు చేసుకుని.. సిబ్బందికి చెల్లించలేదు..

కరోనా సమయంలో ఫీజులు రాలేదని పేర్కొన్న యాజమాన్యం ఆ తర్వాత విద్యార్థుల నుంచి వసూలు చేసుకున్నా.. సిబ్బందికి మాత్రం బకాయిలు చెల్లించలేదు.. ట్రస్టు సీఈవో, డీన్, ప్రిన్సిపాల్, ట్రస్టీలకు మొరపెట్టుకున్నా స్పందన శూన్యం.. చివరకు చంద్రబాబు, భువనేశ్వరి, లోకేష్‌కు తెలియజేసినా కూడా పట్టించుకోలేదు.. అంటూ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని నిర్వాహకులను కోరినందుకు ఓ లెక్చరర్‌ను రెండు గంటల్లో ఇంటికి సాగనంపారు. మరో లెక్చరర్ నుంచి క్షమాపణ లేఖ తీసుకుని హెచ్చరించారు.

9 మందికి లీగల్ నోటీసులు

బకాయిల గురించి యాజమాన్యం స్పందించకపోవడంతో తొమ్మిది మంది లెక్చరర్లు ట్రస్టు సీఈవోతో సహా నిర్వాహకులకు లీగల్ నోటీసులు పంపారు. ఏ నెల జీతంలో ఎంత కోత విధించారనే వివరాలను నోటీసుల్లో పొందుపరిచారు.

రూ.5.25 లక్షల వరకు రావాలి

మా సహచరులకు రెండు లక్షల నుంచి గరిష్ఠంగా రూ.5.25 లక్షల వరకు ట్రస్టు జీతాల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఉద్యోగులు సామాన్య, మధ్య తరగతికి చెందిన వారే. ఏడాదిన్నర కిందట విద్యార్థుల నుంచి వసూలుచేసుకున్నప్పటికీ ఇవ్వకపోవడమంటే మోసగించినట్లే.

– సాయి సంతోష్ చాగంటి, సంస్కృతం లెక్చరర్

ఎంతో గొప్పగా భావిస్తే..

ఎన్టీఆర్ పేరుతో నిర్వహిస్తున్న కాలేజీలో పనిచేయడాన్ని ఎంతో గొప్పగా భావించాం. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు కాగానే జీతం బకాయిలు మొత్తం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో గుర్తు చేశాం. ఎన్నిసార్లు అడిగినా స్పందించకపోవడంతో బయటకు వచ్చేశాం.

– పి.వినోద్, ఇంగ్లీష్ లెక్చరర్

పోటీపరీక్షలకూ బోధించాం

కాలేజీలో రెగ్యులర్ పాఠాలతో పాటు పోటీ పరీక్షలకు కూడా బోధించాం. సీశాట్, క్లాట్, ఐపీఎం, లాసెట్ తదితర పోటీపరీక్షలలో విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. నిర్వాహకుల తీరువల్ల ఎన్టీఆర్ పేరు ప్రతిష్ఠలకు భంగం వాటిల్లుతోంది.

– విజయదుర్గాప్రసాద్, మ్యాథ్స్ లెక్చరర్

చేరువలో చికిత్స

సాక్షి, అమరావతి: గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో జనాభా 9 లక్షలు. టీడీపీ హయాంలో ఇక్కడ 13 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మాత్రమే ఉండేవి. అంటే సుమారు 70 వేల మందికి ఒకటన్న మాట. వీటిలోనూ వైద్యులు, సిబ్బంది కొరత ఉండేది. దగ్గు, జలుబు, జ్వరం వంటి చిన్న సమస్యలకు కూడా జీజీహెచ్‌కువెళ్లాల్సి వచ్చేది. ఇక్కడ రోగుల తాకిడి ఎక్కువగా ఉండటంతో ప్రజలు ప్రైవేట్ క్లినిక్‌లను ఆశ్రయించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రజారోగ్యానికి పెద్దపీట వేసింది. నగరంలో ఉన్న 13 ఆరోగ్య కేంద్రాలకు అదనంగా మరో 17 కలిపి మొత్తంగా 30 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు మరింత చేరువయ్యాయి. అదే విధంగా విశాఖలో గతంలో 24 ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం 63 ఉన్నాయి. విజయవాడలో గతంలో 29 ఉండగా, ప్రస్తుతం 41 అందుబాటులోకి వచ్చాయి. గుంటూరు, విశాఖ, విజయవాడ నగరాల తరహాలోనే రాష్ట్ర వ్యాప్తంగా 120 మున్సిపాలిటీల్లోని ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చేరువ చేసింది. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు సైతం పట్టణ ప్రజలు జీజీహెచ్, జిల్లా, ఏరియా ఆస్పత్రులు, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా చేసింది. ఇందుకోసం నగర, పట్టణ ప్రాంతాల్లో కొత్తగా మరిన్ని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను వైద్య శాఖ



గుంటూరు నగరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో మలేరియా పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

నెలకొల్పింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 73 మున్సిపాలిటీల్లో కేవలం 259 అర్బన్ ప్రిలిమినరీ హెల్త్ సెంటర్లు మాత్రమే ఉండేవి. ఈ నేపథ్యంలో.. పట్టణాల్లో మధ్యతరగతి, పేద ప్రజలు సర్కార్ వైద్యం కోసం పడుతున్న అగచాట్లను సీఎం వైఎస్ జగన్ సర్కార్ గుర్తించింది. వీటిని అధిగమించి వారికి వైద్యం మరింత చేరువ చేయాలని నిర్ణయించింది. 25 వేల మంది జనాభాకు ఒకటి చొప్పున అర్బన్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడంలో భాగంగా గత టీడీపీ హయాంలో ఉన్న 259కి అదనంగా మరో 301 కేంద్రాలను కలిపి, మొత్తంగా 560 క్లినిక్‌ల ఏర్పాటుకు సంకల్పించింది. ప్రస్తుతం 542 చోట్ల వైద్య సేవలు అందుతున్నాయి.

టెలీ మెడిసిన్‌తో అత్యాధునిక వైద్యం

542 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రోజుకు సగటున 18,970 మంది వైద్య సేవలు పొందుతున్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య రాష్ట్ర వ్యాప్తంగా 43,10,363 మంది వైద్య సేవలు పొందారు. క్లినిక్‌లలో టెలీమెడిసిన్ సౌకర్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీంతో జనరల్ మెడిసిన్, గైనిక్, పీడియాట్రిషన్ వంటి స్పెషలిస్ట్ వైద్యుల కన్సల్టేషన్ సైతం ప్రజలకు ఇక్కడే లభిస్తోంది. ఇలా 7.86 లక్షల మంది టెలీ మెడిసిన్ సేవలు పొందారు. 216 రకాల మందులు, 60 రకాల వైద్య పరీక్షలు ఇక్కడ అందుబాటులో ఉంటున్నాయి. వైద్య పరీక్షల కోసం సెమీ ఆటోమేటిక్ బయోకెమిస్ట్రీ అనలైజర్, 3–పార్ట్ హెమటాలజీ అనలైజర్ సహా పలు పరికరాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. గత 9 నెలల్లో 7.51 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రిపోర్టులను నేరుగా రోగుల వాట్సాప్‌కే పంపుతున్నారు. ఈహెచ్‌ఆర్ (ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్) విధానంలో రోగులకు అందించిన వైద్య సేవల వివరాలను వారి డిజిటల్ హెల్త్ ఖాతాల్లోకి అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు 15.09 లక్షల మంది హెల్త్ రికార్డులను వారి డిజిటల్ హెల్త్ ఖాతాలకు అనుసంధానించారు.

సొంత భవనాల నిర్మాణం

క్లినిక్‌ల కోసం సొంత భవనాలు సమకూర్చడంపైనా నాడు–నేడు కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో ఇప్పటికే ఉన్న 184 సొంత భవనాలకు మరమ్మతులు చేపట్టింది. మిగిలిన వాటి కోసం కొత్త భవనాల నిర్మాణం చేపడుతోంది. కొత్త భవనం నిర్మాణానికి రూ.80 లక్షలు, మరమ్మతులకు రూ.10 లక్షల చొప్పున వెచ్చిస్తున్నారు. ఇలా రూ.374.61 కోట్లతో సొంత భవనాలను సమకూరుస్తున్నారు. నిర్మాణం పూర్తయిన 116 కొత్త భవనాలను ప్రారంభించి, వాటిల్లో సేవలు మొదలుపెట్టారు.

ప్రజలు ఇబ్బంది పడకూడదనేదే లక్ష్యం



ప్రాథమిక వైద్యం కోసం పట్టణ ప్రజలు ఇబ్బంది పడకూడదు అనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగా వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య సేవలను వారికి చేరువ చేస్తున్నాం. జాతీయ ప్రమాణాలతో వనరులు సమకూరుస్తున్నాం. నగర, పట్టణ ప్రజలు క్లినిక్‌లలో వైద్య సేవలు వినియోగించుకోవాలి.

– జె.నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్

త్వరలో 'అల్ట్రా సౌండ్' సేవలు

- రాష్ట్ర వ్యాప్తంగా 90 కేంద్రాలకు స్కానింగ్ పరికరాలు

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అల్ట్రాసౌండ్ స్కాన్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు వైద్య శాఖ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. రాష్ట్రంలో 542 ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న క్రమంలో చిన్న మున్సిపాలిటీల్లో కనీసం ఒకటి, పెద్ద మున్సిపాలిటీల్లో, మున్సిపల్ కార్పొరేషన్లలో ఆరు ఆరోగ్య కేంద్రాలకు ఒకటి చొప్పున 90 అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరాలను ప్రభుత్వం సరఫరా చేసింది. ఒక్కో పరికరం రూ.2.45 లక్షల చొప్పున 90 పరికరాలను రూ.2,20,50,000తో కొనుగోలు చేసింది. అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు అందించేందుకు వీలుగా ఆయా ఆస్పత్రులు, డయగ్నోసిస్ సెంటర్లను ప్రీ–కాన్సెప్షన్, ప్రీ–నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్‌డీటీ) చట్టం కింద రిజిస్ట్రేషన్ చేయాల్సిందిగా డీఎంహెచ్‌ఓలందరికీ వైద్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇది పూర్తవ్వగానే సేవలు ప్రారంభిస్తామని పట్టణ ఆరోగ్య కేంద్రాల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి 'సాక్షి'కి తెలిపారు. ఈ సేవలు అందుబాటులోకి రావడం ద్వారా నగరాలు, పట్టణాల్లోని గర్భిణులకు కడుపులో ఉమ్మనీరు స్థాయి, పుట్టబోయే బిడ్డకు వెన్నెముక, గుండె, ఇతర సమస్యలేమైనా ఉన్నాయో లేదో తెలుసుకోవచ్చు. వీటితో పాటు సాధారణ ప్రజలకు అల్ట్రాసౌండ్ స్కాన్ ద్వారా కడుపునొప్పి, గాల్‌బ్లాడర్, కిడ్నీలో రాళ్లు, కిడ్నీవాపు, అపెండిక్స్, ఇతర సమస్యలను నిర్ధారించవచ్చు. కాగా, విశాఖపట్నంలో 11, విజయవాడలో 8, గుంటూరులో 4, మిగతా నగరాలు, పట్టణాల్లో 3, 2, 1 చొప్పున ఈ పరికరాలను ఏర్పాటు చేశారు.

వేట.. ఇక ఈజీ

సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న మత్స్యకారులు

- చేపల వేటలో జీపీఎస్, ఎకో సౌండ్ ఫిష్ ఫైండర్ వినియోగం
- వాటి సాయంతో సులభంగా, దండిగా చేపలను ఒడిసిపడుతున్న వైనం



మత్స్యకారుల ఆధునిక పడవలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: చేపల వేటే జీవనాధారంగా బతుకుతున్న మత్స్యకారులు ఆధునిక సాంకేతికత వైపు అడుగులేస్తున్నారు. భారీ వలలతో సాగర మథనం చేసినా చేపలు చిక్కక ఉస్సూరుమంటూ వెనుదిరిగే పరిస్థితులను అధిగమిస్తూ.. ఇప్పుడు సులభంగా, దండిగా చేపలను ఒడిసిపట్టేస్తున్నారు. కెమెరాలు, జీపీఎస్‌లు, ఎకో సౌండ్ సిస్టమ్‌ను ఉపయోగిస్తూ సముద్రగర్భంలోని మత్స్య సంపదను వెలికితీస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 12 మండలాల పరిధిలో 169 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉండగా.. దాని వెంబడి ఉన్న 98 గ్రామాల్లో సుమారు 1.50 లక్షల మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. అందులో దాదాపు 41 వేల మంది చేపల వేటే జీవనాధారంగా బతుకుతున్నారు.

శబ్ద తరంగాలతో పట్టేస్తున్నారు..

ఈ క్రమంలో మత్స్యకారులు చేపల వేటకు కూడా సాంకేతికత ఉపయోగించడం మొదలుపెట్టారు. ప్రస్తుతం పెద్ద బోట్లు, కొన్ని పడవల్లో జీపీఎస్, ఎకో సౌండ్ ఫిష్ ఫైండర్ ఉపయోగించి చేపల వేట సాగిస్తున్నారు. ఇందులో భాగంగా బోటు కింద వైపు కెమెరా అమర్చుతారు. బోటు లోపల కెమెరా అనుసంధానంతో చిన్న స్క్రీన్‌తో కూడిన కంప్యూటర్ లాంటి పరికరం పెడతారు. ఆ బోటు సముద్రంలో బాగా లోపలికి వెళ్లాక.. ఎకో సౌండ్ ఫిష్ ఫైండర్‌ను ఆన్ చేస్తారు. సముద్రం లోతు, చేపల చలనం తదితరాలు ఫిష్ ఫైండర్ పరికరంలో కనిపిస్తుంటుంది. చేపలు గుంపుగా వచ్చినప్పుడు.. అవి తమకు అనుకూలంగా దొరికేలా శబ్ద తరంగాలు విడుదల చేస్తారు. వాటి వల్ల చేపలు రివర్స్‌లో వస్తాయి. ఆ చేపలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో చూసి.. వల విసురుతారు. దీంతో చేపలు సులభంగా దొరుకుతాయి.

సాంకేతికత వైపు అడుగులు..

గతంలో చెక్క తెప్పపై తెరచాప ఆధారంగా సముద్రంపై వేట సాగిస్తూ తాము వేసిన వలను మరొక తెప్ప ధ్వంసం చేయకుండా.. నీటిపై తేలియాడేలా కిరోసిన్ లాంతరును వల వేసిన చోట గుర్తుగా వదిలేవారు. ప్రస్తుతం బ్యాటరీలతో తయారు చేసిన ఎల్‌ఈడీ బల్బులను ఇందుకు ఉపయోగిస్తున్నారు. అలాగే ఇప్పుడు పూర్తిగా ఫైబర్ బోట్లు అందుబాటులోకి వచ్చేశాయి. అప్పట్లో ఒక రోజుకు మించి సముద్రంలో ఉండేవారు కాదు. ప్రస్తుతం వారం నుంచి 15 రోజుల పాటు సముద్రంలో వేట సాగించగలుగుతున్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేని చోట్ల.. బోట్ల ఇంజిన్లు చెడిపోయినా, విపత్కర పరిస్థితులు ఎదురైనా.. ప్రభుత్వం తెచ్చిన జీపీఎస్ వ్యవస్థ వీరిని ఆదుకుంటోంది. వారు నడి సంద్రంలో ఎక్కడ చిక్కుకున్నా.. వెంటనే గుర్తించి కాపాడగలుగుతున్నారు.



వేటకు వెళ్లే ముందు వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

ఖర్చు ఎక్కువ.. వేట సులభం

ఎకో సౌండ్ ఫిష్ ఫైండర్ ద్వారా చేపలు పట్టే విధానం సులభంగా ఉంటుంది. తమిళనాడులో ఎక్కువ మంది దీనిని ఉపయోగిస్తున్నారు. మన దగ్గర కూడా కొంతమంది దీనిని వాడుతున్నారు. దీన్ని ఉపయోగించాలంటే రూ.70 వేల విలువైన పరికరాలు కావాలి. చాలా మంది చేపలు ఎక్కడుంటాయో తెలియక.. వలకు చేపలు చిక్కక ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక పథకాల ద్వారా మమ్మల్ని ఆదుకుంటోంది. ఇలాంటి సాంకేతికతను కూడా అందిస్తే ఇంకా అభివృద్ధి చెందుతాం.



– మత్స్యకారులు అర్ముగం, కె.సురేష్

ఎనర్జీ ఫోర్‌కాస్టింగ్‌పై రాష్ట్రాల ఆసక్తి

- 2 నెలల్లో 6 జాతీయ అవార్డులు సాధించిన ఏపీ విద్యుత్ సంస్థలు
- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

సాక్షి, అమరావతి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అందుకున్న నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డుతో పాటు రెండునెలల వ్యవధిలోనే ఏపీ విద్యుత్ సంస్థలు జాతీయస్థాయిలో ఆరు ప్రధాన అవార్డులను సాధించి దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెప్పారు. ఏపీ ట్రాన్స్‌కో రెండు స్కోచ్ అవార్డులు (గోల్డ్, సిల్వర్) గెల్చుకున్న సందర్భంగా ఇంధనశాఖ అధికారులతో ఆదివారం వర్చువల్‌గా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమిళనాడు, రాజస్థాన్ మొదలైన అనేక రాష్ట్రాలు ఏపీ ఎనర్జీ ఫోర్‌కాస్టింగ్ మోడల్‌పై ఆసక్తిని కనబరిచాయని తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, నెట్‌క్యాప్ చేపట్టిన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ పరిరక్షణమిషన్ (ఏపీఎస్ఈసీఎం) చేపట్టిన ఇంధన సామర్థ్య కార్యక్రమాల వివరాలను అందజేయాలని పలు రాష్ట్రాలు కోరాయని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లక్ష్యానికి విద్యుత్ సంస్థలు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలు సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు. ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్ మాట్లాడుతూ ట్రాన్స్‌కో చేపట్టిన వివిధ వినూత్న కార్యక్రమాలను వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మూడు 400 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌కోలో ఎనర్జీ ఫోర్‌కాస్టింగ్ మోడల్, జీఐఎస్ సిస్టం ప్రవేశపెట్టడంలో కీలకపాత్ర పోషించిన ట్రాన్స్‌కో డైరెక్టర్ (గ్రిడ్) భాస్కర్‌ను, ఇంజనీర్లను అభినందించారు. ట్రాన్స్‌కో జేఎండీలు పృధ్వీతేజ్, మల్లారెడ్డి, ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

నేడు పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల ప్రదానం

ఏపీ బాలిక మీనాక్షికి అందజేయనున్న రాష్ట్రపతి

సాక్షి, న్యూఢిల్లీ : ఆరు విభాగాల్లో అసాధారణ విజయాలు సాధించిన 11 మంది చిన్నారులకు సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2023 అవార్డులు అందజేయనున్నారు. విశాఖపట్నానికి చెందిన 11 ఏళ్ల చెస్ క్రీడాకారిణి అలానా మీనాక్షి కూడా అవార్డు అందుకోనున్నారు. కళ, సంస్కృతి విభాగంలో నలుగురు, శౌర్యం విభాగంలో ఒకరు, నూతన ఆవిష్కరణలలో ఇద్దరు, సామాజిక సేవలో ఒకరు, క్రీడా విభాగంలో ముగ్గురు మొత్తంగా 11 మంది చిన్నారులను 2023 పీఎం రాష్ట్రీయ బాల పురస్కారాలకు ఎంపిక చేశారు. అవార్డు గ్రహీతలకు పతకం, రూ.లక్ష నగదు బహుమతి, ధ్రువపత్రం అందజేయనున్నారు. ఈ నెల 24న అవార్డు గ్రహీతలతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీలు సంభాషించనున్నారు. కాగా, పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్‌కు ఎంపికైన విశాఖ చెస్ క్రీడాకారిణి మీనాక్షిని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ఆదివారం ట్విట్టర్ ద్వారా అభినందించారు.

తెలంగాణ

ముగ్గురు బిడ్డలను రోడ్డుపై వదిలేసి..

ప్రియుడితో వెళ్లిపోయిన మహిళ

- కన్న బిడ్డలపై తల్లి కర్కశత్వం
- యాదగిరిగుట్టలో ఆలస్యంగా వెలుగులోకి
- అధికారుల సంరక్షణలో చిన్నారులు

యాదగిరిగుట్ట: అమ్మతనానికి ఓ తల్లి మాయని మచ్చ తెచ్చింది. పేగు తెంచుకుని పుట్టిన ముగ్గురు చిన్నారులను నడిరోడ్డుపై వదిలేసి ప్రియుడితో కలసి వెళ్లిపోయింది. ఎముకలు కొరికే చలిలో ఆ చిన్నారులు తల్లి కోసం రోదిస్తూ పడిన వేదన వర్ణనాతీతం. చివరకు పోలీసులు పిల్లలను చేరదీసి బాలల పరిరక్షణ అధికారులకు అప్పగించారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన లక్ష్మి పన్నెండేళ్ల క్రితం బాబుని ప్రేమించి వివాహం చేసుకుంది. కానీ తరచూ గొడవల కారణంగా లక్ష్మి భర్త బాబు.. మూడేళ్ల క్రితం కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయాడు. అప్పటికే వీరికి లక్ష్మణ్ (8), రాజేశ్వరి (7), రేవంత్ (5) అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త వెళ్లిపోవడంతో లక్ష్మి.. పిల్లలను చూసుకుంటూ చిన్న చిన్న పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ క్రమంలో అక్కడే నివాసం ఉండే ఓ ఆటో డ్రైవర్‌తో లక్ష్మికి పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారడంతో అతడితో సహజీవనం చేస్తోంది.

పిల్లలు అడ్డుగా ఉన్నారని..

ఆటో డ్రైవర్ రాజుతో సహజీవనం చేస్తున్న తరుణంలో లక్ష్మి తన ముగ్గురు పిల్లల అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగానే ఈ నెల 14వ తేదీన ఆటో డ్రైవర్ రాజుతో కలసి యాదగిరిగుట్టకు వచ్చింది. ఆ రోజు రాత్రి తమతో వచ్చిన ముగ్గురు పిల్లలను యాదగిరిగుట్ట పట్టణ పరిసరాల్లో వదిలేసి.. లక్ష్మి, ఆటో డ్రైవర్ రాజుతో కలసి వెళ్లిపోయింది. దీంతో ఎముకలు కొరికే చలిలో ఆ రోజు రాత్రంతా ముగ్గురు పిల్లలు పట్టణంలోనే ఏడుస్తూ ఉండి పోయారు. మరుసటి రోజు ఉదయం యాదాద్రి కొండపైకి వెళ్లే మార్గంలోని పార్కింగ్ వద్ద చిన్నారులు ఏడుస్తూ తిరుగుతుండగా.. ట్రాఫిక్ కానిస్టేబుల్ కోటి వీరిని గమనించి పట్టణ పోలీస్ స్టేషన్‌లోని ఎస్‌ఐ సుధాకర్‌రావు దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడ ఎస్‌ఐ పిల్లలకు టిఫిన్ చేయించి, వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైల్డ్ వెల్ఫేర్ సొసైటీ, చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ (సీడబ్ల్యూసీ) అధికారులకు అప్పగించారు.

సంబంధం లేదన్న పెదనాన్న

ఈ నేపథ్యంలో అధికారులు చిన్నారులను ఈ నెల 17వ తేదీన భువనగిరిలో విచారించారు. తల్లి తమను యాదగిరిగుట్టలో వదిలేసి మరో వ్యక్తిని వివాహం చేసుకొని వెళ్లిపోయిందని పిల్లలు తెలిపారు. దీంతో చిన్నారుల పెదనాన్న జంగయ్యకు ఫోన్ చేసి భువనగిరికి పిలిపించగా జంగయ్య.. ఆ పిల్లలతో తమకు సంబంధం లేదని చెప్పి వెళ్లిపోయినట్టు తెలిసింది. ఈ పరిణామంతో చిన్నారులు రంగారెడ్డి జిల్లాకు చెందిన వారు కావడంతో వారిని ఆ జిల్లా శిశుసంరక్షణ అధికారులకు అప్పగించారు. ప్రస్తుతం ఐదేళ్ల రేవంత్ రంగారెడ్డి శిశు గృహంలో, మరో ఇద్దరు పిల్లలు రాజేంద్రనగర్‌లోని చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సైదులు, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జయశ్రీ వెల్లడించారు.

ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో ఏపీకి అవార్డు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు రెండవ స్థానం



కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ నుంచి అవార్డు అందుకుంటున్న ప్రభాకర్

సాక్షి, అమరావతి: 'చిరు ధాన్యాలు–సేంద్రీయ ఉత్పత్తులు–2023'పై బెంగళూరులో మూడు రోజులపాటు జరిగిన ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో రైతు సాధికార సంస్థకు రెండవ బహుమతి దక్కింది. ఈ ట్రేడ్ ఫెయిర్‌లో ఆంధ్రప్రదేశ్‌తోపాటు మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, కేరళ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ నేతృత్వంలో 16 జిల్లాలకు చెందిన 50 మంది రైతులు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. మొదటి స్థానాన్ని కర్ణాటక కైవసం చేసుకోగా, రెండో స్థానాన్ని ఆంధ్రప్రదేశ్ పొందింది. నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు ప్రదర్శించడంతో ఏపీకి ఈ గౌరవం దక్కింది. ట్రేడ్ ఫెయిర్ ముగింపు సందర్భంగా ఆదివారం కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ నుంచి రైతుసాధికార సంస్థ అధికారి ప్రభాకర్ ఈ అవార్డును అందుకున్నారు. ఏపీ రైతుసాధికార సంస్థ అధికారులు వెంకట్రావు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు లక్ష్మానాయక్, రామకృష్ణ రాజు, అమలకుమారి, ఎలియాజర్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

క్రిసెంట్ క్రికెట్‌కప్ ట్రోఫీ ఆవిష్కరణలో తెలంగాణ మంత్రి తలసాని పిలుపు

సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. హైదరాబాద్ అందమైన నగరమని, లవబుల్, లివబుల్ సిటీ అని, ఇలాంటి నగరం నుంచి ఈ డ్రగ్స్‌ను తరిమికొట్టడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. సామాజిక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి ఏడాది సినీతారలతో క్రిసెంట్ క్రికెట్ కప్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈసారి ఫిబ్రవరి 26 తేదీన 'సే నో టు డ్రగ్స్ నినాదం'తో నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో బాలీవుడ్, టాలీవుడ్ నటుల మధ్య డే అండ్ నైట్ టీ–20 క్రికెట్ మ్యాచ్ నిర్వహించనున్నారు. ఈ పోటీలకు సంబంధించిన ట్రోఫీని హయత్ ప్లేస్ వేదికగా డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రి తలసాని, బాలీవుడ్ టీం కెప్టెన్ అర్బాజ్ ఖాన్, సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.రాజేశ్‌చంద్ర, పలువురు టాలీవుడ్ నటులు ఆవిష్కరించారు. తలసాని మాట్లాడుతూ విద్యార్థులు, యువత డ్రగ్స్ బారిన పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. టాలీవుడ్ నటులు 'సే నో టు డ్రగ్స్'పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ నుంచి అన్నివిధాలా సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బాలీవుడ్ స్టార్ అర్బాజ్‌ఖాన్‌తోపాటు బిగ్‌బాస్ విన్నర్ రేవంత్, ప్లేబ్యాక్ సింగర్ శ్రీరామచంద్ర, టాలీవుడ్ నటులు రాజ్‌తరుణ్, వీజే సన్నీ, వరుణ్ సందేశ్, తనీష్, ఖయ్యూం, రవిప్రకాష్, సోహెల్, షఫీ, అమీత్, శ్రావణ్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

డాబా.. మేడ.. మిద్దె.. పేరేదైనా.. ప్రతి ఒక్కరి జీవితంలో దీనితో అనుబంధం ఉంటుంది. చిన్నప్పుడు అమ్మ డాబాపై నుంచి చందమామను చూపిస్తూ గోరుముద్దలు తినిపించడం .. డాబాపై పరుగెత్తుతూ గాలి పటాలు ఎగరేసిన క్షణాలు ఎవ్వరూ మర్చిపోరు. నిండు వెన్నెల్లో.. చల్లని పైరుగాలి తాకుతుంటే.. డాబాపై కూర్చొని.. కుటుంబమంతా కబుర్లతో కాలక్షేపం చేస్తూ మునిగిపోయిన రోజులెన్నో.. ఇలా చెప్పుకుంటూ పోతే డాబాతో పెనవేసుకున్న బంధాలు ఎవర్‌గ్రీన్. ఆ మధురమైన జ్ఞాపకాలను పదిలపరుచుకుంటూ.. నగరంలో చాలా మంది తమ మిద్దెలను వ్యవసాయ క్షేత్రాలుగా మార్చి సేద్యం చేస్తున్నారు. మేడను.. ఇంటి ఆవరణలోని ఖాళీ ప్రదేశాల్లో తమకు అవసరమైన కూరగాయల సాగు ప్రారంభించి.. ఒత్తిడిని దూరం చేసుకుంటూ ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. పచ్చని పూల వనాలతో.. కూరగాయల తోటలతో ఆ గృహాలు నందనవనంలా మురిపిస్తున్నాయి.

రావు గారి ఇంట.. ఆరోగ్యాల పంట

ఇంటి మిద్దెపై కూరగాయల సాగు

విశ్రాంత ఉద్యోగ దంపతుల ఆదర్శం

ఏయూక్యాంపస్: ఎంవీపీకాలనీలో నివాసం ఉంటున్న కె.ఎం.రావు, లలిత దంపతులు ప్రభుత్వ శాఖల్లో పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. మొదట్లో ఇంటి ఆవరణలోని కొద్దిపాటి ఖాళీ స్థలంలో సరదాగా పువ్వుల మొక్కలు, ఆనప, కాకర వంటి పాదులు వేశారు. తర్వాత కాలంలో పూర్తిగా డాబాను మిద్దెతోట ఏర్పాటుకు కేటాయించారు. ఎనిమిదేళ్లుగా వీరు కూరలు పండిస్తూ అందరికీ పంచిపెడుతున్నారు. ఇందుకోసం రెండు అంతస్తుల్లో మొక్కలు పెంచడానికి అవసరమైన కుండీలను ప్రత్యేకంగా నిర్మించుకున్నారు. రెండంతస్తుల్లో ఉన్న ఖాళీ జాగాన్ని పూర్తిగా ఆకుకూరలు, కూరగాయలు పెంపకానికి వినియోగిస్తున్నారు.

ఇంటికి సరిపడే కూరలు

ప్రస్తుతం వీరి మేడ మీద పొట్ల, దొండ, కాకర, బీర, వంగ, బెండ, టమాటా, మిరప, ఆనప, చిక్కుడు వంటి కూరలు సాగు చేస్తున్నారు. వీటితో పాటు పాలకూర, కరివేపాకు, చుక్కకూర, తోటకూర, కొత్తిమీర వంటి ఆకుకూరలు పండిస్తున్నారు. మేడ మీద కుండీలో వేసిన నిమ్మ మొక్క ఏపుగా పెరగడంతో పాటు నిండుగా కాయలతో దర్శనమిస్తోంది. అంజీర, డ్రాగన్ ఫ్రూట్ వంటివి ఇక్కడ పండిస్తున్నారు. ఆహ్లాదాన్ని పంచే పూల మొక్కలు పదుల సంఖ్యలో ఇక్కడ కనువిందు చేస్తున్నాయి. సీజన్‌కు తగ్గట్టుగా విభిన్న రంగుల పువ్వులు ఇక్కడ దర్శనమిస్తున్నాయి.



కె.ఎం.రావు ఇంటిపై విస్తరించిన మిద్దెతోట

గోసేవ.. నిత్యకృత్యం

గోసేవ చేయడం అలవాటుగా మార్చుకున్నారు. నిత్యం తమ ఇంటి వద్దకు వచ్చే ఆవులకు ఆహారం అందిస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో నానపెట్టిన మినప, పెసర, గోధుమ పొట్టును గోవులకు పెట్టడం వీరి దినచర్యలో భాగంగా మారిపోయింది. ఈ గోవులకు వీరు ముద్దుగా పిల్లలొచ్చారు అంటూ సంబోధిస్తూ ప్రేమగా చూస్తున్నారు. ఉదయం వేళలో యోగా సాధన చేయడం, తర్వాత గోసేవ, సాయంత్రం వేళల్లో ప్రకృతి మధ్యలో మొక్కలతో గడపడం వీరికి నిత్య కృత్యం. ప్రకృతికి దగ్గరగా జీవించడం అలవాటు చేసుకున్న వీరి ఇంటికి నిత్యం పక్షులు, ఉడతలు, రామచిలుకలు వస్తుంటాయి. వీటికి ఆహారం అందించడం అలవాటుగా మార్చుకున్నారీ దంపతులు.

సేంద్రియ విధానంలో..

వీరు మిద్దె పంటలన్నీ పూర్తిగా సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నారు. దేశీయ ఆవు పేడ, జీవామృతం, సహజ జీవ ఎరువులు వినియోగిస్తున్నారు. స్వయంగా జీవామృతం తయారు చేసుకుంటున్నారు. పంటలకు ఎటువంటి చీడ పీడలు వచ్చినా సేంద్రియ విధానాలతో చికిత్స చేస్తున్నారు.



సిద్ధమైన ముల్లంగా పంట

కోవిడ్ సమయంలో సంజీవని

కోవిడ్ విపత్తు సమయంలో మిద్దెతోటలో పండించిన కూరగాయలతో కె.ఎం.రావు, లలిత దంపతులు ఆనందగా గడిపేశారు. బయట మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనాల్సిన అవసరం లేకుండా.. కోవిడ్ బారిన పడకుండా మిద్దెతోట ఎంతగానో ఉపకరించింది.

కాయలతో అంజీరా మొక్క



ఇల్లే వనం.. ఆనందమయం

- 15 ఏళ్లుగా సేద్యం చేస్తున్న లీలావతి
- సొంతంగా ఎరువుల తయారీ







కాలీఫ్లవర్ మొక్క, విరగ్గాసిన చిక్కుడు కాయలు, సీజనల్ ఫ్లవర్

మురళీనగర్(విశాఖ ఉత్తర): అయ్యప్పనగర్‌కు చెందిన అనిశెట్టి లీలావతి తన ఇంటి పరిసరాలు, ఇంటి మిద్దెను వ్యవసాయ క్షేత్రంగా మార్చి.. కూరగాయల సేద్యం చేస్తున్నారు. ఎన్నో రకాల కూరలు, పండ్లు, పూలు, పూజా సామగ్రికి ఉపయోగపడే పత్రులు పెంచుతూ.. ఇంటినే ఒక వనంగా మార్చేశారు. సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తూ.. ఆరోగ్యాన్ని, మానసిక ఆనందాన్ని పొందుతున్నారు. ఆమె ఇంటికి వెళ్తే ఆత్మీయంగా స్వాగతం పలికి.. మంచి కాఫీతో పాటు కూరగాయలను బహుమతిగా అందిస్తారు.

జీట వేసిందా.. విత్తనం వేయాల్సిందే..

పూలకుండీ.. గోనె సంచీ.. గోడ సందు.. గచ్చు పగుళ్లు.. ఏదీ మొక్క పెంపకానికి అనర్హం కాదు.. మనసు పెట్టి చేస్తే.. మొక్క మొలిచి చూపుతుంది అని అంటున్నారు లీలావతి. ఆమె భర్త నేవల్ డాక్‌యార్డు విశ్రాంత ఉద్యోగి బాబూ రాజేంద్రప్రసాద్‌తో కలిసి అయ్యప్పనగర్(మురళీనగర్ ఈస్ట్)లో 1985 నుంచి నివసిస్తున్నారు. ఆమె 15 ఏళ్లుగా మిద్దెపై సేద్యం చేస్తున్నారు. కరోనా రెండేళ్ల కాలంలో తను పండించిన కూరగాయలు తమ అవసరాలకు సరిపోతూ.. చుట్టు పక్కల వారికి అందించినట్లు లీలావతి చెప్పారు. సాధారణంగా ఇంటి గచ్చులు, ప్రహరీ పగుళ్లు వస్తే ఆందోళన చెంది వాటి మరమ్మతులకు నానా హైరానా పడిపోతాం. కానీ లీలావతి ఆ పగుళ్లను క్రీపర్స్ విత్తనాలను నాటేందుకు అనుకూలంగా మారుస్తారు. చిన్న రంధ్రం కనిపిస్తే అందులో ఒక మొక్కను నాటుతారు. ప్రహరీల మధ్య సందులో మట్టిలోకి విత్తనాలను పంపి పెంచుతారు. పాడైన బకెట్లు, పాత సామాన్ల షాపు వద్ద వాటర్ టిన్లు కొనుగోలు చేసి.. వాటిని సైజు చేసి అందులో మొక్కలు వేస్తారు. తవ్వకాల సమయంలో మట్టిని సేకరించి నిల్వ చేస్తారు. గోడల ఇరుకు సందుల్లో పాదులు వేసి వాటిని మేడ పైకి పాకిస్తారు.




మిద్దె గోడపై పూలమొక్కలు

అతి తక్కువ ఖర్చుతో ఇంటి పంటలు

అతి తక్కువ ఖర్చుతో ఆమె పంటలు పంటలు పండిస్తున్నారు. చాలా మంది వర్మీ కంపోస్టు, బోన్ మీల్, కోకో పిట్‌ను మిద్దె పంటలకు వాడతారు. ఆమె మాత్రం ఎండుటాకులు, వంట గదిలోని పనికిరాని మెటీరియల్, బియ్యం, పప్పులు కడిగిన నీరు ఎరువులుగా ఉపయోగిస్తారు. ఆవు గెత్తం రూ.100కు రెండు మూటలు కొంటారు. ఇది నెల రోజులకు సరిపోతుంది. పుల్లని మజ్జిగ, కాయగూరల తొక్కలు, పండ్లు తొక్కలతో వర్మీ కంపోస్టు తయారు చేస్తారు. టీ దుకాణాల్లో వాడేసిన టీ పొడిని ఎరువుగా వినియోగిస్తారు.

ప(పె)ంచడంలో ఆనందం



సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలే తింటున్నాం. ఇంటి వచ్చిన వారికి కూరగాయలు బహుమతిగా ఇస్తాను. ఇలా పంచడంలో ఎంతో ఆనందం ఉంది. మా ఇరుగు పొరుగు వారికి కూరగాయలు ఇస్తుంటాను. మా పాప లక్ష్మీ సౌజన్యకు మొక్కలపెంపకం అంటే ఇష్టం. ఆమె హైదరాబాద్‌లో కుండీల్లో పండిస్తుంది. డబ్బు ఎక్కువగా ఖర్చుపెడుతుంది. అరటి తొక్కల రసం, కాలం తీరిన కాల్షియం ట్యాబ్లెట్లు మొక్కల మొదళ్లలో వేస్తాను. పురుగు నివారణకు పుల్లని మజ్జిగ, పొయ్యి బూడిద, పసుపు నీరు ఉపయోగిస్తాను. మొక్క ఎదుగుదల బాగుంటుంది. ఫిబ్రవరి నుంచి ఆగస్టు వరకు మల్లె పూలు పూస్తాయి. వీటిని మాలలుగా కట్టి వైభవ వేంకటేశ్వరస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలకు అందిస్తాను.

– అనిశెట్టి లీలావతి



దాని గురించి ఎవరికీ ఏమీ తెలియని రీతిలో
మంచి చేయడం అనేది మరింత మెరుగైన విషయం.
– లియో టాల్‌స్టాయ్

సాక్షి
సోమవారం, జనవరి, 23

అక్షరాల ఉత్సవం

మనుషులతో కూడిక మనిషికి ఎప్పుడూ ఉత్సాహాన్ని ఇస్తుంది. ఇల్లు విడిచి బయటకు కదిలే సందర్భాలు తిరిగి ఉత్సాహంగా ఇల్లు చేరడానికి, చేయవలసిన పనిలో పునర్‌లగ్నం కావడానికి దోహదం చేస్తాయి. కదలకుండా ఉండిపోయే మనిషిని కదల్చడానికి, తోటి మనిషిని కలవడానికి, లోకం తెలుసుకోవడానికి పెద్దలు పూర్వం ఆధ్యాత్మికత పేరుతోనైనా కూడికలు ఏర్పాటుచేశారు. జాతరలు, తిరునాళ్లు, తీర్థయాత్రలు, పుష్కరాలు, కుంభమేళాలు... ఇవన్నీ మనిషిని కదిల్చి తనలాంటి మనుషులను కలిసేలా చేస్తాయి. భారతీయులు ఈ నిష్ఠను పాటించడంలో ఎప్పుడూ ముందే ఉన్నారు. తెలుగువారు అందుకు సరిసమానం కాకుండా ఎలా ఉంటారు? మన జాతరలు కిటకిటలాడతాయి. మన పుణ్యక్షేత్రాలు కళకళలాడతాయి. అయితే సాంస్కృతిక, సాహిత్య, కళారంగాలకు సంబంధించి ఈ నిష్ఠ మనలో ఏ మేరకు ఉన్నదన్నది ప్రశ్న. సాహిత్యం కోసం కదలడం, సంస్కృతికై కూడటం.

సంవత్సరంలో ఒకసారి ప్రపంచంలోని గొప్ప గొప్ప తెలుగు కూచిపూడి కళాకారులందరూ విజయవాడ కూచిపూడి ఉత్సవంలో పాల్గొంటారు. ఆ ఉత్సవం చూడటానికి దేశ విదేశాల నుంచి అతిథులు వస్తారు. సంవత్సరంలో ఒకసారి ప్రపంచంలోని తెలుగు మేటి జానపద కళాకారులందరూ ఆదిలాబాద్‌లో జమ అవుతారు. వేదికలు అదరగొడతారు. చూడటానికి దేశం కదిలి వస్తుంది. సంవత్సరానికి ఒకసారి తెలుగు నాటకరంగ దిగ్గజాలందరూ నాటకాలతో తెనాలికి పోటెత్తుతారు. వారం రోజుల పాటు గొప్ప గొప్ప నాటకాలు ప్రదర్శిస్తారు. ఈ నాటక ఉత్సవం కోసం ప్రేక్షకులు కన్నులు కాయలు కాచేలా ఎదురు చూస్తారు. తిరుపతిలో వీనుల విందుగా శాస్త్రీయ సంగీత ఉత్సవాలు జరుగుతాయి. త్యాగయ్య, క్షేత్రయ్య, అన్నమయ్య మార్మోగుతారు. సీట్లు దొరక్క ప్రేక్షకులు అవస్థ పడతారు. వరంగల్‌లో అద్భుతమైన చిత్రకళా ఉత్సవం జరుగుతుంది. తెలుగు చిత్రకారులందరూ తరలివస్తారు. రంగులు, బ్రష్షులు పట్టుకుని చిన్నారులు చూడ పరిగెడతారు. ప్రతి ఏటా హైదరాబాద్‌లో జరిగే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రపంచంలోని ఉత్తమ సినిమా నిపుణులకు ఆహ్వానం పలుకుతుంది. స్పీల్‌బర్గ్, కామెరూన్ వంటి వారు సినిమాల గురించి మాట్లాడతారు. కొత్త తరానికి ఉత్సాహాన్ని ఇస్తారు. ఇలా జరుగుతున్నదా? ఇలా ఎందుకు జరగడం లేదు?

స్వర్ణకాలం అంటే కొత్త అపార్ట్‌మెంట్‌లో చదరపు అడుగు ఆరున్నర వేలు పలకడం కాదు. కొత్త కార్లు రోడ్ల మీద కిటకిటలాడటం కాదు. ప్రజలు తమ సాంస్కృతిక అభిరుచిని సజీవంగా ఉంచుకునే కాలం. కవులు, కళాకారులు, గాయకులు, రచయితలు, నటీనటులు, వాద్యకారులు, చిత్రకారులు, హస్తకళా మాంత్రికులు తమ సృజనను ఉన్నతీకరించుకుంటూ సమాజంతో అనుసంధానం చేస్తూ పరస్పర సంలీనతతో పురోగమించే కాలం స్వర్ణకాలం. కళలకు ఆదరణ లభించిన అట్టి కాలమే చరిత్రలో నమోదయ్యింది. అలాంటి కాలం కొరకు ఏం చేయాలి? 16 ఏళ్ల క్రితం జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ ప్రారంభించినప్పుడు వేదికకు ఒక మూల నిలుచుని యాభై మందైనా వస్తారా అని బితుకుబితుకుమన్నా. ఇవాళ చూడండి వేలాదిగా పోటెత్తుతున్నారు అని ఆ ఫెస్టివల్ నిర్వాహకుడు సంజొయ్ కె.రాయ్ అన్నాడు. అతడు ప్రయత్నం మొదలెట్టాడు. తర్వాత ప్రజలు తోడు నిలిచారు. కనుకనే జైపూర్‌లో ఏటా జనవరిలో జరిగే జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌కు వందల మంది రచయితలు, వేలాదిగా పాఠకులు తరలి వస్తారు. ఆ సంవత్సరంలో ఇంగ్లిష్‌లో కొత్త పుస్తకాలు రాసిన, అనువాదమైన రచయితలు మాట్లాడతారు. అంతర్జాతీయ అవార్డు రచయితలు అందరిలో ఒకరై కనిపిస్తారు. ఆలోచనల మార్పిడి జరుగుతుంది. రచయితలు ఇదంతా మన సమూహం అని ఊపిరి నింపుకొంటారు. విద్యార్థులు హాజరై ప్రశ్నలు సంధిస్తారు. సృజన ఒక తరం నుంచి మరో తరాన్ని తాకుతుంది.

సాహిత్యాన్ని సెలబ్రేట్ చేసుకోవడం అంటే సంస్కృతినీ, భాషనూ సెలబ్రేట్ చేసుకోవడం. జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ స్ఫూర్తితో ఇవాళ దేశంలో ఎన్నో లిటరేచర్ ఫెస్టివల్స్ జరుగుతున్నాయి. పర్వత ప్రాంతాల వారు డెహరాడూన్‌లో, పంజాబ్ వారు కసౌలీలో, కేరళ వారు కోళిక్కోడ్‌లో, బెంగాలీలు కోల్‌కతాలో, కన్నడిగులు బెంగళూరులో, తమిళులు చెన్నైలో... ప్రతి ఏటా లిటరేచర్ ఫెస్టివల్స్ జరుపుకొంటున్నారు. ఇతర ప్రాంతాల రచయితలను ఆహ్వానిస్తున్నారు. ప్రజలు వీటికి హాజరై సృజనకారులకు ప్రోత్సాహం అందిస్తున్నారు. తమ జాతి మక్కువను నిరూపించుకుంటున్నారు.

మరి తెలుగులో? ప్రస్తుతం రెండు రాష్ట్రాలకు కలిపి హైదరాబాద్‌లో మొక్కుబడిగా సాగే 'హైదరాబాద్ లిటరేచర్ ఫెస్టివల్' తప్ప ఘనమైన తెలుగు లిటరేచర్ ఫెస్టివల్స్ మనకు లేవు. కన్నడ రచయితలు ఎక్కడ ఉన్నా ఏటా జాతీయ కన్నడ రచయితల ఉత్సవం పేరుతో ఏదో ఒక ఊరిలో కలుస్తారు. తెలుగు రచయితలు పక్క జిల్లా రచయితలతో కలిసే సందర్భాలు ఏర్పడవు. సాంస్కృతిక మందకొడితనం ఎందుకు మనలో మెండుగా ఉంటుందో తెలియదు. తెలుగు మహాసభలు జరగవు. భాషా ఉత్సవాలు జరగవు. మహా రచయితల శత జయంతులకు కూడా చీమ చిటుక్కుమనదు. పరిషత్ పోటీలు కొనఊపిరితో ఉంటాయి. మరో భాషలో రాసే రచయితను జీవిత కాలంలో ఒక్కసారైనా కలవకుండానే మన రచయితలు బావి బతుకులకు పరిమితమైపోతారు. ఇలా ఉంటే తెలుగు సాహిత్యస్థాయి మెరుగయ్యి ఎల్లలు దాటడం కల్ల. పెళ్లిళ్లు ఘనంగా చేయడమూ, భారీ కల్యాణ మంటపాలు కట్టడమూ జరుగుతున్న ఈ కాలంలో పన్నెండు కోట్ల మంది తెలుగువారు తమ తెలుగు సాహిత్యాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికి సంవత్సరానికి ఒకసారి ఒక ఉత్సవం జరుపుకోలేకపోవడమే అమోఘమైన దారుణం. అత్యద్భుత విషాదం.

'కోహినూర్‌ను బ్రిటన్ దొంగిలించింది'

కామెంట్



కరణ్ థాపర్

బ్రిటన్ రాజకుటుంబ కథనాలంటే ఇప్పటికీ ఆసక్తికరమే. పైగా ప్రిన్స్ హ్యారీ దూకుడుగా వెలువరించిన 'స్పేర్' చదవడానికి మరింత ఆకర్షణీయం. తల్లి డయానా నాటకీయ మరణం నుంచి ఇప్పటికీ కోలుకోలేకపోవడాన్నీ, తానొక 'స్పేర్'గా ఊరికే అలా పక్కనుండాల్సిన స్థితినీ రాశాడు. అలాగే అనేక ఇబ్బందికర విషయాలను పంచుకున్నాడు. అయితే కోహినూర్ వజ్రం గురించిన హ్యారీ ఆలోచనలు మాత్రం భారతీయులకు సంతోషం కలిగిస్తాయి.

బ్రిటన్ రాకుమారుడు హ్యారీ రాసిన 'స్పేర్' పుస్తకం చదివినప్పుడు మనకు కొట్టొచ్చినట్టు కనబడేది దాన్ని రాసిన విధానమే. శైలి బిగువుగా, ఉద్రిక్తభరితంగా, ఒక్కోసారి అసంగతంగానూ ఉంటుంది. చెప్పాలంటే ఒక థ్రిల్లర్‌లా ఉంటుంది. కాబట్టే ఇది చదవడానికి ఆకర్షణీయంగా ఉంది. అయితే ఇందులోని భాషలో లోతు తక్కువ. విషయం వదులుగా ఉన్నప్పుడు, ముఖ్యంగా ఈటన్ స్కూల్, అఫ్గానిస్తాన్‌లలో హ్యారీ గడిపిన సమయాల గురించి వివరిస్తున్నప్పుడు పైపైన సాగుతుంది. అప్పుడు నిస్సారంగా ఉండి, చికాకు కలిగిస్తుంది కూడా.

తప్పనిసరిగా కనబడేవి మరో రెండు అంశాలు. తన తల్లి (డయానా) నాటకీయ మరణం కలిగించిన వేదన నుంచి హ్యారీ బయటపడలేదు. ఈ పుస్తకం మొత్తంగా ఇదే మానసిక స్థితి కొనసాగుతుంటుంది. అయితే ఇది అర్థం చేసుకోదగినదే. అర్థం కానిదల్లా ఏమిటంటే, తానొక 'స్పేర్'(అలా పక్కన అందుబాటులో ఉండటం)గా ఉండాల్సిన వాస్తవం గురించి ఇంకా సమాధాన పడక పోవడమే. 38 సంవత్సరాల వయస్సులో కూడా ఏ హోదా లేదు. తన సోదరుడు విలియమ్‌తో బాంధవ్యంపై ఇది స్పష్టమైన ప్రభావం చూపుతూ వచ్చింది. ఈ కారణంగానే స్కూల్‌లో విల్లీ (విలియమ్‌ను హ్యారీ ఇలాగే పిలుస్తాడు) తన పట్ల పట్టనట్టుగా ఉన్నాడని హ్యారీ నమ్మకం.

పుస్తకంలోని మూడో అంశం ఏమిటంటే – రాజ కుటుంబానికీ, వెంటాడే ఫొటోగ్రాఫర్లకూ (పాపరాజ్జీ) మధ్య సాగిన అంతులేని పోరాటం. ''ఎప్పుడూ ఫిర్యాదు చేయవద్దు, ఎప్పుడూ వివరణ ఇవ్వవద్దు'' అనేది రాజ కుటుంబ నినాదంగా ఉండేది. హ్యారీ ఈ విషయంలో ఒకడుగు ముందుకేసినట్టుగా కనిపిస్తుంది. పబ్‌లో రాత్రంతా గడిపిన తర్వాత తన కారు డిక్కీలో దాక్కునే వాడినని చెప్పాడు. డయానా కూడా అలాగే చేసివుంటుందని హ్యారీ అంటాడు.

ఈ పుస్తకం చాలా విషయాలను వెల్లడిస్తుంది. వాటిలో చాలా వరకు తీవ్రమైనవి, కొన్ని మనోహరమైనవి. బాక్సర్ షార్ట్స్‌లో శీర్షాసనాలు వేసే అతడి తండ్రి, బ్రిటన్ రాజు చార్లెస్ 'డార్లింగ్ బాయ్' అని హ్యారీని పిలుస్తారు. ఇక విలియమ్ అతడిని 'హెరాల్డ్' అంటాడు. కానీ అలా ఎందుకంటాడో పుస్తకంలో ఎక్కడా ఉండదు. అయితే, ''నాతో



వ్యవహరించినప్పుడల్లా ఏ మార్పూ లేకుండా'' అదే ''సుపరిచిత భ్రుకుటి'' అని మాత్రం చెబుతాడు. ఇక బాల్మోరల్ రాజమందిరంలో పిల్లలుగా ఉన్నప్పుడు, క్వీన్ విక్టోరియా విగ్రహాన్ని ఎప్పుడు దాటుకుని వెళ్లినా వారు ప్రతిసారీ వంగి నమస్కరించేవారు.

ఈ పుస్తకంలోని చాలా వివరాలు అనవసరం. పైగా అవి ఇబ్బంది కలిగిస్తుంటాయి. వాటన్నింటినీ హ్యారీ ఎందుకు పంచుకున్నాడని మీరు ఆశ్చర్యపడతారు కూడా. ఉదాహరణకు, హ్యారీ తనకు తడి అయిందనీ (స్ఖలనం), దాన్ని దాచిపెట్టడానికి సముద్రంలోకి దూకేశాననీ చెబుతాడు. మేగన్ మెర్కెల్‌తో తన తొలి డేట్‌కు కొద్ది గంటల ముందు అలా జరిగింది.

రాజకుటుంబీకులు, వారి స్కాటిష్ సంప్రదాయాలకు కాలం చెల్లిపోయిందని అనిపించే ఒక కథనం ఆశ్చర్యం కలిగిస్తుంది. హ్యారీ తొలిసారి ఒక మగజింకను కాల్చినప్పుడు అతడి గైడ్ అయిన శాండీ ఆ మృతకళేబరపు చర్మాన్ని చీల్చి, యువరాజు హ్యారీని మోకాళ్లపై కూర్చోబెట్టి, అతడి తలను అందులోకి దూర్చాడట. ''దీంతో ఉదయం నేను తిన్న ఫలహారం కడుపులోంచి బయటకు వచ్చేసింది'' అని హ్యారీ రాస్తాడు. ''నేను దేన్నీ వాసన పీల్చలేకపోయాను. ఎందుకంటే నేను శ్వాస పీల్చలేకపోయాను'' అని చెబుతాడు. ''నా నోరు, ముక్కు పూర్తిగా రక్తంతో, పేగులతో నిండిపోయాయి. ఒక తీవ్రమైన అసౌకర్యపు వెచ్చదనం'' అని చెబుతాడు. ఈ ఆచారం ముగియగానే, హ్యారీ ముఖంపై పడిన జింక రక్తాన్ని తుడవవద్దని శాండీ చెప్పాడట. ''దాన్ని అలాగే ఎండిపోనీ, కుర్రాడా, అలాగే ఎండిపోనీ!'' అన్నాడట.

బ్రిటిష్ రాజకుటుంబంలో ఇద్దరు సభ్యులను హ్యారీ అంగీకరించలేకపోయాడు. ఒకరు మార్గరెట్ (ఎలిజబెత్ రాణి చెల్లెలు). ఆమెను అతడు ఆంట్ మార్గో అని పిలుస్తాడు. ఒకసారి ఆమె క్రిస్మస్‌కు మామూలు బాల్‌పాయింట్ పెన్ ఇచ్చిందట. అయినా వాళ్లిద్దరూ కలిసి సాగాల్సి వుంది. ఎందుకంటే, హ్యారీ నొక్కిచెప్పినట్టుగా ఆమె కూడా తనలాగే ఒక స్పేర్. ఇక హ్యారీ అంగీకరించని మరొకరు కెమిల్లా. ఆమెను పెళ్లాడవద్దని హ్యారీ, విలియమ్ ఇద్దరూ తమ తండ్రి చార్లెస్‌కి చెప్పారు. ఆమెను 'ప్రమాదకారి'గా హ్యారీ పరిగణిస్తాడు. తన ఇమేజ్‌ను పెంచుకునే క్రమంలో ఆమె మీడియాకు పలు కథనాలు బహిర్గతం చేశారంటాడు.

రెండు విషయాలు నన్ను ఆశ్చర్యపరిచాయి. ఈ పుస్తకంలో దోడీ ఫయాద్ పేరు ఎక్కడా ప్రస్తావనకు రాలేదు. అతడిని హ్యారీ అంతటా 'మమ్మీ బాయ్‌ఫ్రెండ్' అనే రాశాడు. ఇంకా తనకు 'పాకీ' అంటే జాతి వివక్షా పదమనీ, అవమానించినట్టనీ తెలియదని పేర్కొన్నాడు.

అంతిమంగా, గూర్ఖాల పట్ల హ్యారీకి ఉన్న ఆత్మీయతకు భారతీయ పాఠకులు సంతోషపడతారు. లెఫ్టినెంట్ వేల్స్ అని హ్యారీని సంబోధించడానికి వారు ఇష్టపడేవారు కాదు. ఎల్లప్పుడూ 'సాబ్' అనేవారు. ''రాజరికం పట్ల వాళ్లకు గంభీరమైన పూజ్యభావం ఉంది. వారి దృష్టిలో రాజు అంటే దైవం. కాబట్టి రాజకుమారుడు కూడా దైవానికి మరీ దూరం కాదు''.

ఇక కోహినూర్ వజ్రాన్ని బ్రిటన్ కలిగివుండటంలోని న్యాయసమ్మతిని హ్యారీ ప్రశ్నించడం మన ప్రభుత్వానికి సంతోషం కలిగించే విషయం. ''బ్రిటిష్ సామ్రాజ్యం తన ఉచ్చదశలో దాన్ని స్వాధీనం చేసుకుంది. ఇంకో ఆలోచన, దొంగిలించింది'' అని అంటూ ఇలా కొనసాగిస్తాడు. ''అది శాపగ్రస్తమైందని నేను విన్నాను.''

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఏం టైమింగు!



దోమల్లో పుట్టే ప్రాణాంతక వైరస్ ఆస్ట్రేలియాలో ప్రవేశించింది. ఏ లక్షణాలూ కనబరచని ఈ వ్యాధి ప్రాణం తీయొచ్చు. అదృష్టవశాత్తూ బిల్ గేట్స్ ప్రధానిని కలవడానికి వచ్చారు. అన్నింట్లోనూ అవకాశాలు! – బెర్నీ స్ఫోర్ఫ్, కాలమిస్ట్

వాళ్లకు అయిపోదా?



తన పిండి అయిపోయిందంటూ జసిండా ఆర్డెన్ రాజీనామా చేశారు. తన గరిష్ఠ హద్దుకు చేరుకున్నానని. ఒక పురుష సీనియర్ రాజకీయ నాయకుడు రాజీనామా చేయడాన్ని నేను ఎప్పుడూ చూడలేదు. – చార్లట్ ప్రౌడ్‌మాన్, ఫెమినిస్ట్

మనవాళ్లే శత్రువులు



ఇండియా ఎప్పుడు ఓడిపోయినా, దానిక్కారణం విదేశీ శత్రువు బలంగా ఉండటం వల్ల కాదు. ఇండియా విభజితమయ్యో, ద్రోహుల వల్ల మోసానికి గురికావడం వల్లో జరిగింది. వెయ్యేళ్ల క్రితం ఇది ఎంత నిజమో ఇప్పుడూ అంతే. – సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

అవే తప్పులు



నేను మూడు తప్పులు చేశాను. 1. మొదటి ఎంఆర్‌ఎన్‌ఏ కరోనా టీకా డోసు వేసుకోవడం. 2. రెండో ఎంఆర్‌ఎన్‌ఏ డోసు వేసుకోవడం. 3. మళ్లీ అదే ఎంఆర్‌ఎన్‌ఏ డోసు వేసుకోవడం. దురదృష్టవశాత్తూ వెనక్కి తిప్పలేని తప్పులు. – ష్మయెల్ సి.షపీరా, ఇజ్రాయిల్ బయోలాజికల్ రీసెర్చ్ హెడ్

పొమ్మన్నారంతే!



గూగుల్‌లో 20 ఏళ్లు పనిచేసిన తర్వాత అనూహ్యంగా ఇదే నా ఆఖరి రోజు (లేఆఫ్) అని ఈమెయిల్ ద్వారా తెలియడాన్ని నేను నమ్మలేకున్నాను. ముఖం మీద కొట్టినట్టయింది. కనీసం అందరికీ ముఖాముఖి గుడ్‌బై అయినా చెప్పగలిగితే బాగుండేది. – జెరెమీ జాస్లిన్, ఉద్యోగి (?)

నిజమేనా?



ఒకవేళ సాత్వికాహారం మనకు ప్రశాంతత, వివేకం, అణకువ ఇచ్చేట్టయితే– ఎందుకు అణిచివేత కులాలకు సంబంధించిన జనం అబద్ధపు గర్వం, వివక్షాపూరిత ప్రవర్తన కలిగివుంటారు? ఆ పరికల్పన అయినా తప్పయి ఉండాలి, లేదా వాళ్లు రహస్యంగా తామస, రాజస ఆహారాలు తింటూ వుండాలి. – సిల్వియా కర్పగం, వైద్యురాలు


నేరం చర్చిల్‌దే!



నేననుకోవడం ఇండియా అధికారికంగా విన్‌స్టన్ చర్చిల్‌ను యుద్ధ నేరస్థుడిగా ప్రకటించాల్సిన సమయం ఇదే. బెంగాల్ క్షామంలో ఉద్దేశపూర్వకంగా యాభై లక్షల మంది భారతీయుల మారణహోమానికి కారణమైన కీలక సూత్రధారిగా ఆయన మీద నేరం మోపాలి. ఇండియాకు, ప్రత్యేకించి హిందువులకు వ్యతిరేకంగా బ్రిటన్ యుద్ధ నేరాలను మన రికార్డుల్లోకి ఎక్కించాలి. – సావిత్రీ ముముక్షు, ఆంట్రప్రెన్యూర్

ఉగ్రరూతలూగించిన నేత!

క్రమశిక్షణ, దేశభక్తి, దైవభక్తి ఉన్న సేవాతత్పరుడు సుభాష్ చంద్రబోస్ మరణించి 78 ఏళ్లవుతోంది. అయినా ఆయన మరణానికి కారణమని చెబుతున్న విమాన ప్రమాద కారణం నేటికీ జవాబులేని ప్రశ్నగా నిలిచిపోయింది. ప్రభావతీ దేవి, జానకీ నాథ్ బోస్ దంపతుల సంతానంలో తొమ్మిదోవాడుగా సుభాస్ చంద్రబోస్ 1897 జనవరి 23న కటక్‌లో జన్మించారు. ఐసీఎస్‌లో అఖిల భారత స్థాయిలో నాలుగవ స్థానం పొందారు. బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, అఖిల భారత కాంగ్రెస్ సహాయ కార్యదర్శిగా దేశమంతా పర్యటిస్తూ చేసిన ప్రసంగాలకు లక్షలాది మంది ప్రేరణ పొందారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా బ్రిటిష్ ప్రభుత్వం ఆయన్ని అరెస్ట్ చేసి అనేక జైళ్లలో తిప్పి, చివరికి దేశ బహిష్కరణ శిక్ష వేసింది. 1933లో 'ఇండియన్ స్ట్రగుల్' పుస్తకాన్ని రాశారు. తండ్రి మరణంతో భారత్‌కు తిరిగి రాగా, ఆరోగ్యం క్షీణిస్తే, చికిత్స కోసం ప్రజలు చందాలువేసి మరీ వియన్నా పంపారు. అప్పుడే యూరప్ పర్యటించారు. ఆ రోజుల్లోనే ముస్సోలినీ, హిట్లర్, రోమరోల వంటివారిని కలిశారు.



నెహ్రూ అధ్యక్షతన లక్నోలో జరిగే కాంగ్రెస్ సమావేశాలకు హాజరయ్యేందుకు దేశంలో దిగగానే ఆయనను ఖైదు చేసి ఎరవాడ జైలుకు పంపారు. 1937లో విడుదల కాగానే అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడై దేశమంతా పర్యటిస్తూ ప్రజలను స్ఫూర్తిదాయక ఉపన్యాసాలతో ఉగ్రరూతలూగించి అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడయ్యారు! అది ఆయన పట్ల అసూయాపరులను పెంచింది. రెండవ పర్యాయం మళ్ళీ పోటీచేసి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ గెలుపు కోసం ప్రయత్నించకుండానే పట్టాభి సీతారామయ్యపై గెలిచి కాంగ్రెస్ అధ్యక్షులు అయ్యారు. అయితే గాంధీజీకి ఆయన అధ్యక్షుడు కావడం ఇష్టం లేదు. దీంతో బోస్ కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి రాజీనామా చేశారు. వెంటనే ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించారు. వారపత్రిక కూడా వెలువరించడం మొదలు పెట్టి మరోసారి దేశమంతా పర్యటించారు.

1942 జనవరి 26న పులి బొమ్మతో రూపొందించిన జండా ఎగరేసి, బెర్లిన్‌లోనే ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించారు. 1941 ఫిబ్రవరి 27న ఆజాద్ హింద్ ఫౌజ్ రేడియోలో అద్భుత ప్రసంగం చేసి యావత్ భారతాన్నీ ఆయన ఆవేశంలో ముంచెత్తారు. మహిళలకు రంగూన్‌లో ఝాన్సీ లక్ష్మీబాయి రెజిమెంట్ ఏర్పాటు చేసి యుద్ధ శిక్షణ మొదలు పెట్టారు. చలో ఢిల్లీ నినాదం ఇచ్చి ప్రత్యక్ష యుద్ధానికి ప్రణాళిక రచించి ఇంఫాల్, అండమాన్, నికోబార్‌లో స్వతంత్ర భారత పతాకాన్ని ఆవిష్కరించి సాగిపోయారు. ఇంతలో జపాన్ మీద అణుబాంబు పడ్డది. జపాన్ అతలాకుతలమై పోయింది. బోస్ నిస్సహాయుడై సహచరుల బలవంతంపై మంచూరియాలో సురక్షిత అజ్ఞాత స్థలానికి వెళ్ళడానికి అనిష్టంగానే జపాన్‌లో విమానం ఎక్కి తైపే వరకూ ప్రయాణించారు. 1945 ఆగస్ట్ 18న అకస్మాత్తుగా విమానంలో సాంకేతిక ఇబ్బంది వచ్చి కూలిపోయిందన్నారు. విమానంతో పాటే కోట్లాది భారతీయుల ఆశలూ నేల కూలాయి. 50 సంవత్సరాల వయసులోనే ఆ యోధునికి నూరేళ్ళూ నిండాయి.

– నందిరాజు రాధాకృష్ణ । 98481 28215
(నేడు నేతాజీ జయంతి)

మన క్రీడాకారిణులకు బాసట ఏది?

సందర్భం



జగ్మతి సాంగ్వాన్

బుధవారం న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అగ్రశ్రేణి భారతీయ మహిళా రెజ్లర్లు... భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై దిగ్భ్రాంతికరమైన ఆరోపణలు చేశారు. తమను ఆయన లైంగికంగా వేధిస్తున్నారనీ, నిరంకుశంగా వ్యవహరిస్తున్నారనేవి వారి ఆరోపణలు. ఈ ఉదంతం భారత క్రీడారంగంలోని మురికిని మరో సారి ఎత్తిచూపింది. క్రీడా సంస్థల నాయకత్వంలో ఉన్న పురుషాధిపత్యం, రాజకీయాలతో వారికున్న అవినాభావ సంబంధాలు మరోసారి బట్టబయలు అయ్యాయి. ఆ మధ్య హరియాణా క్రీడా మంత్రి, భారత హాకీ మాజీ క్రీడాకారుడు అయిన సందీప్ సింగ్‌పై మరో ప్రముఖ అథ్లెట్, మహిళా కోచ్ చండీగఢ్‌లో చేసిన ఆరోపణలూ దాదాపూ ఇటువంటివే.

క్రీడాకారిణులకు మద్దతు ఇవ్వడమే తమ విధిగా ఉండాల్సిన మన క్రీడాధికారులు వాస్తవానికి తమ రాజకీయ బలాన్ని వారిని వేధించడానికి అనుకూలంగా మలచుకుంటున్నారు. తమ వేధింపులను ఎదిరించినవారిని శంకరగిరి మాన్యాలు పట్టిస్తున్నారు. కుటుంబపరమైన మద్దతు ఏమాత్రం లేకుండా నెలలు, సంవత్సరాల తరబడి శిక్షణ పొందుతూ... రక్తం, చెమట, కన్నీళ్లను పణంగా పెడుతున్న మహిళలు వీరు. వీరికి మరో వృత్తిని ఎంచుకునే అవకాశమూ ఉండదు. అవినీతిపరులైన అధికారుల చేతుల్లో వీరు తీవ్రమైన దోపిడీకి గురవుతున్నారు.

విషాదకరమైన విషయం ఏమిటంటే, క్రీడల్లో మహిళలపై వేధింపునకు సంబంధించి ఇటీవల వెలికివస్తున్న కేసులు నిజానికి సముద్రంలో నీటిబొట్టంత మాత్రమే. మహిళా రెజ్లర్లు తమ ప్రెస్ కాన్ఫరెన్సులో ఎత్తి చూపినట్లుగా ఈ ప్రత్యేక సమస్యకు సంబంధించిన నిజమైన రూపం చాలా భారీ స్థాయిలో, అత్యంత సంక్లిష్టంగా ఉంటోంది. క్రీడాకారి ణులు చేస్తున్న ఫిర్యాదులను స్వీకరించడానికి ఇంతవరకు నెలకొల్పిన సమస్యా పరిష్కార నిబంధనలు ఏమాత్రం తమ ప్రభావం చూపలేదని స్పష్టమవుతోంది. పైగా తమను వేధింపులకు గురి చేస్తున్న వారి గురించి బయటపడి ఫిర్యాదు చేయడానికి ఇవి మహిళల్లో ఏమాత్రం విశ్వాసం కలిగించలేదని కూడా స్పష్టమవుతోంది.

వందలాది క్రీడాకారిణులు మౌనంగా ఉంటూ అధికారులకు లోబడి ఉండటానికి ప్రధాన కారణం వారు క్రీడల నుంచి బయటపడటానికి మరొక అవకాశం లేకపోవడమేనని చెప్పాలి. శక్తిమంతులైన రాజకీయ నియామకాల ద్వారా పదవుల్లోకి వచ్చి రాజకీయ సంరక్షణలో ఉంటున్న వారికి వ్యతిరేకంగా పోరాడటం అంత సులభం కాదని మహిళా అథ్లెట్లు, వారి కుటుంబాలకు బాగా తెలుసు.

ఇక్కడ ఒక విషయాన్ని నొక్కి చెప్పాల్సి ఉంది. మన అంతర్జాతీయ క్రీడాకారిణులలో చాలామంది తమను సపోర్టు చేయడానికి తమ కుటుంబాలు తమ వనరులను మొత్తంగా వెచ్చిస్తున్నారని చెబుతూ వచ్చారు. అధికారిక ప్రవేశ ద్వారాలను వారి ముఖాలమీదే మూసివేసిన సమయంలో, జంతర్ మంతర్ వద్ద మన మహిళా రెజ్లర్ల ప్రెస్ కాన్ఫరెన్స్‌ని చూస్తున్నప్పుడు... కీలకమైన ప్రాక్టీస్ సీజన్లో ఇలా బయటికి వచ్చారంటే వారు ఎంత నిస్పృహకు గురై ఉంటారో కదా అని చూసేవారికి బాధ, ఆగ్రహం కలుగుతాయి. హరియాణాలో సైతం ఆ జూనియర్ మహిళా కోచ్ రాష్ట్ర క్రీడా మంత్రికి వ్యతిరేకంగా న్యాయం పొందడానికి ఒకచోటు నుంచి మరొక చోటుకి పరుగులు తీశారు. కానీ హరియాణా ప్రభుత్వం మాత్రం నిందితుడి పక్షానే నిలిచింది. ఆ రకంగా మహిళా క్రీడా కమ్యూనిటీ మొత్తానికి అది ప్రతికూల సందేశాన్ని అందించింది.



ఆరోపణలకు గురైనవారు, వారి రాజకీయ ప్రభుత్వ యంత్రాంగానికి చెందినవారు బాధితురాలినే అవమానిస్తున్నారు. పైగా లైంగిక వేధింపు కేసుల వల్ల ఆపాదించబడే సామాజిక కళంకాన్ని భరిస్తూ... తమ కెరీర్‌నే నిలిపివేయగలిగిన విధ్వంసకరమైన అధికారాన్ని చలాయిస్తున్న మొత్తం అధికార యంత్రాంగాన్ని ఒంటరి బాధితురాలు ఎదురించి నిలబడటం చాలా కష్టం కూడా.

1990లలో నాటి టెన్నిస్ సమాఖ్య అధ్యక్షుడు, హరియాణా పోలీస్ ఐజీ ఎస్పీఎస్ రాథోడ్‌కు వ్యతిరేకంగా గళమెత్తిన టెన్నిస్ క్రీడాకారిణి రుచికా గిర్‌హోత్రాకు చెందిన ముఖ్యమైన ఉదంతాన్ని మననం చేసుకోవలసి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మొత్తంగానూ, అనేక కుల ప్రాతిపదిక సంస్థలు ఆనాడు నిందితుడి పక్షానే నిలబడ్డాయి. ఆరోపణకు గురైన రాథోడ్ నిజానికి ప్రమోషన్ పొంది హరియాణా డీజీపీ అయ్యారు. తీవ్రమైన శత్రుపూరిత వాతావరణంలో రుచిక తన జీవితాన్నే ముగించుకున్నారు. న్యాయం కోసం కుటుంబం సాగించిన పోరాటంలో ఆమె తండ్రి కూడా మరణించారు. ఆమె సోదరుడు జనం కంట పడకుండా ఎంతో దూరంలో జీవితం గడపాల్సి వచ్చింది. ఆమె సన్నిహిత మిత్రుడి కుటుంబం, ఇతర మహిళా సంస్థలు ఎంతో శ్రమ కోర్చి ఈ కేసును ప్రతి స్థాయిలోనూ ముందుకు తీసుకెళుతూ 19 ఏళ్ల పాటు పోరాడారు. అయినప్పటికీ నిందితుడైన రాథోడ్ ఆరునెలల జైలు శిక్షను, వెయ్యి రూపాయలు జరిమానాను మాత్రమే పొందాడు.

దురదృష్టకరమైన విషయం ఏమిటంటే నాటి నుంచి నేటివరకు మన క్రీడాకారిణుల జీవితాల్లో పెద్దగా మార్పు లేదు. తన జీవితాన్ని ముగించుకోవాలనే నిస్పృహతో కూడిన ఆలోచనల గురించి కన్నీళ్లు పెట్టుకుంటూ మాట్లాడిన వినేశ్ ఫోగాట్ దీన వదనం చూసి దేశ ప్రజలు, ముఖ్యంగా క్రీడా సమాజం దిగ్భ్రాంతి చెంది ఉండాలి. ఈ రెండు కేసుల్లోనూ ప్రసుతం అధికారంలో ఉన్న బీజేపీని, క్రీడాధికారులను తప్పక కఠిన ప్రశ్నలు వేసితీరాలి. క్రీడాకారిణులు పతకాలు తీసుక వస్తున్నప్పుడు వారు సాధించిన ఉజ్వల కీర్తిని తమ సొంతం చేసుకుని మురిసిపోవడంలో రాజకీయ నేతలు, క్రీడా సమాఖ్య అధిపతులు ముందు ఉంటున్నారు. కానీ మరోవైపున తమకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా గళం విప్పడానికి క్రీడాకారిణులు ప్రయత్నించిన ప్రతిసారీ ఏమాత్రం సిగ్గూ శరమూ లేకుండా నిందితులనే కాపాడటానికి ప్రయత్నిస్తున్నారు. వీరందరూ ఇప్పుడు సమాధానం చెప్పి తీరాలి.

క్రీడాకారిణులను వేధించిన కేసుల్లో అవసరమైన సమర్థ న్యాయప్రక్రియను తక్షణం ఏర్పర్చాల్సిన అవసరం ఉంది. అత్యున్నత స్థాయిల్లోని క్రీడా విభాగాలు, సమాఖ్యలు, ప్రభుత్వ క్రీడా విభాగాలు అన్నింటిలో లైంగిక వేధింపులకు వ్యతిరేక కమిటీలను తప్పక ఏర్పర్చాలి. ఈ ప్రక్రియను అనుసరించనప్పుడు, సంబంధిత అధికారులనే జవాబుదారీగా చేయాలి. మైదానంలో అత్యున్నతంగా పోరాడుతూనే తమకు న్యాయం జరగాలని గట్టిగా పోరాడుతున్న మన క్రీడాకారిణులకు సంఘీభావం పలకడం ఈ దేశంలో క్రీడలను ప్రేమించే ప్రతి ఒక్కరి బాధ్యత.

వ్యాసకర్త వాలీబాల్ క్రీడాకారిణి, 'ఐద్వా' జాతీయ ఉపాధ్యక్షురాలు
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

గ్రహం అనుగ్రహం
శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.విదియ రా.10.40 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: శ్రవణం ఉ.6.16 వరకు, తదుపరి ధనిష్ఠ తె.4.45 వరకు (తెల్లవారితే మంగళవారం), వర్జ్యం: ఉ.10.00 నుండి 11.32 వరకు, దుర్ముహూర్తం: ప.12.34 నుండి 1.17 వరకు, తదుపరి ప.2.46 నుండి 3.31 వరకు, అమృతఘడియలు: రా.7.02 నుండి 8.29 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 10.30 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.46.

క్లుప్తంగా...

ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాజ్జీరావు

- ఏకగ్రీవంగా అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

సాక్షి, అమరావతి: ఏపీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీ రావు ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం విజయవాడలో నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్(రిటైర్డ్) ఎం.ఆదిశేషులు, పీఎస్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికల్లో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.లావణ్య, ఉపాధ్యక్షులుగా పి.నారాయణస్వామి, బి.రామ్మోహన్ రెడ్డి, ఎం.జయరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సిహెచ్.నరేష్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా ఎస్.బాలకృష్ణన్, ఎ.శ్రీనివాసులు నాయుడు, బి.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా వై.శ్రీనివాస చౌదరి, కార్యవర్గ సభ్యులుగా పి.రామచంద్రరావు, వి.రేణుక, డి.రఘుమా రెడ్డి, జల్లి రమేష్, ఆర్.గౌరీశ్వరరావు, కె.నాగ మల్లేశ్వరరెడ్డి ఎన్నికయ్యారు.

డాక్టర్ సమరానికి ఇన్‌స్పైరింగ్ సెక్సాలజిస్ట్ అవార్డు



ఇన్‌స్పైరింగ్ సెక్సాలజిస్ట్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ సమరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యుడు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పూర్వ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సమరానికి ఇన్‌స్పైరింగ్ సెక్సాలజిస్ట్ ఆఫ్ ఇండియా అవార్డు లభించింది. అంతర్జాతీయ కౌన్సిల్ ఆఫ్ సెక్స్ ఎడ్యుకేషన్ అండ్ పేరెంట్ హుడ్ సంస్థ శనివారం ఈ అవార్డును అందజేసింది. హైదరాబాద్‌లో జరిగిన మిడ్‌సెక్స్‌కాన్ 2023 జాతీయ సదస్సులో సెక్సాలజీ రంగంలో ఐదు దశాబ్దాలుగా డాక్టర్ సమరం అందిస్తున్న సేవలకు, చేస్తున్న విశేష కృషికి ఈ అవార్డు దక్కింది. అంతర్జాతీయ కౌన్సిల్ ఆఫ్ సెక్స్ ఎడ్యుకేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.వెంకటరమణ చేతుల మీదుగా డాక్టర్ సమరం ఈ అవార్డు అందుకున్నారు.

గాయని మంగ్లీ కారుపై రాళ్లు

- బళ్లారి ఉత్సవాల్లో ఘటన



గాయని మంగ్లీ, కారు

సాక్షి, బళ్లారి: బళ్లారి ఉత్సవ్‌లో పాటలు పాడేందుకు వచ్చిన ప్రముఖ గాయని మంగ్లీ కారుపై కొందరు రాళ్లు విసరడంతో అద్దాలు పగిలిపోయాయి. నగరంలో నిర్వహించిన ఉత్సవంలో శనివారం రాత్రి 12 గంటల వరకు మంగ్లీ తెలుగు, కన్నడ భాషలకు చెందిన వివిధ రకాలు పాటలు పాడి అలరించారు. కార్యక్రమం ముగిశాక బయటకు వచ్చేటప్పుడు ఆమెను కలుసుకునేందుకు పెద్ద సంఖ్యలో యువత పోటీ పడ్డారు. దీంతో పోలీసుల స్వల్ప లాఠీచార్జి కూడా చేయాల్సి వచ్చింది. అంతలోనే ఆమె మేకప్ గదిలోకి వెళ్లడంతో కొందరు ఆమె కారుపై రాళ్లు రువ్వడంతో కారు గ్లాసు పగిలిపోయింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

జట్టు కట్టారు.. లాభాల గుట్టు పట్టారు

రైతు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడి స్వయంగా పంటల అమ్మకాలు

- నాబార్డు, ఉద్యాన శాఖ సహకారంతో ఆధునిక పద్ధతులతో వ్యవసాయం
- సోలార్ కోల్డ్ రూమ్, సోలార్ డ్రయ్యర్, పోర్టబుల్ కోల్డ్ స్టోరేజ్ యూనిట్ల ఏర్పాటు
- చిన్న, సన్నకారు రైతులకు గ్రీన్‌హౌస్ ద్వారా ఇజ్రాయిల్ టెక్నాలజీ పరిచయం



సోలార్ డ్రయ్యర్‌లో కొబ్బరి చిప్పలు ఎండబెడుతున్న రైతు

వ్యవసాయ రంగంలో లాభాల గుట్టు పట్టాలన్న ఓ యువరైతు ఆలోచన తోటి రైతులను సైతం జట్టు కట్టేలా చేసింది. ఒక్కొక్కరుగా చేయి కలుపుతూ ఆ రైతులంతా దళారులను తరిమికొట్టి.. సాగులో లాభాల పంట పండిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సాంకేతిక పద్ధతుల్ని అవలంబిస్తూ.. తమకు అవసరమైన సదుపాయాలను తామే సమకూర్చుకుంటున్నారు. పొలం బడుల్లో ప్రగతి దారులు పరుచుకుంటున్న ఆ రైతులను చూడాలంటే.. నెల్లూరు జిల్లా లేగుంటపాడు వెళ్లాల్సిందే..!



పచ్చి మిర్చి గ్రేడింగ్ చేస్తున్న రైతులు

సాక్షి, నెల్లూరు: నెల్లూరు జిల్లా కోవూరు మండలం లేగుంటపాడు గ్రామానికి చెందిన రైతులు 2016లో చేయిచేయి కలిపి సంఘటితమయ్యారు. ఎంబీఏ చదివిన యువరైతు భూపేష్‌రెడ్డితో కలిసి నాబార్డు సహకారంతో రైతు ఉత్పత్తిదారులు సంఘం (ఎఫ్‌పీవో) తరఫున ప్రగతి యువ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తొలుత 20 ఎకరాల పొలంతో 100 మంది రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు కాగా.. ఆ తర్వాత కోవూరు మండలంతో పాటు ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు, జగదేవీపేట, కొత్తూరు, లేబూరు, కొడవలూరు మండలంలోని తలమంచి గ్రామ రైతులు కూడా వారితో జత కలిశారు. ఇలా దాదాపు 2,500 మంది పండ్లు, పూలు, కూరగాయలు సాగు చేసే రైతులు ఎఫ్‌పీవోలో సభ్యులుగా చేరారు. ఒక్కో సభ్యుడు రూ.100 చొప్పున సభ్యత్వ రుసుం, షేర్ క్యాపిటల్ రూ.వెయ్యి వంతున చెల్లించి దాదాపు రూ.25 లక్షల వరకు సమకూర్చుకున్నారు. ఆ సొమ్ముతో వసతుల కల్పన దిశగా అడుగులు వేస్తున్నారు. సభ్యుల్లో అత్యధికులు కౌలు రైతులే కావటం విశేషం.

యంత్రాల బాటపట్టి..

ఉద్యాన శాఖ, నాబార్డు ద్వారా సబ్సిడీ రుణం పొంది రవాణా వాహనాన్ని, తూకంలో మోసపోకుండా విద్యుత్ తూకం యంత్రాలను, వీడర్లను సమకూర్చుకున్నారు. అంతేకాకుండా కలెక్షన్ సెంటర్లు, సోలార్ కోల్డ్ రూమ్, సోలార్ డ్రయ్యర్, పోర్టబుల్ కోల్డ్ స్టోరేజ్ యూనిట్లతోపాటు ఎలక్ట్రిక్ వాహనాలను సైతం సమకూర్చుకున్నారు. సోలార్ కోల్డ్ రూమ్ నిర్మాణానికి దాదాపు రూ.14.5 లక్షల వ్యయం కాగా.. ప్రభుత్వం రూ.11 లక్షల సబ్సిడీ ఇచ్చింది. రైతులకు కొత్త వంగడాలు అందించడం, గిట్టుబాటు ధరకే పంట ఉత్పత్తులు అమ్ముకునేలా అధికారులు అవకాశం కల్పిస్తున్నారు. ఒకవేళ పంట ఉత్పత్తులకు ధర లేకపోయినా కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేసి ధర వచ్చినప్పుడే మార్కెట్‌కు పంపిస్తున్నారు.



అల్లికల కోసం అరటి నార తీస్తున్న రైతులు

జేఎల్‌జీ గ్రూపులకు రుణ సదుపాయం

ఐదుగురు చొప్పున రైతులను జాయింట్ లయబిలిటీ గ్రూపులుగా (జేఎల్‌జీ) ఏర్పాటు చేసి అధికారులు వారికి రుణాలు అందేలా సహకారం అందిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 500 గ్రూపులను ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రూపునకు రూ.5 లక్షల వరకు పెట్టుబడుల కోసం రుణం మంజూరు చేయిస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులకు గ్రీన్ హౌస్ టెక్నాలజీ అందించేందుకు కృషి జరుగుతోంది. 10 సెంట్ల విస్తీర్ణంలో సైతం రూ.లక్ష వ్యయంతో ఇజ్రాయెల్ టెక్నాలజీ ఉపయోగించి పంటల సాగు చేసేలా కృషి చేస్తున్నారు.

విదేశాలకు ఎగుమతులు చేసే లక్ష్యంతో..



రైతులకు అన్ని అవసరాలు తీర్చడంతో పాటు రైతులే సొంతంగా మార్కెటింగ్ చేసుకునే స్థాయికి చేరుకున్నాం. ఆధునిక పద్ధతులతో సేంద్రియ పంటలు పండించే పరిస్థితి తీసుకొచ్చాం. ప్రభుత్వ సహకారంతో పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునేందుకు సోలార్ కోల్డ్ స్టోరేజ్‌లు, మార్కెటింగ్ కోసం వారాంతపు సంత ఏర్పాటు చేసుకున్నాం. విదేశాలకు ఎగుమతులు చేయాలనే లక్ష్యంతో ఉన్నాం

– భూపేష్‌రెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘ రూపకర్త

ఆధునిక పద్ధతులతో సాగు



రైతులంతా ఐకమత్యంతో రైతు ఉత్పత్తిదారుల సంఘంలో చేరాం. మాకు పంటల సాగుపై శిక్షణ కూడా ఇస్తున్నారు. ఆధునిక పద్ధతులతో సాగు చేస్తున్నాం. ఏటా భూసార పరీక్షలు చేయించి అవసరమైన ఎరువులు మాత్రమే వాడుతున్నాం. దీనివల్ల పంటల దిగుబడి పెరిగి వ్యయం తగ్గింది.

– రాజశేఖర్, యువ రైతు, లేగుంటపాడు

సీఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రలు

847వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: బహుజనులను ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక చంద్రబాబు రాష్ట్రంలో అశాంతిని సృష్టించేందుకు యత్నిస్తున్నాడని బహుజన పరిరక్షణ సమితి నేతలు ధ్వజమెత్తారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 847వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో రాష్ట్రాన్ని గాలికొదిలేసి పక్క రాష్ట్రంలో తలదాచుకున్న బాబు, కొడుకులు.. నేడు రాష్ట్రాన్ని ఉద్ధరిస్తాం.. మాకు ఓటేసి గెలిపించండి.. అంటూ యాత్రలు, సభలు నిర్వహిస్తుండటం సిగ్గుచేటన్నారు. ఇన్నేళ్లు అధికారంలో ఉండి చంద్రబాబు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం రియల్ ఎస్టేట్ మాఫియా కోసం అమరావతిని ఏర్పాటు చేసుకుని పరిసర ప్రాంతాల్లో కోట్ల రూపాయల విలువైన భూములను తక్కువ ధరలకు కొనుగోలు చేసి భారీగా లబ్ధిపొందారని విమర్శించారు. మూడు రాజధానుల నిర్ణయంతో విశాఖతో పాటు అమరావతి, రాయలసీమ ప్రాంతాల్లోనూ సమానాభివృద్ధి జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లోనూ స్థిరపడిన ఓ సామాజిక వర్గం కుల వివక్ష చూపుతూ పేదలను ఎదగకుండా అన్ని రకాలుగా అణగదొక్కుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

మండపేట గేదా.. మజాకా!

రోజుకు 26.59 లీటర్ల పాలు ఇస్తున్న నాలుగేళ్ల గేదె



అత్యధిక పాల దిగుబడిని ఇస్తున్న గేదె

మండపేట: ఆ గేదె వయసు నాలుగేళ్లు. పాలదిగుబడిలో తన తల్లిని మించిపోయింది. రోజుకు 26.59 లీటర్లు పాలు ఇస్తూ రికార్డు సృష్టించింది. ఆ గేదె తల్లి రోజుకు 26.58 లీటర్లు పాలు ఇస్తూ రాష్ట్రస్థాయి పాల దిగుబడి పోటీల్లో రెండుసార్లు మొదటి స్థానంలో నిలిచింది. తల్లి గేదె ఆరో ఈతలో అత్యధిక దిగుబడి ఇస్తే... నాలుగేళ్ల వయసు కలిగిన పిల్ల గేదె రెండో ఈతలోనే తల్లిని మించి రికార్డు స్థాయిలో రోజుకు 26.59 లీటర్ల పాల దిగుబడిని నమోదు చేసింది. ఈ విషయాన్ని కేంద్రీయ పశు నమోదు పథకం ప్రతినిధి డి.రాజేశ్వరరావు ఆదివారం నిర్ధారించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన పాడి రైతు ముత్యాల సత్యనారాయణ (అబ్బు) మేలుజాతి పశు పోషణ చేస్తున్నారు. ఎనిమిదేళ్ల కిందట ఆయన తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో ముర్రా జాతి పాడి గేదెను కొనుగోలు చేశారు. ఆ గేదె గతంలో విజయవాడ, మండపేటల్లో జరిగిన రాష్ట్రస్థాయి పాల దిగుబడి పోటీల్లో రెండు సార్లు మొదటి స్థానంలో నిలిచింది. ఈ గేదె సాధించిన అత్యధిక దిగుబడి 26.58 లీటర్లు. ఇప్పటివరకూ ఆ గేదె తమ వద్ద ఆరు ఈతలు ఈనగా, నాలుగు దున్నపోతులు, రెండు పెయ్యదూడలు పుట్టాయని అబ్బు చెప్పారు. దున్నపోతుల్లో రెండింటిని సెమన్ సేకరణ కేంద్రాల వారు తీసుకువెళ్లగా, మరో రెండు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం రికార్డు స్థాయిలో పాలదిగుబడిని ఇస్తున్న పెయ్య ఆరో ఈతలో పుట్టిందని వివరించారు. వీటికి దాణాగా రోజుకు రూ.500 ఖర్చుతో పశుగ్రాసాలు, మొక్కజొన్న, ఉలవలు, తవుడు అందిస్తున్నామని ఆయన చెప్పారు.

అధికారికంగా పాలదిగుబడి లెక్కింపు

ప్రస్తుతం కేంద్రీయ పశు నమోదు పథకం కింద మండపేట, పరిసర ప్రాంతాల్లో అత్యధిక పాల దిగుబడి ఇచ్చే పాడి పశువుల గుర్తింపు ప్రక్రియ జరుగుతోంది. కేంద్రీయ పశు నమోదు పథకం ప్రతినిధి డి.రాజేశ్వరరావు పశువుల వద్దకు వెళ్లి మేలుజాతి పాడి గేదెల పాల దిగుబడిని లెక్కిస్తున్నారు. ఇందులో భాగంగా అబ్బుకు చెందిన గేదె ఒక రోజు 26.59 లీటర్ల పాల దిగుబడిని ఇచ్చిందని రాజేశ్వరరావు తెలిపారు. రెండో ఈతలోనే ఈస్థాయిలో దిగుబడి వస్తే మున్ముందు మరింత పెరుగుతుందని ఆయన చెప్పారు. అత్యధిక దిగుబడినిచ్చే పాడి పశువుల వివరాలను సెమన్ సేకరణ కేంద్రాలకు పంపుతామని, వీటి ద్వారా మేలుజాతి పాడి పశువుల పునరుత్పత్తికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాజేశ్వరరావు తెలిపారు.

ఎంత పని చేశావ్.. తల్లీ!

తొలుత కిడ్నాప్ అయ్యాడంటూ ఫిర్యాదు

- పరుగులు పెట్టిన పోలీసులు
- చివరకు.. ఆడిస్తుండగా బావిలో పడిపోయాడని చెప్పిన తల్లి
- ఆమె మానసిక స్థితి సరిగా లేకపోవడంతో 4 నెలలుగా చికిత్స

సాక్షి, నరసరావుపేట/నరసరావుపేట రూరల్: నరసరావుపేటలో కనిపించకుండాపోయిన ఏడాది బాలుడు బావిలో శవమై తేలాడు. కిడ్నాప్ అయ్యాడని బాలుడి తల్లి ఫిర్యాదు చేయడంతో పరుగులు పెట్టిన పోలీసులు పట్టణంలోని 60 సీసీ కెమెరాలను పరిశీలించి.. కిడ్నాప్ జరగలేదని నిర్ధారించుకున్నారు. అనుమానంతో తల్లిని ప్రశ్నించగా.. పిల్లాడిని ఆడిస్తుండగా పొరపాటున బావిలో పడిపోయాడని తెలిపింది. ఆమె మానసిక స్థితి సరిగా లేకపోవడంతో చికిత్స తీసుకుంటోంది. బావి నుంచి బాలుడి మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

అసలేం జరిగిందంటే..

పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం బండివారిపాలేనికి చెందిన బండి వాసు, సాయిలక్ష్మి దంపతులకు కుమార్తె మోక్ష, కుమారుడు భానుప్రకాష్ (1) ఉన్నారు. కాగా, వాసు, సాయిలక్ష్మి దంపతులు నరసరావుపేట శివారులోని బ్యాంక్ కాలనీలో కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో తమ ఏడాది కుమారుడు భానుప్రకాష్ కనిపించడం లేదని తల్లి సాయిలక్ష్మి తన భర్త, బంధువులకు సమాచారం అందించింది. దీంతో తమ కుమారుడు కిడ్నాప్ అయ్యాడని తండ్రి వాసు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంట్రుకలు కొనుగోలు చేసే వ్యక్తులు శుక్రవారం రెక్కీ నిర్వహించారని, శనివారం సాయంత్రం తమ బాబును అపహరించి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు ఘటన జరిగిన ప్రాంతం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసును తక్షణమే అక్కడికి బదిలీ చేశారు. ఆ వెంటనే రంగంలోకి దిగిన రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్‌బీ సీఐ ప్రభాకర్ తమ సిబ్బందితో ఆ ప్రాంతంలో జల్లెడ పట్టారు. దాదాపు 60 సీసీ కెమెరాలను పరిశీలించగా.. బాలుడి ఆచూకీ ఎక్కడా నమోదు కాలేదు.

తల్లిని ప్రశ్నించడంతో..

బాలుడు భానుప్రకాష్ ఆ ప్రాంతం నుంచి బయటకు వెళ్లలేదని పోలీసులు నిర్ధారించుకున్నారు. దీంతో బాలుడి తల్లి సాయిలక్ష్మిని రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. ప్రహరీపై ఆడుకుంటున్న బాలుడు కిందకు జారి పాత బావిలో పడిపోయాడని సాయిలక్ష్మి తెలిపింది. ఈ విషయం చెబితే భర్త, బంధువులు ఏమంటారోనన్న భయంతో చెప్పలేదని భోరున విలపించింది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో పోలీసులు బావిలో వెతకగా బాలుడి మృతదేహం లభించింది. పోస్ట్‌మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. బాలుడి తల్లి సాయిలక్ష్మి మానసిక స్థితి సరిగా లేదని పోలీసుల విచారణలో తేలింది. మొదటి కాన్పు సమయంలోనే ఆమె మానసిక సమస్య రావడంతో చికిత్స అందిస్తున్నట్టు భర్త తెలిపారు. నెల రోజుల క్రితం లక్ష్మి తల్లిదండ్రులు క్యాన్సర్ కారణంగా మృతి చెందినట్టు తెలిసింది. దీంతో ఆమె ఆరోగ్యం మరింత క్షీణించడంతో 15 రోజుల క్రితం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం చిన్నారి తన చేతుల్లో ఆడుకుంటూ కిందపడిపోవడంతో ఆమె భయపడి బాలుడు కనిపించడం లేదని భర్త, బంధువులకు చెప్పిందని ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు.

విజయనగరంలో మిల్లెట్ మహోత్సవ్

- నేడు కూడా కొనసాగింపు
- 25 స్టాల్స్ ఏర్పాటు
- ఆహార పదార్థాలు, వంటల ప్రదర్శన



మిల్లెట్ మహోత్సవ్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో విజయనగరంలో రెండురోజులు నిర్వహించతలపెట్టిన మిల్లెట్ మహోత్సవ్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ శాఖ, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మిల్లెట్ మహోత్సవ్‌ను శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సోమవారం కూడా కొనసాగనున్న ఈ మహోత్సవ్‌లో చిరుధాన్యాలతో చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలు, వంటల ప్రదర్శన, విక్రయాలు ఏర్పాటు చేసిన 25 స్టాల్స్‌ను ప్రారంభించి, ఆ ఆహార పదార్థాల తయారీ పద్ధతులను వివరించే పుస్తకాలను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ ప్రస్తుతం తీసుకునే ఆహారంతో రోగనిరోధక శక్తి తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు చిరు ధాన్యాల ఉత్పత్తుల ఆవశ్యకత, వినియోగం, పంటలసాగుపై దృష్టి సారించాలని సూచించారు. చిరుధాన్యాల పంటల సాగులో ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో ఉందని చెప్పారు. వీటి వినియోగంపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరుధాన్యాల సాగు, వినియోగంపై అవగాహన కల్పించేదిశగా ముందుకెళుతున్నారని ఆయన చెప్పారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో చిరుధాన్యాల సాగులో విజయనగరం జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయిలో విజయనగరంలో ఉత్సవ్‌ను నిర్వహించటం శుభపరిణామమని పేర్కొన్నారు. విజయనగరంలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో రాగి, సామ, కొర్ర, వరిగ, ఆరిక, ఊద వంటి పంటలపై పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో వ్యవసాయంలో సవాళ్లను అధిగమించేందుకు, యువతరానికి పౌష్టికాహారం అందించేందుకు చిరుధాన్యాల సాగును, వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ డి.ప్రవీణ్, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఏపీఎఫ్‌పీవో సీఈవో శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ మిల్లెట్

▶ మొదటి పేజీ తరువాయి

అవగాహన పెంపొందిస్తూ రైతులతో జిల్లాలవారీగా మిలెట్ క్లస్టర్లు, వర్క్‌షాపులు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇవి ప్రారంభమవగా.. ఈ నెల 31 వరకు జిల్లాలవారీగా నిర్వహించనున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి.. కలెక్టర్లకు ఇప్పటికే మార్గనిర్దేశం చేశారు.

పుష్కలంగా పోషకాలు

చిరుధాన్యాల్లో 7 – 12 శాతం ప్రోటీన్లు, 2 – 5 శాతం కొవ్వు, 65 – 75 శాతం కార్బోహైడ్రేట్లు, 15 – 20 శాతం ఫైబర్, ఐరన్, జింక్, కాల్షియం ఉంటాయి. ఊబకాయం, మధుమేహం, జీవనశైలి జబ్బులు, క్యాన్సర్ లాంటి సమస్యల పరిష్కారానికి చిరుధాన్యాల వినియోగమే ఉత్తమ మార్గం. 1970 నుంచి దేశంలో చిరుధాన్యాల దిగుబడి, సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతోంది. ఇందుకు ప్రధాన కారణం హరిత విప్లవంలో భాగంగా బియ్యం, గోధుమల ఉత్పత్తి, సాగు విస్తీర్ణం పెంచడంపై దృష్టి సారించడమే. 1962లో చిరుధాన్యాల తలసరి వినియోగం 32.9 కిలోలుండగా ఇప్పుడు 4.2 కిలోలకు తగ్గిపోయింది.

ఈ నెల 31 వరకు చిరుధాన్యాల క్లస్టర్ల నిర్వహణ ఇలా

జిల్లా	చిరుధాన్యం
విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖపట్టణం, చిత్తూరు, అన్నమయ్య, శ్రీ సత్యసాయి	రాగులు
తూర్పు గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు	జొన్నలు
అల్లూరి సీతారామరాజు	రాగులు, కొర్ర, సామ
బాపట్ల	జొన్నలు, రాగులు
పల్నాడు	వరిగ
ప్రకాశం	రాగులు, వరిగ
ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు	జొన్నలు, సజ్జలు
వైఎస్సార్	సజ్జలు
అనంతపురం	జొన్నలు, రాగులు, కొర్రలు
కర్నూలు, నంద్యాల	కొర్రలు





ఈ ఏడాది ప్రణాళిక ఇదీ

- జనవరి: చిరుధాన్యాల సాగు రైతులతో క్లస్టర్ల ఏర్పాటు
- ఫిబ్రవరి: రైతులు, స్వయం సహాయక సంఘాలు, ఎన్‌జీవోలు, ఎఫ్‌పీవోలతో రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు
- మార్చి: చిరుధాన్యాల ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడంపై అవగాహన కల్పిస్తూ పోస్టర్ల పంపిణీ
- ఏప్రిల్: క్లస్టర్ రైతులు, ఎన్‌జీవోలు, స్వయం సహాయక సంఘాలకు మిలెట్ సాగు, వంటకాలపై బుక్‌లెట్లు పంపిణీ
- మే: చిరుధాన్యాలతో వంటల పోటీలు, ఫుడ్ ఫెస్టివల్స్
- జూన్: ఉత్తమ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ
- జూలై: క్లస్టర్ల వారీగా రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ
- ఆగస్టు: పోస్టర్ల ద్వారా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు
- సెప్టెంబర్: వ్యవసాయ సిబ్బంది, రైతులు, ఎఫ్‌పీవోలు, ఎన్‌జీవోలు, స్వయం సహాయక సంఘాలకు చిరుధాన్యాల ప్రాసెసింగ్ ద్వారా అదనపు విలువ జోడింపు, మార్కెటింగ్‌పై శిక్షణ
- అక్టోబర్: గర్భిణులు, స్కూల్ పిల్లలకు ఐసీడీఎస్, మధ్యాహ్న భోజనం ద్వారా సప్లిమెంటరీగా చిరుధాన్యాల పంపిణీ
- నవంబర్: ప్రాసెసింగ్ యూనిట్ల పంపిణీ, క్షేత్రస్థాయి అధ్యయనం
- డిసెంబర్: ఐటీసీ, ఎఫ్‌పీవోలు, స్వయం సహాయక సంఘాలతో టై అప్‌తో పాటు జాతీయ రహదారుల పక్కన మిలెట్ కేఫ్‌ల ఏర్పాటు




ఆకట్టుకున్న నేతాజీ సైకత శిల్పం

స్వాతంత్య్ర పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని తీర ప్రాంతం ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పకారుడు మంచాల సనత్‌కుమార్ నేతాజీ సైకత శిల్పం ఆదివారం రూపొందించారు. జోహార్ నేతాజీ అంటూ రాసి నివాళులర్పించారు.

– చిల్లకూరు(తిరుపతి జిల్లా)

క్లుప్తంగా



వారణాసిలో సీఎన్‌జీ బోట్లు

వారణాసి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వారణాసిలో గంగా నదిలో తిరిగే అన్ని బోట్లకు పర్యావరణ హిత సీఎన్‌జీ ఇంజిన్లను అమరుస్తామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చెప్పారు. 500 బోట్లను డీజిల్‌కు బదులు సీఎన్‌జీ ఇంజిన్లను అమర్చడం లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 583 బోట్లను మార్చామన్నారు. మరో 2వేల బోట్లను సీఎన్‌జీకి మార్చే పనిలో ఉన్నామని చెప్పారు. ఇకపై పెద్ద శబ్దాలతో కాలుష్యాన్ని వెదజల్లే డీజిల్ బోట్లకు బదులుగా గంగానదిలో శబ్దంలేని, తక్కువ కలుషితాలను మాత్రమే వదిలే సీఎన్‌జీ బోట్లు పూర్తి స్థాయిలో రానున్నాయని చెప్పారు. సీఎన్‌జీ వల్ల పడవల నిర్వాహకులకు ఏటా రూ.30 వేల దాకా ఆదా అవుతుందన్నారు.

ప్రాంతీయ భాషల్లో సుప్రీం తీర్పు ప్రతులు..

సీజేఐ సూచనపై మోదీ హర్షం

న్యూఢిల్లీ: తీర్పుల ప్రతులను ప్రాంతీయ భాషల్లో కూడా అందుబాటులోకి తేవాలన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రయత్నాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు. ''సీజేఐ యోచన ప్రశంసనీయం. మన దేశంలో ఎన్నో భాషలున్నాయి. మన సాంస్కృతిక చైతన్యానికి ఇవి తోడ్పడతాయి. ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులను మాతృభాషల్లోనే అభ్యసించే అవకాశం ఇవ్వడంతోపాటు, భారతీయ భాషలను ప్రోత్సహించేందుకు కేంద్రం అనేక ప్రయత్నాలు చేస్తోంది'' అంటూ ట్వీట్ చేశారు.

ఉక్రెయిన్‌కు ఆయుధాలిస్తే భారీగా విరుచుకుపడతాం

పశ్చిమ దేశాలకు రష్యా హెచ్చరిక

కీవ్: ఉక్రెయిన్‌కు శక్తివంతమైన ఆయుధాలిచ్చి తమను తాము నాశనం చేసుకోవద్దని పశ్చిమదేశాలకు రష్యా పార్లమెంట్ స్పీకర్ వ్యాచెస్లావ్ వొలోదిన్ హెచ్చరించారు. ఎదురుదాడులకు ఉపయోగపడే ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందజేస్తే, తాము మరింత శక్తివంతమైన ఆయుధాలను వాడాల్సి వస్తుందని, అంతిమంగా ప్రపంచ వినాశనానికే దారి తీస్తుందన్నారు. ఉక్రెయిన్‌కు యుద్ధ ట్యాంకులు మినహా గగనతల రక్షణ వ్యవస్థలు తదితరాలను అందజేస్తామంటూ నాటో, అమెరికా ఇస్తున్న హామీలపై ఆయన ఆదివారం ఈ మేరకు స్పందించారు.

ఆమె కమాండ్‌లో...

దేశంలో తొలిసారిగా కల్నల్ స్థాయికి ఎదిగిన మహిళా అధికారులు


- సియాచిన్‌లోనూ కమాండింగ్ అధికారులుగా మహిళల నియామకం
- నెరవేరిన దశాబ్దాల కల

ఆకాశంలో సగం కాదు...
నింగి నేల నీరు దేనినైనా పూర్తిగా కమాండ్ చేస్తామంటోంది మహిళాలోకం
కఠోరమైన శారీరక శ్రమ చేయాల్సిన కదనరంగాన్ని కూడా నడిపించడానికి ముందుకొచ్చింది..
దశాబ్దాలుగా ఎందరో మహిళా అధికారుల కల ఎట్టకేలకు నెరవేరింది.
100 మందికిపైగా మహిళలు పదోన్నతులు పొంది కల్నల్ స్థాయికి ఎదిగారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



భారత ఆర్మీలో చరిత్రాత్మక ముందడుగు పడింది. సియాచిన్ సహా వివిధ కమాండ్ యూనిట్లను మహిళలు కూడా ముందుండి నడిపించనున్నారు. ఇన్నాళ్లూ పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ బాధ్యతల్ని మొట్టమొదటి సారిగా మహిళలు కూడా నిర్వర్తించనున్నారు. రెజిమెంట్లు, బెటాలియన్లకు అధికార పదవుల్లో మహిళల నియామకానికి సంబంధించిన ఎంపిక ప్రక్రియ ఈ నెల 9 నుంచి 22 వరకు జరిగింది. దాదాపుగా 108 మంది మహిళా అధికారులు కల్నల్‌గా పదోన్నతులు పొందారు. 1992 నుంచి 2006 బ్యాచ్‌కు చెందిన మహిళా అధికారులకు పదోన్నతులు ఇవ్వడానికి ప్రత్యేక కమిటీ ఎంపిక ప్రక్రియ పూర్తి చేసింది. వీరంతా ఇంజనీర్స్, సిగ్నల్స్, ఆర్మీ ఎయిర్ డిఫెన్స్, ఇంటెలిజెన్స్ కోర్, ఆర్మీ సర్వీస్ కోర్, ఆర్మీ ఆర్డన్స్ కోర్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీర్స్ వంటి విభాగాలకు అధికారులుగా సేవలందిస్తారు. భారత సాయుధ బలగాల్లో 1992 నుంచి మహిళా అధికారులు ఉన్నారు. అయితే వారంతా షార్ట్ సర్వీసు కమిషన్ (ఎస్ఎస్‌సీ) అధికారులుగానే ఇన్నేళ్లుగా కొనసాగుతున్నారు. ఇంజనీర్లు, న్యాయవాదులు, వంటి అడ్మినిస్ట్రేటివ్ పాత్రలే పోషిస్తున్నారు. యుద్ధ క్షేత్రాల్లో గాయపడ్డ జవాన్లకి చికిత్స అందించే వైద్యులు, నర్సులుగా కూడా ఉన్నారు. 16–18 ఏళ్ల సర్వీసు ఉంటేనే కమాండర్ పదవికి అర్హత సాధిస్తారు. ఇప్పుడు కోర్ ఆఫ్ ఆర్టిలరీ, కంబాట్ సపోర్ట్ ఆర్మ్‌లలో మహిళా అధికారుల్ని నియమించనున్నారు. భారత వాయుసేన, నావికాదళంలో అన్ని విభాగాల్లో మహిళా అధికారులు ఉన్నారు. వారికి శాశ్వత కమిషన్లు కూడా ఉన్నాయి. యుద్ధ విమానాలను, యుద్ధ నౌకల్ని నడిపించే మహిళలూ ఉన్నారు. త్రివిధ బలగాల్లో అతి పెద్దదైన పదాతి దళంలో మాత్రమే మహిళల పట్ల ఇన్నాళ్లూ వివక్ష కొనసాగుతూ వచ్చింది.



ఎందుకీ వివక్ష

పురుషులతో పోలిస్తే మహిళల శారీరక దారుఢ్యంపై నున్న సందేహాలే ఇన్నాళ్లూ వారికి అవకాశాల్ని దూరం చేశాయి. మాతృత్వం, పిల్లల పోషణ, ప్రసూతి సెలవులు వంటివి మహిళలకు తప్పనిసరిగా ఇవ్వాలని, యుద్ధం ముంచుకొచ్చే నేపథ్యాల్లో అది సాధ్యం కాదనే వాదన వినిపించింది. కానీ ఇప్పుడిప్పుడే పరిస్థితుల్లో మార్పు వస్తోంది. మహిళలకు ఎక్కడైనా పని చేసే అవకాశం ఇవ్వాలని డిమాండ్లు వినిపించాయి. భారత వాయుసేన, నావికాదళంతో పోలిస్తే ఆర్మీలో వివక్ష ఎక్కువగా ఉంది. యుద్ధభూమిలో నేరుగా మహిళలుంటే శత్రు దేశానికి చిక్కితే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి. దీంతో ఇప్పటికీ పోరాట క్షేత్రాల్లో మహిళా కమాండర్లను నియమించడానికి భారత సైన్యం ఇంకా సిద్ధంగా లేదు.

సుప్రీం తీర్పుతో నెరవేరిన కల

భారత సైన్యంలో పనిచేస్తున్న మహిళా అధికారులకు శాశ్వత కమిషన్, కమాండింగ్ పదవులు ఇవ్వాల్సిందేనని 2020 ఫిబ్రవరిలో సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పు చెప్పింది. వారు ఎన్ని సంవత్సరాలుగా సర్వీసులో ఉన్నారనే విషయంతో సంబంధం లేకుండా అందరికీ శాశ్వత కమిషన్ వర్తింపచేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పుతో ఆర్మీలో మహిళలు పురోగతి సాధించడానికి, నాయకత్వ సామర్థ్యాలను ప్రదర్శించడానికి, పదోన్నతులకు మార్గం సుగమమైంది.

యూనిట్‌ను కమాండ్ చేయడమంటే..?

పదాతి దళంలో క్షేత్ర స్థాయిలో సైనికులందరికీ నేరుగా ఆదేశాలు ఇస్తూ వారిని ముందుకు నడిపించే కీలక బాధ్యత. ఇప్పటివరకు పురుషులు మాత్రమే నిర్వహించిన ఈ బాధ్యతల్ని మహిళలు కూడా అందుకున్నారు. సైన్యంలో కల్నల్ పదవి మహిళకి లభిస్తే ఆమె కనుసన్నల్లోనే సైన్యం నడుస్తుంది. బ్రిగేడర్, మేజర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ వంటి ఉన్నతాధికారులు నేరుగా సైనికులతో సంబంధాలను కొనసాగించరు. ఇలాంటి పదవుల్లోనే ఎన్నో సవాళ్లను మహిళలు ఎదర్కోవాల్సి ఉంటుంది. అప్పుడే మహిళల్లో నాయకత్వ సామర్థ్యం బయట ప్రపంచానికి తెలుస్తుంది.




''సియాచిన్‌లో మొట్టమొదటి మహిళా అధికారిగా శివ చౌహాన్‌ను నియామకం మాలో కొత్త ఉత్సాహాన్ని పెంచింది. స్త్రీ, పురుషులన్న భేదం లేకుండా ప్రతీ ఒక్కరికీ వారికి మాత్రమే సొంతమయ్యే సామర్థ్యాలుంటాయి. ఆర్మీలో మహిళలకు మంచి భవిష్యత్ ఉంది. శారీరక దారుఢ్యం ఉన్నవారు కూడా ఇన్నాళ్లూ వివక్ష కారణంగా పదవులకి దూరమయ్యారు. ఇక ఆ రోజులు పోయాయి''

- దీక్షా ధామిన్, ఆర్మీకి శిక్షణ పొందుతున్న యువతి

''ఆర్మీలోకి రావాలనుకునే మహిళల సంఖ్య ఇంకా పెరుగుతుంది. పోరాట క్షేత్రాలకు సంబంధించిన విభాగాల్లో కూడా మహిళా అధికారులు రావాలి. ఎందుకంటే మహిళలు ఎంతో చురుగ్గా, త్వరితగతిన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంతో ఉంటారు''

- దీప్‌నూర్ సహోతా, ఆర్మీకి శిక్షణ పొందుతున్న యువతి



బైడెన్ ఇంట్లో ఎఫ్‌బీఐ సోదాలు

ఆరు రహస్య ఫైళ్లు స్వాధీనం

వాషింగ్టన్: రహస్య ఫైళ్ల వ్యవహారం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు చుట్టుకుంటోంది. వచ్చే ఏడాది జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ ఫైళ్లు బయటపడడం ఆయనకు ప్రతికూలంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఆయన నివాసంలో తాజాగా చేపట్టిన సోదాల్లో మరో ఆరు ఫైళ్లు లభ్యం కావడం కలకలం రేపుతోంది. విల్మింగ్టన్‌లోని బైడెన్ ప్రైవేట్ నివాసంలో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) అధికారులు శుక్రవారం ఉదయం నుంచి రాత్రి దాకా ఏకంగా 13 గంటలపాటు సోదాలు చేపట్టారు. మొత్తం ఆరు ఫైళ్లు లభ్యమయ్యాయి. ఎఫ్‌బీఐ అధికారులు వీటిని ఉన్నతాధికారులకు నివేదించారు. సోదాల సమయంలో ఇరుపక్షాలకు చెందిన న్యాయ బృందాలతోపాటు శ్వేతసౌధం అధికారి ఒకరు ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. సోదాలు జరుపుతున్న సమయంలో బైడెన్ గానీ, ఆయన భార్య గానీ ఇంట్లో లేరని తెలిసింది. సోదాల్లో ఫైళ్లతో పాటు చేతి రాతతో ఉన్న కొన్ని పత్రాలు కూడా లభించినట్లు సమాచారం. ఆరు ఫైళ్లు లభ్యం కాగా, ఇందులో కొన్ని బైడెన్ సెనేటర్‌గా ఉన్నప్పటివి, మరికొన్ని ఉపాధ్యక్షుడిగా పనిచేసిన కాలానికి సంబంధించినవని ఆయన వ్యక్తిగత అటార్నీ బాబ్ బోయర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

నాకు ఎలాంటి విచారం లేదు: బైడెన్

గత ఏడాది నవంబర్ 2న వాషింగ్టన్ డీసీలో బైడెన్‌కు చెందిన పెన్ బైడెన్ సెంటర్‌లో, డిసెంబర్ 20న వాషింగ్టన్ ఇంట్లోని గ్యారేజీలో, ఈ ఏడాది జనవరి 12న అదే ఇంట్లో మరోసారి రహస్య దస్త్రాలు బయటపడడంతో వివాదం మొదలైంది. ఆ తర్వాత ఆయన వాటిని నేషనల్ ఆర్కైవ్స్ అందజేశారు. నిజానికి పదవీ కాలం ముగిసిన తర్వాత అధికారిక రహస్య పత్రాలను కలిగి ఉండటం చట్టవిరుద్ధం. ఇలాంటి చర్యలను అమెరికా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంది. అధ్యక్షుడిని అభిశంసించినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు. ప్రెసిడెన్షియల్ రికార్డ్స్ చట్టం ప్రకారం.. పదవీ కాలం ముగిసిన తర్వాత అధికారిక పత్రాలను నేషనల్ ఆర్కైవ్స్‌కు పంపించాలి. ఇదిలా ఉండగా, తన నివాసాల్లో జరుగుతున్న సోదాలపై బైడెన్ స్పందించారు. ఫైళ్లు దొరకడంపై తనకు ఎలాంటి విచారం లేదన్నారు. అయితే, బైడెన్ తీరుపై రిపబ్లికన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహస్య పత్రాల విషయంలో బైడెన్ ఇక తప్పించుకోలేరని చెబుతున్నారు. ఆయన కుటుంబంతోపాటు కుమారుడు హంటర్ బైడెన్ అక్రమ వ్యాపారాలపై సమగ్ర దర్యాప్తుకు డిమాండ్ చేస్తున్నారు. బైడెన్ నివాసాల్లో రహస్య పత్రాలు బయటపడడంపై కాంగ్రెస్ విచారణ చేపడుతుందని స్పీకర్ కెవిన్ మెక్‌కార్తీ ఆశాభావం వెలిబుచ్చారు.

బైడెన్‌కు సన్‌స్ట్రోక్

అమెరికా ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో జో బైడెన్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తండ్రి అధికారమే అండగా ఆయన కుమారుడు హంటర్ బైడెన్ చెలరేగిపోయాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అమెరికాకు ప్రత్యర్థి దేశాలుగా భావించే చైనా, రష్యాలో హంటర్ బైడెన్‌కు వ్యాపారాలున్నాయి. ఆయా దేశాల్లో పలు కంపెనీల్లో ఆయన పెట్టుబడులు పెట్టి, భారీగా ఆర్జించినట్లు సమాచారం. అంతేకాకుండా రష్యా నుంచి హంటర్ లక్షలాది డాలర్లు ముడుపులుగా స్వీకరించాడని సాక్షాత్తూ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించిన సంగతి తెలిసిందే. మరోవైపు హంటర్ బైడెన్‌కు చెందినవిగా భావిస్తున్న ల్యాప్‌టాప్‌ల్లో ఆయన మత్తు మందులు వాడుతున్న ఫొటోలు, ఇతర వీడియోలు, మెయిళ్లు బయటపడడం సంచలనం సృష్టించింది. 2019 డిసెంబర్‌లో ఎఫ్‌బీఐ ఆ ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుంది. అందులోని వివరాలను న్యూయార్క్ పోస్టు పత్రిక ప్రచురించింది.



బైడెన్ ఇంటి ఆవరణలో కారు వెనకాల పడున్న రహస్య పత్రాల బాక్సు (సర్కిల్లో)

అమెరికాలో కాల్పులు..10 మంది మృతి

- మరో 10 మందికి గాయాలు
- చైనా న్యూ ఇయర్ వేడుకల్లో విషాదం



మాంటెరీ పార్క్: అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నగరంలో భారీ కాల్పుల ఘటన చోటుచేసుకుంది. లూనార్ నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న వారిపై దుండగుడు జరిపిన కాల్పుల్లో 10 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆసియా సంతతి వారు, ముఖ్యంగా చైనీయులు అత్యధికంగా నివసించే మాంటెరీ పార్క్‌లోని గార్వే అవెన్యూలోని ఓ డ్యాన్స్ క్లబ్‌లో శనివారం రాత్రి 10.22 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి తుపాకీతో క్లబ్‌లో ఉన్న వారిపై విచక్షణారహితంగా కాల్పులు దిగినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. 10 మంది అక్కడికక్కడే చనిపోయారు. క్షతగాత్రులైన 10 మందిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. కాల్పులకు పాల్పడిన వ్యక్తి ఎవరు? డ్యాన్స్ క్లబ్‌లోని వారితో దుండగుడికి పరిచయం ఉందా? అతడు వాడిన ఆయుధం వంటి వివరాలను పోలీసులు వెల్లడించలేదు. దుండగుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టిన పోలీసులు, కాల్పుల ఘటన వివరాలను ఆలస్యంగా వెల్లడించడానికి కారణాలు తెలియాల్సి ఉంది. అక్కడికి సమీపంలోని అల్హాంబ్రాలో చోటుచేసుకున్న మరో కాల్పుల ఘటనతో ఏమైనా సంబంధం ఉందా అనే విషయమై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు చెప్పారు. రెండు రోజులపాటు జరిగే లూనార్ న్యూ ఇయర్ వేడుకలు లాస్ ఏంజెలెస్‌లో శనివారం మొదలయ్యాయి. ఇక్కడి చిన్నాపెద్దా వ్యాపార సంస్థల పేర్లు ఇంగ్లిష్‌తోపాటు చైనీస్ మాండరిన్ భాషల్లో ఉంటాయి. చైనీస్ వేడుకలను ఇక్కడ జరుపుకుంటుంటారు. చైనీస్ సినిమాలను ఇక్కడి థియేటర్లలో ప్రదర్శిస్తుంటారు. ఈ నెలలో అమెరికాలో జరిగిన ఐదో అతిపెద్ద కాల్పుల ఘటన ఇదని అధికారులు తెలిపారు. కొలరాడో నైట్‌క్లబ్‌లో రెండు నెలల క్రితం జరిగిన కాల్పుల్లో ఐదుగురు చనిపోయారు. గత ఏడాది మే 22న టెక్సాస్‌లోని ఉవాల్డే స్కూల్‌లో జరిగిన కాల్పుల ఘటనలో 21 మంది చనిపోయిన విషయం తెలిసిందే.

పెరూలో ఆందోళనలు హింసాత్మకం



లిమా/వాటికన్ సిటీ: దక్షిణ అమెరికా ఖండంలోని పెరూలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ జనం వీధుల్లోకి వస్తున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి రాజధాని లిమాకు చేరుకుంటున్నారు. అధ్యక్షురాలు డినా బోలార్టే వెంటనే నుంచి దిగిపోవాలని డిమాండ్ చేస్తున్నారు. భద్రతా సిబ్బందితో ఘర్షణకు దిగుతున్నారు. డిసెంబర్ నుంచి ఇప్పటిదాకా ఘర్షణలో 55 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. తాజాగా శుక్రవారం రాత్రి దక్షిణ పూనోలో నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారింది. పోలీసులతో జరిగిన ఘర్షణలో ఒక నిరసనకారుడు మరణించాడు, 9 మంది గాయపడ్డారు. దేశంలో హింస ప్రజ్వరిల్లుతుండడంతో ప్రభుత్వ అప్రమత్తమైంది. పెరూలో 15వ శతాబ్దానికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత కట్టడం, ప్రపంచ ఏడు వింతల్లో ఒకటైన మచ్చుపిచ్చు సందర్శనను నిరవధికంగా నిలిపివేస్తున్నట్లు సాంస్కృతిక శాఖ ప్రకటించింది. మచ్చుపిచ్చులో 417 మంది సందర్శకులు చిక్కుకుపోయారు. వారిలో 300 మందికిపైగా విదేశీయులున్నారు. పెరూలో హింసాకాండను వెంటనే ఆపాలని ప్రభుత్వానికి, ప్రజలకు పోప్ ఫ్రాన్సిస్ విజ్ఞప్తి చేశారు.

బ్రెజిల్ ఆర్మీ చీఫ్‌పై వేటు

బ్రసిలియా: జనవరి 8వ తేదీన బ్రెజిల్ పార్లమెంట్, అధ్యక్ష భవనం, సుప్రీంకోర్టుపై జరిగిన దాడుల నేపథ్యంలో బ్రెజిల్ ఆర్మీ చీఫ్ జనరల్ జులియో సీజర్ డి అర్రుడాపై వేటు పడింది. ఆయన స్థానంలో ఆగ్నేయ మిలటరీ కమాండ్ హెడ్ జనరల్ టామ్స్ మిగుయెల్ రిబిరో పయివా శనివారం నియమితులయ్యారు. మాజీ అధ్యక్షుడు బొల్సొనారో మద్దతుదారులుగా భావిస్తున్న వారు పాల్పడిన దాడికి సైనిక బలగాల్లో కొందరు అనుకూలంగా ఉన్నట్లు చేసిన వ్యాఖ్యలే జనరల్ జులియో కొంపముంచాయని భావిస్తున్నారు. అధ్యక్షుడు లులా డిసిల్వా ఈ పరిణామంపై ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు.

వృద్ధుడిని 8 కిలోమీటర్లు లాక్కెళ్లిన కారు

పట్నా: వాహనంతో ఢీకొట్టి, ఈడ్చుకెళ్లిన మరో ఘటన ఇది. వేగంగా వెళ్తున్న కారు వృద్ధుడిని ఢీకొట్టింది. బానెట్‌పై చిక్కుకుని, వేలాడుతున్న అతడు కారాపాలని ప్రాధేయ పడినప్పటికీ అందులోని వారు 8 కిలోమీటర్ల దూరం తీసుకెళ్లారు. అనంతరం బ్రేకులు వేయడంతో కిందపడిన వృద్ధుడిని కారుతో తొక్కుకుంటూ వెళ్లగా ప్రాణాలు కోల్పోయాడు. ఈ అమానుషం బిహార్ రాష్ట్రం తూర్పు చంపారన్ జిల్లా కొట్వాలోని 27వ నంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. మృతుడిని బంగ్రా గ్రామానికి చెందిన శంకర్ చౌధురి(70)గా గుర్తించారు. శంకర్ చౌధురి సైకిల్‌పై రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో కారు ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. బానెట్‌పై వేలాడుతున్న అతడు భయంతో కారు ఆపాలని కోరినప్పటికీ అందులోని వారు కనికరించలేదన్నారు. ఎనిమిది కిలోమీటర్ల దూరం వెళ్లాక స్థానికులు కేకలు వేయడంతో కారుకు బ్రేకులు వేశారు. కిందపడిన వృద్ధుడిని కారుతో తొక్కుకుంటూ వెళ్లారు. దీంతో, అతడు అక్కడికక్కడే చనిపోయాడు. అనంతరం కారును అక్కడే వదిలేసి డ్రైవర్, అందులోని వారంతా పరారయ్యారు.

సరిహద్దులో డ్రగ్స్ డ్రోన్ కూల్చివేత

చండీగఢ్: పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో భారత్–పాకిస్తాన్ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో మాదకద్రవ్యాల డ్రోన్‌ను కూల్చివేశారు. బీఎస్ఎఫ్ సిబ్బంది, పంజాబ్ పోలీసులు ఉమ్మడిగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. కక్కార్ గ్రామంలో 6 రెక్కలున్న డ్రోన్ ఎగురుతున్నట్లుగా గుర్తించామని, వెంటనే ఏకే–47 నుంచి 12 రౌండ్ల కాల్పులు జరిపి కూల్చివేశామని, ఇందులో 5 కిలోల హెరాయిన్ లభ్యమైందని అధికారులు ఆదివారం వెల్లడించారు. అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం 2 కిలోమీటర్ల దూరంలో ఈ సంఘటన జరిగిందన్నారు. డ్రోన్‌కు సంబంధించి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

శ్రద్ధా వాకర్ హత్య కేసు.. 3,000 పేజీల చార్జిషీట్



న్యూఢిల్లీ: దేశవ్యాప్త సంచలనం సృష్టించిన శ్రద్ధా వాకర్ హత్య కేసులో 3 వేల పేజీల భారీ ముసాయిదా చార్జిషీట్‌ను ఢిల్లీ పోలీసు అధికారులు, న్యాయ నిపుణులు తయారు చేశారు. ఇందులో 100 సాక్ష్యాలతో కూడిన ఫోరెన్సిక్, ఎలక్ట్రానిక్ ఆధారాలున్నాయి. దీని నుంచి తుది చార్జిషీట్‌ను రూపొందించే పనిలో నిమగ్నమై ఉన్నారు. దక్షిణ ఢిల్లీలోని మెహ్రౌలీలో ఉండే అఫ్తాబ్ పూనావాలా తన భాగస్వామి శ్రద్ధా వాకర్‌ను గత మేలో గొంతు పిసికి చంపి, మృతదేహాన్ని 35 ముక్కలుగా నరికి, ఢిల్లీలోని వేర్వేరు ప్రాంతాల్లో పడేసేందుకు ముందుగా వాటిని ఫ్రిజ్‌లో ఉంచిన విషయం తెలిసిందే. ఛతర్‌పూర్ అటవీ ప్రాంతంలో లభించిన ఎముకలు శ్రద్ధవేనని డీఎన్ఏ నివేదికల్లో తేలింది. ఇవే కీలక ఆధారాలు కానున్నాయి.

'సంప్రదాయ పోలీసింగ్' బలోపేతం

డీజీపీలు/ఐజీపీల సదస్సులో మోదీ పిలుపు



న్యూఢిల్లీ: పోలీసు దళాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. కొత్త టెక్నాలజీలో సుశిక్షితులు కావాలన్నారు. అదేసమయంలో సంప్రదాయ పోలీసింగ్ విధానాలను బలోపేతం చేసుకోవాలని చెప్పారు. ఆదివారం డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్/ఇన్‌స్పెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్ 57వ అఖిల భారత సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. రాష్ట్ర పోలీసులు, కేంద్ర భద్రతా సంస్థలు పరస్పరం సహకారం పెంపొందించుకోవాలని అన్నారు. ఉత్తమమైన విధానాలను పంచుకోవాలని తెలిపారు. వాడుకలోని లేని క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని అభిప్రాయపడ్డారు. పోలీసు శాఖ ప్రమాణాలను మరింత పెంచాల్సి ఉందన్నారు. వివిధ దర్యాప్తు సంస్థల నడుమ డేటాను ఇచ్చిపుచ్చుకొనే విధానం బలపడాలని, ఇందు కోసం నేషనల్ డేటా గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఇక జైళ్ల సమర్థ నిర్వాహణకు సంస్కరణలు చేపట్టాలని తెలిపారు. నూతన సవాళ్లు, పరిష్కార మార్గాలపై చర్చించుకొనేందుకు పోలీసు ఉన్నతాధికారుల సదస్సులు రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో కూడా నిర్వహించుకోవాలని సూచించారు. డీజీపీలు/ఐజీపీల సదస్సుకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ హాజరయ్యారు. నేషనల్ సెక్యూరిటీ, కౌంటర్ టెర్రరిజం, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాలపై సదస్సులో చర్చించారు. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 600 మందికిపైగా అధికారులు పాల్గొన్నారు.

మన టీ, సమోసాకు బ్రిటన్‌లో యమా క్రేజ్..!



లండన్: సాయంత్రమయ్యేసరికి వేడి వేడి సమోసా తిని, పొగలు గక్కే టీ ఒక కప్పు లాగిస్తే ఎలాగుంటుంది. ఆ కాంబినేషన్ ఇచ్చే కిక్కు వేరుగా ఉంటుంది కదా. మన దేశానికి మాత్రమే ప్రత్యేకమైన ఈ చాయ్, సమోసా కాంబినేషన్‌కి ఇప్పుడు బ్రిటన్ యువతరంలో యమా క్రేజ్ పెరుగుతోంది. సాధారణంగా తెల్లవారు టీతో పాటు బిస్కెట్లు తింటారు. ఇప్పుడు వారి జిహ్వలు కొత్త రుచులు కోరుకుంటున్నాయని యునైటెడ్ కింగ్‌డమ్ టీ అండ్ ఇన్‌ఫ్యూజన్స్ అసోసియేషన్ నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. వెయ్యి మందితో ఈ సర్వేని నిర్వహిస్తే సాయంత్రం స్నాక్‌గా గ్రానోలా బార్స్ (ఓట్స్‌తో చేసేది) చాలా బాగుంటుందని మొదటి స్థానం ఇచ్చారు. ఇక రెండోస్థానాన్ని మన సమోసా కొట్టేసింది. సర్వేలో పాల్గొన్న యువతరంలో 8 శాతం మంది సమోసాకి మొగ్గు చూపించారు.



బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వ న్యాయ సంస్కరణల యత్నాలను నిరసిస్తూ ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌లో జరిగిన ఆందోళన. ఇందులో లక్ష మందికి పైగా పాల్గొన్నారు

భద్రత మధ్య జోడో యాత్ర

సాంబా (జమ్మూకశ్మీర్): జమ్ములో జంటపేలుళ్ల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పాదయాత్రకి అత్యంత కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. ఆదివారం ఉదయం కథువా నుంచి ప్రారంభమైన భారత్ జోడో యాత్ర మధ్యాహ్నానికి సాంబా జిల్లాలోని చక్ నానక్‌కు చేరుకుంది. షెడ్యూల్ ప్రకారమే రాహుల్ పాదయాత్ర అత్యంత ఉత్సాహభరితంగా సాగుతోంది.సోమవారం మధ్యాహ్నానికి రాహుల్ గాంధీ జమ్ము చేరుకుంటారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ చెప్పారు. రాహుల్ యాత్రకు అద్భుతమైన స్పందన వస్తోందన్న ఆయన ఈ యాత్రతో బీజేపీ వెన్నులో వణుకు పుట్టిస్తోందని వ్యాఖ్యానించారు. అందుకే రాహుల్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేయడానికి అసత్యాలు ప్రచారం చేస్తోందని ఆరోపించారు.



విద్వేషాలు సృష్టిస్తున్నారు: రాజ్‌నాథ్

రాహుల్ గాంధీ అధికారం కోసం ప్రజల్లో విద్వేషాలను సృష్టిస్తున్నారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. రాహుల్ వల్ల అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠ మసకబారుతోందని విమర్శించారు. ఆదివారం మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. ప్రజాభిమానం, నమ్మకం పొందడం ద్వారానే అధికారం లభిస్తుందని ఆయన అన్నారు.

చైనాలో వారంలోనే 13 వేల మరణాలు

బీజింగ్: చైనాలో కోవిడ్–19 మహమ్మారి వ్యాప్తి కొనసాగుతూనే ఉంది. నిత్యం వేల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. గత వారం రోజుల్లో దేశవ్యాప్తంగా వివిధ ఆసుపత్రుల్లో ఏకంగా 13 వేల మంది కరోనా కాటుకు బలయ్యారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ విషయాన్ని చైనా సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్(సీడీసీ) ప్రకటించింది. కరోనా వల్ల ఆసుపత్రుల్లో కాకుండా ఇళ్లల్లో చనిపోయినవారి సంఖ్య ఎంత అన్నది బహిర్గతం చేయలేదు. దేశంలో ఇప్పటికే కరోనా ఆంక్షలను ఎత్తివేశారు. మరోవైపు నూతన సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయి.

ఘనంగా 'పునీత్ సాగర్ అభియాన్'



కొరుక్కుపేట: నౌకాదళ సిబ్బంది రాష్ట్రంలోని నావల్ స్టేషన్‌ల దగ్గర పునీత్ సాగర్ అభియాన్ నిర్వహిస్తోంది. ఆదివారం ఐఎన్ఎస్ పరుండు - రామనాథపురం బృందం వళంగాపురి బీచ్‌లో, నేవల్ డిటాచ్‌మెంట్ ద్వారా నాగోర్ బీచ్‌లో, ఐఎన్ఎస్ పల్లవ ద్వారా కల్పక్కం బీచ్‌లో, నావల్ ట్రాన్స్‌మిటింగ్ స్టేషన్ ద్వారా ఆవడి కొల్లుమేడు సరస్సులో, ఐఎన్ఎస్ కట్టబొమ్మన్ ద్వారా తిరునెల్వేలి ఉవారి బీచ్‌లో పారిశుధ్య పనులు చేపట్టారు.

పరేడ్ నిర్వహిస్తున్న ఎయిర్ ఫోర్స్, రైల్వే పోలీసులు, సాయుధ బలగాలు









అశ్వదళం విన్యాసాలు

కవాతు.. కసరత్తు

అబ్బుర పరిచిన 'గణతంత్ర' రిహార్సల్స్

- మెరీనా తీరంలో ట్రాఫిక్ మార్పులు
- భద్రత కట్టుదిట్టానికి ఆదేశాలు

రాష్ట్రంలో గణతంత్ర వేడుకలకు కసరత్తు ప్రారంభమైంది. ఆదివారం మెరీనా తీరంలో పరేడ్ రిహార్సల్స్ చూపరులను అబ్బురపరిచాయి. వేడుకల ఏర్పాట్ల దృష్ట్యా మెరీనా తీరంలోని కామరాజర్ సాలైలో ట్రాఫిక్ మార్పులు చేశారు. వివరాలు.. రిపబ్లిక్ డేకు మూడురోజులే సమయం ఉండడంతో ఓ వైపు మెరీనాతీరంలో ఏర్పాట్లు, మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేస్తూ జిల్లా ఎస్పీలకు ఆదేశాలు జారీ అయ్యాయి. చెన్నై, మదురై, కోయంబత్తూరు నగరాల్లో వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. చెన్నై మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు, మదురై, తిరుచ్చి, కోయంబత్తూర్ ఎయిర్‌పోర్టుల్లో భద్రతను పటిష్టం చేశారు. వాహనాల రాకపోకలకు విమానాశ్రయాల్లో ఆంక్షలు మొదలయ్యాయి. రైల్వే స్టేషన్లు, బస్టాండులు, ఆలయాలు, పర్యాటక కేంద్రాల వద్ద భద్రతను పెంచారు. ఆయా నగరాల సరిహద్దుల్లో ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు.

రిహార్సల్స్.. అదుర్స్

మెరీనా తీరంలోని గాంధీ విగ్రహం వద్ద మెట్రో రైలు పనుల దృష్ట్యా, కార్మిక విగ్రహం వద్ద వేదికను ఎంపిక చేశారు. కరోనా పరిస్థితుల తర్వాత రెండేళ్లకు చెన్నైలో వేడుకలు ఈసారి భారీ ఎత్తున నిర్వహించాలని నిర్ణయించారు. ఇక్కడ ఆదివారం త్రివిధ దళాలు, ఎన్‌సీసీ కేడెట్లు, పోలీసు శాఖ, వివిధ కళాశాలల విద్యార్థులు రిహార్సల్స్‌లో పాల్గొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిని చాటే రీతిలో ఈసారి 20 శాఖల నేతృత్వంలో శకటాలు, త్రివిధ దళాల కవాతు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

అవార్డుల ప్రకటన

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవకులకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. అవార్డులకు ఎంపికైన వారి వివరాలను రాజ్ భవన్ ఆదివారం ప్రకటించింది. గవర్నర్ ఆర్ఎన్‌రవి ఆమోదంతో ఈ జాబితాను విడుదల చేశారు. ఇందులో వివేకానంద గ్రామీణాభివృద్ధి సంఘం కార్యదర్శి ఆర్‌పీ కృష్ణమాచారికి ఉత్తమ సామాజిక సేవా అవార్డును అందజేయనున్నారు. సిరుతొలి స్వచ్ఛంద సంస్థకు చెందిన వానతీ మోహన్‌కు పర్యావరణ పరిరక్షణ అవార్డును ప్రకటించారు. ఈనెల 26వ తేదీన రాజ్ భవన్‌లో జరిగే వేడుకలో ఈ అవార్డులను రూ. 10 లక్షలు నగదు ఎంపికైన వారికి అందజేయనున్నారు.

– సాక్షి, చెన్నై

న్యూస్‌రీల్

తిరుచెంగోడులో న్యాయమూర్తుల ప్రత్యక్ష విచారణ

● గోకుల్‌రాజ్ కేసులో కొనసాగుతున్న ఉత్కంఠ

సాక్షి, చెన్నై: సేలం జిల్లా ఓమలూరులో విద్యార్థి గోకుల్‌రాజ్ పరువు హత్య కేసులో ఉత్కంఠ కొనసాగుతోంది. ఆదివారం తిరుచెంగోడు అర్ధనారీశ్వర ఆలయం పరిసరాల్లో న్యాయమూర్తుల బృందం విచారణ చేపట్టింది. అక్కడి సీసీ కెమెరాలలోని దృశ్యాలను పరిశీలించింది. వివరాలు.. సేలం జిల్లా ఓమలూరు సమీపంలోని రైల్వే పట్టాలపై 2015 జూన్‌లో ఇంజినీరింగ్ విద్యార్థి గోకుల్ రాజ్ మృతదేహంగా తేలిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారిస్తున్న డీఎస్పీ విష్ణు ప్రియ బలన్మరణానికి పాల్పడటం వంటి ఘటనలో గోకుల్ రాజ్‌ది ముమ్మాటికి పరువు హత్యే అనే అనుమానాలు బలపడ్డాయి. అదే సమయంలో అగ్రవర్ణ సామాజిక వర్గానికి చెందిన ఓ యువతితో గోకుల్ రాజ్‌కు ఉన్న పరిచయం తెర మీదకు వచ్చింది. విచారణ వేగవంతం చేయగా, అనూహ్యంగా అగ్రవర్ణ సామాజిక వర్గానికి చెందిన యువజన విభాగం నేత యువరాజ్‌ప్రమేయం ఉన్నట్లు తేలింది. అతడే ఈ హత్య చేయించినట్లు కోర్టులో సీబీసీఐడీ రుజువు చేసింది. ఈ కేసు విచారణ ముగియడంతో యువరాజ్‌తో పాటు 10 మందిని దోషులుగా నిర్ధారించి మదురై ప్రత్యేక కోర్టు యావజ్జీవ శిక్షను విధించింది. దీనిని వ్యతిరేకిస్తూ, శిక్ష పడ్డ వారు మదురై ధర్మాసనాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్ విచారణ సమయంలో గోకుల్ రాజ్, స్వాతి నామక్కల్ జిల్లా తిరుచంగోడు అర్ధనారీశ్వర ఆలయంలోకి వెళ్లి వస్తున్న వీడియో వెలుగులోకి వచ్చింది. దీంతో ఈ కేసుపై న్యాయమూర్తులు ఆనంద వెంకటేష్, రమేష్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రత్యక్ష విచారణకు సిద్ధమయ్యారు. ఆదివారం తిరుచంగోడు ఆలయ పరిసరాల్లో విచారణ చేపట్టారు. అక్కడి సీసీ కెమెరాలు, ఆ ఇద్దరు నడుచుకుంటూ వచ్చిన దృశ్యాలను పరిశీలించారు. వ్యాపారులు, గతంలో పనిచేసిన ఆలయ నిర్వాహకులను ప్రశ్నించారు.

ఆస్పత్రి పనులు వేగవంతం





సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: గిండిలో రూపుదిద్దుకుంటున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను ఆదివారం సీఎం ఎంకే స్టాలిన్ పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వివరాలు.. దివంగత డీఎంకే అధినేత కరుణానిధి 97వ జయంతి సందర్భంగా గిండిలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులకు సీఎం స్టాలిన్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. రూ. 230 కోట్లతో 1000 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్న పనులను సీఎం ఆదివారం పరిశీలించారు. మరింత వేగాన్ని పెంచాలని, వీలైనంత త్వరగా నిర్ణీత గడువులోపు ముగించాలని అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఈ ఆసుపత్రి పరిసరాలను పచ్చదనంతో నింపి, గ్రీన్ బిల్డింగ్‌గా మార్చాలని సూచించారు. అనంతరం అడయార్ మండలం పరిధిలో సీఎం పర్యటించారు. రూ.16.44 కోట్లతో 3,047 మీటర్ల పొడవున ఇక్కడ జరుగుతున్న వర్షపు నీటి కాలువల పనులను పరిశీలించారు. పెండింగ్‌లో పనులను ముగించాలని అధికారులకు సూచించారు. తర్వాత ఆలందూరు మండలంలో పర్యటించారు. ఆర్కాట్ రోడ్డులో రూ.27.40 లక్షలతో 475 మీటర్ల పొడవు, 7 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేస్తున్న రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించారు. రోడ్డు పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ పర్యటనలో సీఎం వెంట మంత్రులు సుబ్రమణియన్, అన్బరసన్, కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్, కమిషనర్ గగన్ దీప్‌సింగ్ బేడీ ఉన్నారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలన..

మంత్రి ఎం.సుబ్రమణియన్ మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వివిధ పనులను ప్రత్యక్షంగా చూడటమే కాకుండా, క్షేత్రస్థాయి పరిశీలన చేశారని వివరించారు. కింగ్ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లో 4.9 ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్న ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారన్నారు. 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 18 విభాగాలతో ఈ ఆసుపత్రి రూపుదిద్దుకుంటోందన్నారు. ఈశాన్య రుతు పవనాల సీజన్‌లో చెన్నై వరద ముంపునకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్న అధికారులను అభినందించే విధంగా కార్పొరేషన్ భవనంలో సీఎం చేతుల మీదగా ఈనెల 31న ప్రశంసా పత్రాలను అందచేయనున్నామని తెలిపారు. నీట్ పరీక్షకు సంబంధించి కేంద్రం వివరణ కోరిన విషయాన్ని ప్రస్తావించగా, కేంద్రం నుంచి లేఖ తమకు అందిందని సమాధానం ఇచ్చారు. న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన తర్వాత కేంద్ర ఆరోగ్యశాఖకు సమాధానం పంపిస్తామన్నారు.

అందరూ తమిళం నేర్చుకోండి


- ఇతర రాష్ట్రాల విద్యార్థులకు కేంద్ర విద్యాశాఖ మంత్రి పిలుపు
- అళగప్ప యూనివర్సిటీలో ఘనంగా స్నాతకోత్సవం
- లక్ష మందికి డిగ్రీల ప్రదానం



తిరుచ్చిలో కొత్త భవనాలకు భూమి పూజ చేస్తున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్



అళగప్పా వర్సిటీలో డిగ్రీ పట్టా ప్రదానం చేస్తున్న గవర్నర్



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి

సాక్షి, చెన్నై: తమిళనాడులో చదువుకుంటున్న ఇతర రాష్ట్రాల విద్యార్థులందరూ తమిళ భాషను తప్పకుండా నేర్చుకోవాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ పిలుపు నిచ్చారు. ఆదివారం ఆయన తిరుచ్చి, కారైక్కుడిలో పర్యటించారు. మూడేళ్ల అనంతరం కేంద్ర మంత్రి చేతుల మీదుగా అళగప్ప వర్సిటీ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. వివరాలు.. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ శనివారం కోయంబత్తూరులో పర్యటించారు. ఆదివారం తిరుచ్చి ఎన్ఐటీలో నిర్మించిన కొత్త భవనాలను ప్రారంభించారు. అదనంగా నిర్మించనున్న మరికొన్ని భవనాల పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. షేక్ స్పియర్ పుస్తకాలలోని అంశాలు తమిళ గ్రంథం తిరుక్కురల్‌లో ఉందని వివరించారు.

మూడేళ్ల అనంతరం..

శివగంగై జిల్లా కారైక్కుడిలో అళగప్ప వర్సిటీ ఉన్న విషయం తెలిసిందే. ఇక్కడ వీసీ నియామకం వివాదంగా మారడంతో పాటు కరోనా పరిస్థితుల నేపథ్యంలో గత మూడేళ్లుగా స్నాతకోత్సవం నిర్వహించలేదు. దీంతో లక్ష మంది విద్యార్థులు పట్టాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ప్రభుత్వానికి విజ్ఞప్తులు పెరగడంతో ఎట్టకేలకు ఆదివారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ నేతృత్వంలో స్నాతకోత్సవం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, మంత్రులు పొన్ముడి, పెరియకరుప్పన్ పాల్గొన్నారు. ఈ వేడుకతో 1.9 లక్షల మందికి డిగ్రీలను ప్రదానం చేశారు. 1,025 మంది విద్యార్థులకు గవర్నర్ ఆర్ఎన్ రవి స్వయంగా పట్టాలను అందజేయడం విశేషం.

కొత్త బ్రిడ్జి.. ఉండదు రద్దీ

- తాంబరంలో భారీ వంతెన
- కార్యాచరణను ప్రారంభించిన అధికారులు



స్తంభించిన ట్రాఫిక్



రోడ్డుపైనే బస్టాండ్

సాక్షి, చెన్నై: దక్షిణదిశలో చెన్నై మహా నగరానికి ప్రవేశ మార్గంగా ఉన్న తాంబరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. ఇక్కడ వాహనాల రద్దీ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే రాజా సీఎం స్టాలిన్ దృష్టికి తీసుకెళ్లడంతో వంతెన ఏర్పాటు చేయాలని తాజాగా నిర్ణయించారు. నిజానికి తాంబరానికి కూతవేటు దూరంలోని పెరుంగళత్తూరు నుంచి మాధవరం వరకు చెన్నై సిటీలోకి వాహనాలు ప్రవేశించకుండా బయట నుంచే వెళ్లేందుకు బైపాస్ రోడ్డు ఉంది. అయినా తాంబరం మీదుగా చెన్నైకు వచ్చే వాహనాల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఇందుకు ప్రధాన కారణం తాంబరం పరిసరాలు గత కొన్నేళ్లలో అత్యంత అభివృద్ధి చెందడమే. ముఖ్యంగా తాంబరం జంక్షన్ నిత్యం పద్మావ్యూహాన్ని తలపిస్తోంది. ఇక్కడ రైల్వే స్టేషన్, బస్టాండ్, మార్కెట్, సినిమా థియేటర్లు, ఆసుపత్రులు అధికంగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనదారులు సతమతం అవుతున్నారు. తాంబరాన్ని ఇటీవల కార్పొరేషన్‌గా కూడా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఈ పరిసరాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

వంతెనతో సమస్యకు చెక్..

తాంబరం వైపుగా 30 కి.మీ దూరంలోని పరిసరాల నుంచి లక్షలాది మంది నిత్యం ప్రయాణిస్తుంటారు. వీరి వాహనాల రాకతో తాంబరం కూడలి వద్ద భారీగా ట్రాఫిక్ జాం అవుతోంది. రోజూ దీనిని పరిష్కరించడం పోలీసులు తలకుమించిన భారంగా మారుతోంది. దీనికితోడు ఇక్కడ సరైన పార్కింగ్ సౌకర్యం కూడా లేదు. ఇక రాజాజీ, గాంధీ, షణ్ముగం, అబ్దుల్ రజాక్ తదితర రోడ్డులు వాహనాలతో కిక్కిరిసి ఉంటాయి. జీఎస్టీ రోడ్డులో నెలకొంటున్న ఈ ట్రాఫిక్ కారణంగా రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే ప్రయాణికులకు గగనం అవుతోంది. పైగా రాత్రి వేళ వాహనాల రద్దీ రెట్టింపు అవుతోంది. దక్షిణ తమిళనాడు వైపుగా వెళ్లే బస్సులు, ప్రైవేటు ఆమ్నీ బస్సుల రాకపోకలతో ఆ పరిసరాల్లో నివాసం ఉన్న వారు తమ ఇళ్లకు చేరుకోవాలంటే అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ సమస్యను తాంబరం ఎమ్మెల్యే రాజా ఇటీవల సీఎం స్టాలిన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడి ప్రజల పరిస్థితిని, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సీఎంకు వివరించారు. దీంతో ఇక్కడ రద్దీని క్రమబద్ధీకరించేందుకు భారీ వంతెన ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పెరుంగళత్తూరు – ముడిచ్చూర్ – వేళచ్చేరి మార్గాలను కలిపే విధంగా బ్రిడ్జి నిర్మించనున్నారు. ఈ వంతెన పూర్తయితే జీఎస్టీ రోడ్డులో ట్రాఫిక్ సమస్య పూర్తిగా తీరనుంది. అలాగే ఇక్కడ వాహన పార్కింగ్ నిమిత్తం, రోడ్డు పక్కగా ఉన్న వందలాది దుకాణాలను ఒకే చోటకు చేర్చే విధంగా షాపింగ్ మాల్ ఏర్పాటు చేయాలని కూడా అధికారులు భావిస్తున్నారు.

బయోమైనింగ్‌తో.. చెత్తకు స్వస్తి

- కొడుంగయూరు డంపింగ్ యార్డుకు రూ. 641 కోట్ల కేటాయింపు
- తీరనున్న స్థానికుల ఇక్కట్లు

సాక్షి, చెన్నై: కొడుంగయూరు డంపింగ్ యార్డ్‌లో బయో మైనింగ్ ద్వారా చెత్తను పూర్తిగా తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ. 641 కోట్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చెన్నై నగర పరిధిలో రోజుకు 5,100 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. వీటిలో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్లకు రీసైక్లింగ్ నిమిత్తం తరలిస్తున్నారు. మిగిలిన చెత్తను చెన్నైకు దక్షిణం వైపుగా ఉన్న పెరుంగుడి, ఉత్తరం వైపుగా ఉన్న కొడుంగయూరు డంపింగ్ యార్డ్‌లకు తరలిస్తున్నారు. ఇక్కడ కొండల్ని తలపించే విధంగా చెత్తల డంప్ కనిపిస్తుంటుంది. ఈ డంపింగ్ యార్డ్ కారణంగా ఆ పరిసరాలలో గాలి, నీళ్ల కాలుష్యం అధికంగా ఉంటోంది. తరచూ చెత్త తగలపెట్టిన సందర్భాల్లో స్థానికులు శ్వాస సమస్యను ఎదుర్కోవాల్సి వస్తోంది. అంటూ వ్యాధుల సమస్య కూడా ఎక్కువే. దీంతో కొడుంగయూర్ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా గత నాలుగు దశాబ్దాలుగా పెద్దఎత్తున పోరాటాలు సాగుతున్నాయి.

కొత్త పద్ధతితో సమస్యకు చెక్..

కొడుంగయూరులో 343 ఎకరాల్లో చెత్త డంపింగ్ చేస్తున్నారు. దీంతో ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రజా ప్రతినిధులు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రూ. 641 కోట్లను కేటాయిస్తూ, బయో మైనింగ్ విధానంతో చెత్తను తొలగించేందుకు ప్రత్యేక పథకం రూపొందించారు. స్వచ్ఛ భారత్, చెన్నై కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు. ఆరు కేటగిరీలుగా ఇక్కడున్న చెత్తను తొలగించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇక్కడ సమస్య పరిష్కారానికి సీఎం స్టాలిన్ ప్రత్యేక చొరవ చూపించడంపై కార్పొరేటర్ ఢిల్లీబాబు హర్షం వ్యక్తం చేశారు.

ఇక్కడైనా విజయవంతం అయ్యేనా..?

బయో మైనింగ్ విధానంలో చెత్త తొలగింపు ప్రక్రియ కొడుంగయూరులో సాధ్యమయ్యేనా అనే చర్చ ప్రారంభమైంది. ఇందుకు కారణం పెరుంగుడిలో గతంలో ఇదే విధానాన్ని అనుసరించేందుకు నిధులు కేటాయించినా, ఆచరణలో మాత్రం అధికారులు విఫలమయ్యారు. దీంతో పెరుంగుడి పరిసరాలు జన జీవనానికి ఉపయోగం లేని ప్రాంతాలుగా మారే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పెరుంగుడిలో 250 ఎకరాల్లో డంపింగ్ యార్డ్ విస్తరించి ఉంది. చెత్త నుంచి వచ్చే ద్రావకం, వ్యర్థాల కారణంగా ఆ పరిసరాల్లోని ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. ఇక్కడ కూడా గతంలో రూ.354 కోట్లతో బయోమైనింగ్ విధానం అమలు చేసినా ప్రయోజనం శూన్యం. ఇలాంటి పరిస్థితే కొడుంగయూరులో ఎదురు కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కొడుంగయూరు డంపింగ్ యార్డ్



చెన్నై సోమవారం । 23 । జనవరి । 2023 సాక్షి

క్లుప్తంగా

దేశభక్తిని చాటుకుందాం



బహుమతులు అందుకున్న విజేతలతో సునీల్ కుమార్ యాదవ్

కొరుక్కుపేట: యువత దేశభక్తిని చాటుకోవాలని వెల్లింగ్టన్‌లోని మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ కమాండెంట్ బ్రిగేడియర్ సునీల్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రెజిమెంటల్ (ఎంఆర్‌సీ) హెడ్‌క్వార్టర్ దక్షిణ్ భారత్ ఏరియా ఆధ్వర్యంలో డుయాథ్లాన్ ఎండ్యూరో–2023ని నిర్వహించారు. ఇందులో భాగంగా 20 కిలోమీటర్ల సైక్లింగ్, 10కె రన్ నిర్వహించారు. కమాండెంట్ బ్రిగేడియర్ సునీల్ కుమార్ యాదవ్ సైకిలింగ్ జెండా ఊపి ప్రారంభించారు. నీలగిరి జిల్లా మీదుగా వెల్లింగ్టన్, కూనూర్ వరకు సాగింది. ఈ ఈవెంట్‌లో పురుషులు, మహిళలు సుమారు 75 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

సీఎం బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



భద్రతా ఏర్పాట్లపై చర్చిస్తున్న డీఐజీ పగళవన్, ఎస్పీ కల్యాణ్



సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నాజర్, ఎమ్మెల్యేలు

- సభా ప్రాంగణాన్ని పరిశీలించిన మంత్రి నాజర్, ఎమ్మెల్యేలు
- ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు: డీఐజీ పగళవన్

తిరువళ్లూరు: పట్టణంలో ముఖ్యమంత్రి భారీ బహిరంగ సభ సందర్భంగా ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కాంచీపురం మండల డీఐజీ పగళవన్ సిబ్బందిని ఆదేశించారు. తమిళభాష పరిరక్షణ కోసం పోరాటం చేసి ప్రాణత్యాగం చేసిన వారికి నివాళి అర్పించేందుకు జనవరి 25న రాష్ట్ర వ్యాప్తంగా డీఎంకే ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తిరువళ్లూరులో జరిగే సభలో ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు, పలువురు సీనియర్ నేతలు పాల్గొననున్నారు. ఇందు కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సభకు సుమారు 5 లక్షల మందిని తరలించాలని డీఎంకే నేతలు లక్ష్యంగా నిర్ణయించుకుని పని చేస్తున్నారు. ముఖ్యమంత్రి సభ వేదికను కాంచీపురం మండల డీఐజీ పగళవన్, ఎస్పీ ఫకెర్లా సెఫాస్ కల్యాణ్, అసిస్టెంట్ ఎస్పీ వివేకానంద శుక్లా తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ.. సీఎం సభకు భారీగా జనం హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, సభా ప్రాంగణం వద్ద తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయంతో పాటు ఇతర వాటిని పరిశీలించారు. ఏర్పాట్లలో కొన్ని మార్పులు చేర్పుల కోసం పోలీసులకు సూచనలు ఇచ్చారు.

మంత్రి, ఎమ్మెల్యేల పరిశీలన

ముఖ్యమంత్రి సభ కోసం నిర్మిస్తున్న వేదిక పనులను మంత్రి నాజర్, డీఎంకే జిల్లా కన్వీనర్, తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్, గుమ్మిడిపూండి ఎమ్మెల్యే టీజే గోవిందరాజన్, తిరువళ్లూరు ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్, పలువురు సీనియర్ నేతలు పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి నాజర్ మాట్లాడుతూ.. సభను విజయవంతం చేయడానికి పార్టీ నేతలు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందు కోసం వెయ్యి మంది వలంటర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు.

డీజీపీ కార్యాలయ ముట్టడికి యత్నం


–35 మంది అరెస్టు

తిరువొత్తియూరు: డీజీపీ కార్యాలయం ముట్టడికి యత్నించిన భారత ప్రజాస్వామిక యువజన సంఘానికి చెందిన 35 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పుదుకోట్టై జిల్లా వేంగవయల్‌లో తాగునీటి తొట్టిలో మానవ వ్యర్థాలను కలిపిన వ్యవహారాన్ని ఖండిస్తూ భారత ప్రజాస్వామిక యువజన సంఘం నాయకులు శనివారం మైలాపూర్‌లో ఆందోళన చేశారు. దీనికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో సంఘానికి చెందిన 35 మంది డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించడానికి ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఆందోళనకారులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో 35 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

ముగిసిన ఐటీ దాడులు

తిరువొత్తియూరు: ఆంబూర్‌లో ఉన్న షూ, తోలు పరిశ్రమల్లో మూడు రోజులుగా సాగుతున్న ఐటీ దాడులు శనివారం సాయంత్రంతో ముగిశాయి. తిరుపత్తూరు జిల్లా, ఆంబూర్, కోమేశ్వరంలో ఉన్న ప్రైవేటు షూ, తోలు పరిశ్రమల్లో 14 మందితో కూడిన ఐటీ అధికారులు 3 రోజుల పాటు తనిఖీలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున ఆంబూర్ ఏకాస్బలో ఉన్న తోలు పరిశ్రమలో తనిఖీలు చేశారు. ముఖ్యమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలు శనివారం సాయంత్రంతో ముగిసాయి.

ఇంటర్వ్యూలూ సాహిత్యంలో భాగమే



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తమిళచ్చి తంగపాండియన్

- ఎంపీ, రచయిత్రి తమిళచ్చి తంగపాండియన్

కొరుక్కుపేట: ఇంటర్వ్యూలు, ప్రెస్ మీట్‌లు సాహిత్యంలో ముఖ్యమైన భాగమని, రచయితకు అవి అవసరమని చెన్నై సౌత్ ఎంపీ తమిళచ్చి తంగపాండియన్ అభిప్రాయపడ్డారు. శనివారం రాత్రి ఎంపీ తమిళచ్చి తంగపాండియన్ ఇంటర్వ్యూల సమాహారంతో అన్బిన్ ఉలగు ఎలియదు పేరిట పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఒక నాయకుడికి, రచయితకు ప్రజలను కలవడం, చేసిన పని గురించి చెప్పడం ముఖ్యం అన్నారు. ఇంటర్వ్యూ సమయంలో వారు అడిగిన ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలు ఏమిటో తెలిపుతామని వివరించారు. ఇంటర్వ్యూ పుస్తకాన్ని తీసుకురావాల్సిన అవసరం గురించి తనను అడిగితే... కవిత్వం, వ్యాసాలు, నాటకం, ఇతర కళారూపాలు మనల్ని పాఠకులకు మరింత దగ్గర చేస్తాయని పేర్కొన్నారు. తన హృదయానికి దగ్గరగా ఉన్నది ఇంటర్వ్యూలు మాత్రమే అని చెప్పారు. ఉయిర్మ్మాయి పబ్లికేషన్స్‌ను నడుపుతున్న కవి, రచయిత మనుష్య పుత్తిరన్ ఈ పుస్తకం 2008 నుంచి 2020 వరకు జరిగిన ఇంటర్వ్యూల సమాహారమని అన్నారు. కార్యక్రమంలో పాత్రికేయురాలు కవితా మురళీధరన్, నవలా రచయిత్రి ఇమయం, కవి ఎ.వెన్నిల, రచయిత, అనువాదకుడు సి.మోహన్, జర్నలిస్టు సెంథిల్ వేల్, సినీ దర్శకుడు శీను రామసామి, ప్రొఫెసర్ భారతీ పుత్తిరన్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

కొరుక్కుపేట: మొక్కలు నాటడం అందరి బాధ్యత అని, హరిత తమిళనాడు మిషన్‌ను ప్రోత్సహించే విధంగా జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కనీసం 10 మొక్కలు పెంచాలని తిరుచ్చి కలెక్టర్ ఎం.ప్రదీప్ కుమార్ అన్నారు. జిల్లా గ్రీన్ కమిటీ ఛైర్మన్, గ్రీన్ తమిళనాడు మిషన్ (జీటీఎం) నోడల్ అధికారి కుమార్ మాట్లాడుతూ.. 2030–31 లోపు గ్రీన్ కవర్‌ను 23.69 శాతం నుంచి 33 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావడం ముఖ్యం అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ డ్రైవ్‌లో ముందుండాలని పేర్కొన్నారు. ఇది వారి కుటుంబ సభ్యులు, బంధువులు, తిరుచ్చి నివాసితులను ప్రేరేపిస్తుందన్నారు. ఉద్యోగులు, అధికారులు కనీసం 10 మొక్కలు పెంచేలా చూడాలని ఆదేశించారు. ఆయా కార్యాలయాల ఆవరణలు, ఇంటి పెరట్లో మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటిన తర్వాత వాటి చిత్రాలను తీసి జీటీఎం అధికారిక పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు.



మొక్క నాటుతున్న తిరుచ్చి కలెక్టర్ ప్రదీప్ కుమార్



తిరుత్తణి ఆలయంలో భక్తుల రద్దీ

ప్రత్యేక అలంకరణలో ఉత్సవర్లు

తిరుత్తణి ఆలయంలో భక్తుల రద్దీ

తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారి దర్శనానికి సుమారు 3 గంటల సమయం పట్టింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. సర్వదర్శన మార్గంతో పాటు రూ. 100 ప్రత్యేక దర్శన క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. సర్వదర్శనానికి మూడు గంటల సమయం, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మెట్ల మార్గంలో భక్తుల సందడి కనిపించింది.

హిట్ కాంబో రిపీట్



నటుడు విష్ణు విశాల్‌తో దర్శక నిర్మాతలు

తమిళ సినిమా: సూపర్ హిట్ కాంబినేషన్ రిపీట్ కానుంది. అదోంటే ఓ లుక్కేద్దాం. సత్య జ్యోతి ఫిలిమ్స్ సంస్థ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో కమలహాసన్ వంటి ప్రముఖ కథానాయకులతో సక్సెస్‌ఫుల్ చిత్రాలు నిర్మించిన సంస్థ ఇది. కథలను నమ్మి చిత్రాలను చేసే ఈ సంస్థ అధినేత టీజీ త్యాగరాజన్ వరుసగా చిత్రాలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ధనుష్ కథానాయకుడిగా కెప్టెన్ మిల్లర్ చిత్రాన్ని పూర్తి చేశారు. అదే విధంగా హిప్ హాప్ తమిళా హీరోగా రూపొందిస్తున్న వీరన్ చిత్రం నిర్మాణంలో ఉంది. దీనికి మరకత నాణయం చిత్రం ఫేమ్ ఏఆర్ కే.శరవణన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా మరో చిత్రం నిర్మిస్తున్నట్లు నిర్మాత టీజీ త్యాగరాజన్ ప్రకటించారు. నూతన చిత్రంలో నటుడు విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించనున్నారు. ఈయన ఇంతకుముందు ఎఫ్ఐఆర్, కట్టా కుస్తీ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాల్లో నటించారు. కాగా ఈయన నటించిన తాజా చిత్రం రామ్ కుమార్, ఇంతకుముందు ముదిరాసుపట్టి, రాక్షసన్ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలు వచ్చాయి అన్నది గమనార్హం. దీంతో ఈ కాంబో హ్యాట్రిక్ చిత్రం రూపొందపోతుందన్న మాట. ఇది ఫాంటసీ నేపథ్యంలో వినోదంతో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు నిర్మాత టీజీ.త్యాగరాజన్ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

కోలీవుడ్ టాక్స్

శివ కార్తికేయన్‌తో సెట్ అయినట్టేనా?

దర్శకుడు ఏఆర్ మురుగదాస్

శివ కార్తికేయన్



తమిళ సినిమా: ఏ రంగంలోనైనా, ఎవరికైనా గ్యాప్ రావడం అనేది సహజం. అలాంటి వారు మళ్లీ టైం వచ్చే వరకు వేచి చూడాల్సిందే. దర్శకుడు ఏఆర్ మురుగదాస్ విషయంలోనూ ఇదే జరుగుతోంది. తొలి చిత్రం సాధించిన ఈ దర్శకుడు ఆ తర్వాత విజయకాంత్‌తో రమణ, సూర్య కథానాయకుడిగా గజిని వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలను తెరకెక్కించి స్టార్ డైరెక్టర్‌గా వెలుగొందారు. విజయ్ హీరోగా కత్తి, తుపాకీ, సర్కార్ వంటి విజయవంతమైన చిత్రాలకీ దర్శకత్వం వహించిన మురుగదాస్ చివరిగా రజనీకాంత్ కథానాయకుడిగా దర్బార్ చిత్రం చేశారు. అది ఆశించిన విజయాన్ని సాధించలేదు. అంతే మురుగదాస్ ఫేట్ ఒక్కసారిగా మారిపోయింది. విజయ్ 65వ చిత్రానికి ఈయన దర్శకత్వం వహించాల్సి ఉంది. అయితే ఏమైనా అది జరగలేదు దర్బార్ తర్వాత మురుగదాస్ ఇప్పటి వరకు ఏ చిత్రం చేయలేదు. ఇటీవల త్రిష కథానాయక నటించిన రాంకీ చిత్రానికి కథను అందించారు. ఈయన మళ్లీ ఎప్పుడు దర్శకత్వం వహిస్తారా..? అన్న ప్రశ్నకు తాజాగా సమాధానం వచ్చినట్లు కోలీవుడ్ వర్గాల తాజా సమాచారం. ఏఆర్ మురుగదాస్ నటుడు శివ కార్తికేయన్ కాంబోలో ఒక చిత్రం తెరకెక్కనుందనే ప్రచారం సాగుతోంది. దీన్ని లైట్ హౌస్ మూవీస్ సంస్థ నిర్మించనట్లు టాక్. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కాగా ప్రస్తుతం అయిలాన్ చిత్రాన్ని పూర్తి చేసి మావీరన్ చిత్రంలో నటిస్తున్నారు.

27న మెయ్‌ప్పడ సెయ్ విడుదల



మెయ్‌ప్పడ సెయ్ చిత్రంలో ఓ సన్నివేశం

తమిళ సినిమా: లైంగిక దాడులకు వ్యతిరేకంగా పోరాడే కథా చిత్రంగా మెయ్‌ప్పడ సెయ్ చిత్రం ఉంటుందని నిర్మాత పీఆర్ తమిళ్ సెల్వం తెలిపారు. తన ఎస్.ఆర్ హర్షిత్ పిక్చర్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రానికి వేలన్ దర్శకత్వం వహించారు. నవ నటుడు యాదవ్ బాలాజీ కథానాయకుడిగా.. మధునిక నాయకిగా చేశారు. నిర్మాత తమిళ్ సెల్వం, ఆడుగలం జయబాలన్, సుందర్, దర్శకుడు రాజ్ కపూర్, రాహుల్ దాద, సూపర్ గుడ్ సుబ్రమణి, విజయ గణేష్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ నెల 27వ తేదీ విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా చిత్ర వివరాలను నిర్మాత తమిళ్ సెల్వం తెలుపుతూ.. ఇది కుటుంబ నేపథ్యంలో సాగే జనరంజకమైన కథా చిత్రంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న లైంగికదాడులపై చర్చించే కథాచిత్రంగా ఉంటుందని తెలిపారు. ఇలాంటి ఇతివృత్తంతో పలు చిత్రాలు వచ్చినా వాటికి పూర్తి భిన్నంగా ఉంటుందని చెప్పారు. లైంగిక దాడులు ఎందుకు జరుగుతున్నాయి? వాటికి పరిష్కారం ఏమిటి? వంటి అంశాలను ఆవిష్కరించే చిత్రంగా దీన్ని రూపొందించినట్లు తెలిపారు. బాధితులకు సమాజంలో న్యాయం జరుగుతోందా, లేక వారే నేరస్తులుగా మారుతున్నారా, పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాలు అందుకు కారణం అవుతున్నాయా? వంటి పలు సామాజికపరమైన అంశాలతో ఆసక్తికరమైన చిత్రంగా మెయ్‌ప్పడ సెయ్ రూపొందిందన్నారు. నలుగురు యువకులు పరిస్థితుల కారణంగా తమ భార్యలతో కలిసి చెన్నైకి వస్తారన్నారు. అక్కడ జీవనాధారం కోసం ప్రయత్నిస్తున్న సమయంలో వారి కళ్ల ముందే లైంగికదాడులకు పాల్పడిన అరాచక శక్తులు చట్టంలోని లొసుగుల కారణంగా ప్రజలను, పోలీసులను భయపెడుతూ బహిరంగా తిరుగుతుండడం చూసి చేసే పోరాటమే ఈ చిత్రం అన్నారు. దీనికి భరణి సంగీతాన్ని, ఆర్.వేల్ ఛాయాగ్రహణను అందించారు.

కమల్‌తో నటించడం అదృష్టం



తమిళ సినిమా: నటి రకుల్ ప్రీత్ సింగ్‌కు అర్జెంటుగా ఒక హిట్ అవసరం. ఎందుకంటే ఈమె మంచి విజయాన్ని అందుకుని చాలా కాలమే అయ్యింది. ఇంతకుముందు తెలుగులో వరుస విజయాలతో దూసుకుపోయిన ఈ ఉత్తరాది బ్యూటీ ఇటీవల చాలా వెనుకబడిందని చెప్పాలి. ఇక తమిళంలో ధీరన్ అధికారం, ఒంద్రు వంటి ఒకటి రెండు మినహా ఈమెకు సరైన సక్సెస్ లేదు. ప్రస్తుతం కమల్‌హాసన్‌తో కలిసి శంకర్ దర్శకత్వంలో ఇండియన్ 2, శివకార్తికేయన్ సరసన అయలాన్ చిత్రాల్లో నటిస్తోంది. ఈ రెండు చిత్రాలపై రకుల్ ప్రీత్ సింగ్ చాలా ఆశలు పెట్టుకుందనే చెప్పాలి. ఇటీవల ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ఇండియన్ 2 చిత్రంలో నటించడం ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. నటుడు కమల్ హాసన్ ఒక విశ్వవిద్యాలయం అని పేర్కొంది. ఆయనతో నటించే అవకాశం రావడం తన అదృష్టం అని తెలిపింది. వందేళ్ల సినిమాలో 60 ఏళ్లుగా ఈయన ఉన్నారని, ఇది పెద్ద రికార్డు అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అడ్డదారిలో విజయాలు రావని మనకు తెలియజేసిన నటులు వారని, మనం చేసే పనిలో శ్రద్ధ పెట్టాలని, అప్పుడే వాళ్ల మాదిరి మనమూ సాధించగలమని తెలియజేశారన్నారు. ఇకపోతే ఇండియన్ 2, అయలాన్ చిత్రాల్లో తనకు సంబంధించిన టాకీ పార్ట్ పూర్తయిందని, పాటల చిత్రీకరణే మిగిలిందని చెప్పింది.

మంచి అవకాశాలు వస్తే నటిస్తా



వైశాలి

తమిళ సినిమా: మిసెస్ సౌత్ ఇండియా అందాల పోటీల్లో తమిళనాడుకు చెందిన వైశాలి.ఎస్ సెకండ్ రన్నర్‌గా కిరీటాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆమె శనివారం సాయంత్రం మీడియాతో ముచ్చటిస్తూ గతవారం కేరళలో పెగాసెస్ గ్లోబల్ లిమిటెడ్ సంస్థ మిసెస్ సౌత్ ఇండియా అందాల పోటీలను నిర్వహించిందన్నారు. ఇందులో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 14 మంది మగువలు పాల్గొన్నారన్నారు. వారిలో తానొకరినని చెప్పారు. మూడు రౌండ్లలో జరిగిన ఈ పోటీల్లో తాను సెకండ్ రన్నర్‌గా నిలిచానని పేర్కొన్నారు. అదేవిధంగా మిసెస్ ఇన్‌స్పైరింగ్‌గా ఎన్నికయ్యానని తెలిపారు. ఇది తన కెరీర్లో ఆరంభమేనని ముందు ముందు మరిన్ని అందాల పోటీల్లో పాల్గొని మిసెస్ ఇండియా కిరీటాన్ని దక్కించుకుంటాననే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అందుకు తన కుటుంబ సపోర్టు ఎంతగానో ఉందని పేర్కొన్నారు. వివాహమైన ప్రతి స్త్రీ తనకంటూ ఒక గుర్తింపును పొందాలన్నారు. అందుకు తగిన ప్రయత్నాలు చేయాలని నచ్చిన రంగంలో ఇష్టమైన వృత్తిని చేపట్టాలని అన్నారు. తాను తనకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని ఏదైనా సమస్యలను అధిగమిస్తూ ఈ విజయాన్ని సాధించానన్నారు. తనకు దివంగత ముఖ్యమంత్రి జయలలిత రాజకీయ జీవితం స్ఫూర్తి అని చెప్పారు. సామాజిక స్పృహ అధికమన్నారు. అలా క్యాన్సర్ బాధితులకు కోసం తన జుట్టును దానం చేశానని, తనను స్ఫూర్తిగా తీసుకొని పలువురు తన బాటలో పయనించడం సంతోషంగా ఉందన్నారు. సినిమాల్లో నటిస్తారా అని అడుగుతున్నారని ఇటీవలే నటుడు ఉదయనిధి స్టాలిన్ కథానాయకుడిగా నటించిన కలగ తలైవన్ చిత్రంలో చిన్న పాత్ర పోషించానని, అదేవిధంగా నిమిర్దు సెల్లడా అనే షార్ట్ ఫిల్మ్‌లో నటించానని చెప్పారు. ఇకపై కూడా మంచి అవకాశాలు వస్తే నటిస్తానన్నారు. తన అభిమాన నటుడు రజనీకాంత్ అని వైశాలి పేర్కొన్నారు.

క్లుప్తంగా

జల్లికట్టులో మరణించిన బాలుడి నేత్రదానం

తిరువొత్తియూరు: ధర్మపురి జిల్లా అదియమాన్ నాయకత్వంలో జల్లికట్టు పోటీలు తడంగం ప్రైవేటు కళాశాల మైదానంలో శనివారం నిర్వహించారు. ఆ సమయంలో జల్లికట్టు వేడుకలను చూడడానికి పాలక్కోడు ద్రౌపది అమ్మన్ ఆలయ వీధికి చెందిన పూల దుకాణం వ్యాపారి కుమారుడు గోకుల్ (14) వచ్చాడు. ఆ సమయంలో ఒక ఎద్దు హఠాత్తుగా బెదిరి అక్కడ నిలబడి ఉన్న గోకుల్‌పై దాడి చేసింది. తీవ్ర గాయాలయిన గోకుల్ అదే చోట మృతి చెందాడు. దీంతో మృతుడి తల్లిదండ్రులు గౌరమ్మాల్, శ్రీనివాసన్ బాలుడి నేత్రాలను దానం ఇవ్వడానికి అంగీకరించారు. కాగా బాలుడి మృతిపై పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ సంతాపం తెలియజేశారు.

సీఎం సంతాపం

శనివారం పుదుకోట్టై జిల్లా రాయపురంలో జరిగిన జల్లికట్టులో గణేశన్ (52) అనే ప్రేక్షకుడు, శివగంగైలో జరిగిన జల్లికట్టులో భూమినాథన్ (50) క్రీడాకారుడు ఎద్దుల దాడిలో మరణించారు. ఈ ఘటనలపై సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జల్లికట్టులో మరణించిన వారి కుటుంబాలకు తలా రూ. 3 లక్షలు పరిహారం ప్రకటించారు.

వెంబకోట్టై ప్రమాదంలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

తిరువొత్తియూరు: వెంబకోట్టై బాణసంచా తయారీ పరిశ్రమలో ఏర్పడిన పేలుడు ఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు శనివారం మృతి చెందారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. వివరాలు.. విరుదునగర్ జిల్లా వెంబకోట్టై సమీపంలోని కనంజందాడి గ్రామంలో శివకాశికి చెందిన మాయకన్నన్ బాణసంచా తయారీ పరిశ్రమ నడుపుతున్నారు. ఈ కర్మాగారంలో 100 మందికి పైగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 19వ తేదీన టపాకాయలు తయారు చేస్తున్న సమయంలో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో మునీశ్వరి (32), శంకర్ (60) అనే ఇద్దరు అదే చోట మృతి చెందారు. మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని శివకాశి, మదురై ఆసుపత్రుల్లో చేర్చారు. ఈనేపథ్యంలో మదురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మారిముత్తు (55), సాత్తూర్ అమర్ పాలయానికి చెందిన కరుప్పుసామి (26) శనివారం మృతి చెందారు.

ఇంటి తాళాలు పగులగొట్టి..

– 20 సవర్ల నగలు, నగదు చోరీ



చోరీ జరిగిన ఇల్లు

తిరువళ్లూరు: రైతు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉంచిన 20 సవర్ల బంగారు నగలు, రూ. 50 వేల నగదును ఎత్తుకెళ్లిన సంఘటన తిరువళ్లూరు జిల్లా వెళ్లియూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన దశరథనాయుడు(72) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు, కుమార్తె విదేశాల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం దశరథనాయుడు భార్యతో కలిసి గ్రామంలో ఉంటున్నారు. శనివారం రాత్రి భోజనం చేసి మొదటి అంతస్తులోకి వెళ్లి నిద్రపోయారు. ఉదయం కిందకు వచ్చి చూడగా బెడ్‌రూమ్, పూజ గదిలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. 20 సవర్ల బంగారు నగలు, కిలో వెండి, రూ. 51 వేల నగదు చోరీకి గురైనట్లు నిర్ధారించాడు. వెంగల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



తపసుల్ ఇస్లాం, నిజాంఖాన్, సుందరేషన్

తిరువొత్తియూరు: చెన్నై సైదాపేటలో హెరాయిన్, గంజా విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 3 గ్రాముల హెరాయిన్, 1.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చెన్నైలో మత్తుపదార్థాలను విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ శంకర్ జివాల్ పోలీసులకు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు పోలీసులు చెన్నైలో నిఘా పెంచారు. ఆదివారం ఉదయం సైదాపేట కలైంజర్ మలుపు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా బైకుపై వచ్చిన ఇద్దరిని అనుమానంతో విచారించారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో తమదైన శైలిలో విచారించారు. అస్సాం రాష్ట్రానికి చెందిన తపసుల్ ఇస్లామ్ (25) వద్ద 3 గ్రాముల హెరాయిన్, థౌజండ్ లైట్‌కు చెందిన నిజాంఖాన్ (31), సుందరేషన్ (24)ల నుంచి 1.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బైకును సీజ్ చేశారు. ముగ్గురిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

50 సవర్ల నగలు చోరీ

అన్నానగర్: కడలూరులోని ఏనిక్కారన్ ఎస్టేట్ సునామీ నగర్‌కు చెందిన సెల్వకుమార్ (50) మత్స్యకారుడు. శనివారం చేపలు పట్టేందుకు సముద్రంలోకి వెళ్లాడు. ఇతని భార్య సోనంకుప్పం, ముత్తునగర్‌లోని తల్లి ఇంటికి వెళ్లింది. శనివారం సాయంత్రం సెల్వకుమార్ ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన 50 సవర్ల నగలు, రూ.20 వేల నగదు అదృశ్యమైంది. ఫిర్యాదు మేరకు కడలూరు ముత్తునగర్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు.

మంతనాల్లో నేతల బిజీ..!

- సీటు కోసం సంజయ్ దరఖాస్తు
- కాంగ్రెస్ అభ్యర్థిగా ఈవీకేఎస్ ఇళంగోవన్
- కాంగ్రెస్‌కు కమల్ మద్దతు
- గుజరాత్‌కు పన్నీరు పయనం
- కమలంకు జై కొట్టిన ఏసీ షణ్ముగం
- మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో పళణి శిబిరం



దినేష్ గుండూరావుతో సంజయ్ తదితరులు



దేవనాథన్‌తో పళణిస్వామి మద్దతు నేతల చర్చలు



ఈవీకేఎస్ ఇళంగోవన్

సాక్షి, చెన్నై: ఈరోడ్ తూర్పు నియోజకవర్గ ఉప ఎన్నికల కసరత్తుల్లో రాజకీయ పార్టీలు నిమగ్నమయ్యాయి. బీజేపీ ఈ ఎన్నికల రేసులో నిలబడేనా..? అన్న చర్చ జోరందుకుంది. ఇందుకు అద్దం పట్టే విధంగా గుజరాత్‌కు పన్నీరు సెల్వం పయనం కావడం గమనార్హం. తనకు సీటు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ అధిష్టానానికి ఆ పార్టీ సీనియర్ నేత ఈవీకేఎస్ ఇళంగోవన్ తనయుడు సంజయ్ సంపత్ దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఎవరూ ఊహించని విధంగా ఆ పార్టీ అభ్యర్థిగా ఈవీకేఎస్ ఇళంగోవన్‌ను కాంగ్రెస్ అధిష్టానం ఆదివారం రాత్రి ప్రకటించింది.

పోటీకి కసరత్తు

ఎన్నికల్లో బీజేపీ తమ అభ్యర్థిని నిలబెట్టే విధంగా అన్నాడీఎంకే సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం శిబిరం తీవ్రంగానే ప్రయత్నిస్తోంది. గుజరాత్‌లో తనకు సన్నిహితంగా ఉన్న బీజేపీ నేతల ద్వారా ఢిల్లీ అధిష్టానానికి సమాచారం పంపించేందుకు పన్నీరు నిర్ణయించినట్టున్నారు. దీంతో హుటాహుటిన ఆదివారం ఆయన గుజరాత్‌కు వెళ్లడం గమనార్హం. సోమవారం ఉదయం చెన్నైకు వచ్చిన తర్వాత తన మద్దుతు నేతలతో సమావేశానంతరం తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. పన్నీరు ఇస్తున్న ఆఫర్‌ను స్వీకరించే కసరత్తులపై బీజేపీ దృష్టి పెట్టడం గమనార్హం. ఆదివారం పార్టీ ముఖ్య నేతలతో సమావేశమైన అన్నామలై ఢిల్లీ అధిష్టానానికి ఓ నివేదికను పంపించినట్టు సమాచారం. సోమ, లేదా మంగళవారం బీజేపీ తన నిర్ణయాన్ని స్పష్టం చేసే అవకాశాలు ఉన్నాయి. అదే సమయంలో ఆ పార్టీ మిత్రపక్షం పుదియ నిధి కట్చి నేత ఏసీ షణ్ముగం మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఉప ఎన్నికలో బీజేపీ పోటీ చేయాలని కోరారు. ఆ పార్టీకి తమ సంపూర్ణ మద్దతును ఇస్తున్నామని ప్రకటించారు.

మద్దతు కోసం ప్రయత్నాలు

అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళణిస్వామి శిబిరం అభ్యర్థి ఈ ఎన్నికలో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. తమతో సన్నిహితంగా ఉన్న పార్టీలు, సంఘాల మద్దతును కూడగట్టే ప్రయత్నాల్లో బిజీగా ఉన్నారు. ఆదివారం ఇండియా కల్వి మక్కల్ మున్నేట్ర కళగం నేత దేవనాథన్‌తో పళణిస్వామి మద్దతు నేతలు జయకుమార్, గోకుల ఇందిర, బెంజిమిన్, వలర్మతి తదితర నేతలు భేటీ అయ్యారు.

సీటు కోసం దరఖాస్తు

కాంగ్రెస్ దివంగత ఎమ్మెల్యే తిరుమగన్ ఈవేరా సోదరుడు, కాంగ్రెస్ సీనియర్ నేత ఈవీకేఎస్ ఇళంగోవన్ రెండో కుమారుడు సీటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. చెన్నై సత్యమూర్తి భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దినేష్ గుండురావును కలిసి దరఖాస్తును అందజేశారు. తనకు కూడా సీటు ఇవ్వాలని ఈరోడ్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మక్కల్ రాజన్ కూడా దరఖాస్తు చేసుకోవడంతో కాంగ్రెస్ రాజకీయం ఆసక్తికరంగా మారింది. ఏళ్ల తరబడి పార్టీ కోసం శ్రమిస్తున్న తనకు సీటు ఇవ్వాలని రాజన్ విజ్ఞప్తి చేసుకోవడం గమనార్హం. అయితే, కేవలం ఈవీకేఎస్ కుమారుడు, దివంగత ఎమ్మెల్యే తిరుమగన్ సోదరుడిగానే సంజయ్ ఆ నియోజకవర్గానికి సుపరిచితుడు అన్న విషయాన్ని అధిష్టానం వద్ద రాజన్ ప్రస్తావించడంతో సీటు ఎవరికో అన్న చర్చ జోరందుకుంది.

అనూహ్యంగా తెరపైకి ఈవీకేఎస్ ఇళంగోవన్

ఈ ఎన్నికల్లో తనకు బదులుగా కుమారుడు సంజయ్‌కు సీటు ఇవ్వాలని అధిష్టానానికి ఈవీకేఎస్ విజ్ఞప్తి పెట్టుకున్న విషయం తెలిసిందే. అయితే తాను పోటీ చేయడం లేదని ఈవీకేఎస్ స్పష్టంచేశారు. అయితే, కాంగ్రెస్‌లో సంజయ్‌కు వ్యతిరేకంగా రాజన్ రంగంలోకి దిగడాన్ని డీఎంకే తీవ్రంగా పరిగణించింది. దీంతో కాంగ్రెస్ అధిష్టానంతో సంప్రదింపులు జరిపి ఈవీకేఎస్ ఇళంగోవన్‌ను అభ్యర్థిగా ప్రకటించాలని ఒత్తిడి తెచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో కాంగ్రెస్ అధిష్టానం సైతం ఆయనే అభ్యర్థి అని ఆదివారం రాత్రి ప్రకటించింది. అదే సమయంలో నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు లక్ష్యంగా మంత్రులు ముత్తుస్వామి, కేఎన్ నెహ్రూ, ముఖ్య నేతలను డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ రంగంలోకి దించడం గమనార్హం. మక్కల్ నీది మయ్యం నేత కమల్‌హాసన్ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. సోమవారం జరిగే కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించబోతున్నట్టు ఆ పార్టీ నేత పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, తమ అభ్యర్థి ఎవరో ఈనెల 29వ తేదీ ప్రకటిస్తామని నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ పేర్కొన్నారు.

డిపాజిట్ కోసం మద్యం బాటిళ్ల సేకరణ

ఈ ఎన్నికల్లో తాను పోటీచేయనున్నట్లు మందుబాబుల సంక్షేమ సంఘం నేత ఆర్ముగస్వామి ప్రకటించారు. ఎన్నికల డిపాజిట్ కోసం ఈరోడ్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని టాస్మాక్ దుకాణాల వద్ద తిష్ట వేశారు. మందుబాబులు ఖాళీ చేసిన సీసాలను సేకరించి, వాటి ద్వారా వచ్చే మొత్తంతో డిపాజిట్ సొమ్ము చెల్లించనున్నట్లు ఆయన ప్రకటించారు.

ఎంత పని చేశావు తల్లీ!

- దంపతుల మధ్య గొడవలు
- పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం
- ఇద్దరు పిల్లలు మృతి.. తల్లి పరిస్థితి విషమం

అన్నానగర్: దంపతుల మధ్య నెలకొన్న గొడవలు పిల్లల ప్రాణాలను బలిగొంది. భర్తతో గొడవ పడి పుట్టింటికి వచ్చిన భార్య తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తానూ తీసుకుంది. పిల్లలిద్దరూ మృతి చెందగా ఆమె చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతోంది. ఈ విషాదకర ఘటన కృష్ణగిరి జిల్లాలో చోటుచేసుకుంది. వివరాలు.. పర్కూర్ సమీపంలోని సెందారపల్లికి చెందిన గౌరి (26) కూటూర్‌కు చెందిన బేకరీ మాస్టర్ ముత్తరాజ్‌ను ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి కుమారుడు జీవన్ (04), కుమార్తె భావనశ్రీ (02) ఉన్నారు. ముత్తురాజ్ నెల రోజులుగా పనికి వెళ్లకుండా ఇంట్లోలోనే ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నెల 17వ తేదీ మరోసారి గొడవపడ్డారు. గౌరి భర్తపై ఆగ్రహంతో ఇద్దరు పిల్లలను తీసుకుని సెందారపల్లిలోని తల్లి ఇంటికి వచ్చింది. ఆదివారం తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తానూ తీసుకుంది. ముగ్గురూ స్పృహతప్పి పడిపోయారు. గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే వారిని ధర్మపురి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో పిల్లలు మృతి చెందారు. గౌరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి భర్త ముత్తురాజ్‌పై వేధింపులు, ఆత్మహత్యకు ప్రేరేపించడం కింద కేసు నమోదు చేశారు.

కొరుక్కుపేటలో దారుణం

- సెల్‌ఫోన్ లాక్కునేందుకు దుండగుడి యత్నం
- అదుపుతప్పి రైలు నుంచి కింద పడి యువకుడి మృతి

తిరువొత్తియూరు: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హౌరా నుంచి చెన్నై సెంట్రల్‌కు శనివారం సాయంత్రం కోరమండల్ ఎక్స్‌ప్రెస్ వస్తుండగా కొరుక్కుపేట శ్రీనివాసపురం మధ్య సిగ్నల్ లేని కారణంగా రైలు తక్కువ వేగం తగ్గింది. అప్పుడు రైలులో ఎస్–4 బోగీలోని ప్రయాణికులు ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణిస్తున్నారు. ఆ సమయంలో అదే బోగీలో ఫుట్‌బోర్డు మెట్లపై పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన రోనిసేట్ (24) కూర్చుని సెల్‌ఫోన్ చూస్తున్నాడు. ఆ సమయంలో రైలు పట్టాల సమీపంలో కింద నిలబడి ఉన్న ఓ దొంగ హఠాత్తుగా రోనిసేట్ చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను పైకి ఎగిరి లాక్కున్నాడు. దిగ్భ్రాంతి చెందిన రోని సేట్ సెల్‌ఫోన్ పట్టుకోవడానికి యత్నించాడు. దీంతో అదుపుతప్పి కింద పడ్డాడు. కొరుక్కుపేట రైల్వే పోలీసులు తీవ్రగాయాలైన రోని సేట్‌ను స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేర్పారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే రోనిసేట్ మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కొరుక్కుపేట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి సెల్‌ఫోన్ అపహరించిన దుండగుడి కోసం గాలింపు చేపట్టారు.

హోరాహోరీగా గుర్రపు పందేలు



గుర్రం పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు చంద్రన్, రాజేంద్రన్

తిరుత్తణి: తిరువలంగాడులో ఆదివారం గుర్రపు పందేలు హోరాహోరీగా సాగాయి. వివరాలు.. డీఎంకే యువజన విభాగ కార్యదర్శి, మంత్రి ఉదయనిధి స్టాలిన్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడు తూర్పు మండలం ఆధ్వర్యంలో ఆదివారం రేక్ల గుర్రాల పోటీలు నిర్వహించారు. మండల డీఎంకే కార్యదర్శి మహాలింగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే చంద్రన్, తిరువళ్లూరు ఎమ్మెల్యే రాజేంద్రన్ తదితరులు ప్రారంభించారు. తిరువలంగాడు క్రాస్‌రోడ్డు నుంచి కనకమ్మసత్రం మార్గంలో గుర్రాల పోటీలు చేపట్టారు. ఇందులో పెద్ద గుర్రాలకు 16 కి.మీ, చిన్న గుర్రాలకు 14 కి.మీ., కొత్త గుర్రాలకు 12 కి.మీ దూరం పోటీ పెట్టారు. చెన్నై, తిరువళ్లూరు,నామక్కల్, కాంచీపురం సహా వివిధ ప్రాంతాల నుంచి 35 గుర్రాలు పోటీల్లో పాల్గొన్నాయి. మూడు విభాగాల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.



పోటీకి సిద్ధంగా ఉన్న గుర్రాలు



పరుగులు తీసున్న గుర్రాలు

రూ.77.87 లక్షలతో ఫెర్నాండెజ్ స్మారక నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కనిమొళి

కొరుక్కుపేట: పాత తూత్తుకుడి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ క్రూజ్ ఫెర్నాండెజ్ స్మారక నిర్మాణానికి ఎంపీ కనిమొళి శనివారం శంకుస్థాపన చేశారు. చిదంబర నగర్ బస్టాప్ ఎదురుగా ఎంజీఆర్ పార్కుకు తూర్పున ఉన్న 20 సెంట్ల స్థలంలో రూ.77.87 లక్షల వ్యయంతో ఈ స్మారక చిహ్నం ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ కె.సెంథిల్ రాజ్, మత్స్యశాఖ మంత్రి అనితా ఆర్.రాధా కృష్ణన్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి పి.గీతాజీవన్, మేయర్ జెగన్ పెరియసామి, కార్పొరేషన్ కమిషనర్ టి.చారుశ్రీ పాల్గొన్నారు. తామిర భరణి నది నుంచి తీరప్రాంతానికి నీటిని తీసుకొచ్చే మొదటి తాగునీటి పథకాన్ని అమలు చేసిన మున్సిపల్ చైర్మన్ క్రూజ్ ఫెర్నాండెజ్ స్మారకాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన తర్వాత, స్మారక చిహ్నాన్ని అక్టోబరులో విడుదల చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో సౌత్ బీచ్ రోడ్డులోని రోచ్ పార్క్ వద్ద ఏర్పాటు చేశారు. అయితే పట్టణానికి దూరంగా ఏకాంత ప్రదేశంలో స్మారక స్థూపాన్ని నిర్మించడం ద్వారా క్రూజ్ ఫెర్నాండెజ్ కీర్తిని దెబ్బతీసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మత్స్యకారులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. దీంతో డాక్టర్ సెంథిల్ రాజ్, గీత వివిధ మత్స్యకారుల సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. తూత్తుకుడి–పాళయంకోట్టై హైవేపై ఎంజీఆర్ పార్క్ సమీపంలో స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

రూ. 70 లక్షల హవాలా నగదు స్వాధీనం

–ఒకరి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై మన్నడిలో ఆదివారం ఓ వ్యక్తి వద్ద రూ. 70 లక్షల హవాలా నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మన్నడి నార్త్ సముద్ర తీరం రోడ్డులో ఆదివారం ఉదయం పోలీసులు గస్తీ చేస్తున్నారు. మన్నడి ఇండియన్ బ్యాంకు వద్ద అనుమానాస్పదంగా నిలబడి ఉన్న వ్యక్తిని పోలీసులు అదుపు లోకి తీసుకుని విచారణ చేశారు. అతని వద్ద ఉన్న సంచిని తనిఖీ చేయగా కరెన్సీ నోట్ల కట్టలు ఉన్నాయి. అతని వద్ద ఉన్న రూ. 70 లక్షల నగదుకు సరైన ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. చెన్నై ఏలు కినరు ప్రాంతానికి చెందిన సరాబుద్దీన్ (58)ని అరెస్టు చేశారు. హవాలా నగదా అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

చెన్నై విమానాశ్రయంలో కిలో బంగారం స్వాధీనం

తిరువొత్తియూరు: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు కిలో బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. శ్రీలంక రాజధాని కొలంబో నుంచి విమానంలో వచ్చిన ప్రయాణికుల వద్ద కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఇద్దరు మహిళలపై అధికారులకు అనుమానం కలిగింది. వారిని ప్రత్యేక గదిలోకి తీసుకెళ్లి తనిఖీ చేశారు. లోదుస్తుల్లో దాచి తీసుకొచ్చిన 860 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుడి వద్ద 378 గ్రాముల బంగారాన్ని పట్టుకున్నారు. ఈ మొత్తం బంగారం విలువ రూ. 67 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

కుమారుడు పాఠశాలకు వెళ్లడం లేదని..

–తల్లి ఆత్మహత్య

తిరువొత్తియూరు: కొడుకు సక్రమంగా పాఠశాలకు వెళ్లడం లేదని మనస్తాపం చెందిన ఓ తల్లి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చెన్నై పోరూర్‌లో చోటుచేసుకుంది. రామాపురం ఈశ్వర ఆలయ వీధికి చెందిన గీత (36) టైలర్‌గా పని చేస్తున్నారు. భర్త రాము కొన్నేళ్ల క్రితం ప్రమాదంలో మృతి చెందాడు. కుమారుడు గోకుల్‌తో కలిసి ఉంటోంది. గోకుల్ అదే ప్రాంతంలోని పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో గోకుల్ సక్రమంగా పాఠశాలకు వెళ్లకుండా తల్లి మాటలను పెడచెవిన పెట్టేవాడు. స్నేహితులతో కలిసి బలాదూర్లు తిరుగుతుండడంతో పలుమార్లు మందలించింది. అతని తీరులో మార్పు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న రామాపురం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఆడ శిశువు విక్రయంపై విచారణ

తిరువొత్తియూరు: యువతికి వివాహం కాకుండా పుట్టిన ఓ ఆడ బిడ్డను రూ. 5 లక్షలకు విక్రయించారు. పోలీసులు బిడ్డను స్వాధీనం చేసుకుని శిశు సంక్షేమ శరణాలయానికి అప్పగించారు. వివరాలు.. తిరుచ్చి జిల్లా లాల్గుడి సమీపంలో ఉన్న అన్బిల్ మంగమ్మాల్‌పురం గ్రామానికి చెందిన ఓ మహిళకు (32) ఇంకా వివాహం కాలేదు. ఈమె ఇటీవల ఓ ఆడబిడ్డకు జన్మిచ్చింది. ఆ బిడ్డను రూ. 5 లక్షలకు విక్రయించినట్లు తెలిసింది. ఈ వ్యవహారానికి సంబంధించి జానకి, లాల్గుడి అరియూర్ గ్రామానికి చెందిన న్యాయవాది ప్రభు (42), అతని భార్య షణ్ముగవల్లి (38), మణక్కల్ సూసైపురానికి చెందిన ఆకాష్ (35) తిరుచ్చికి చెందిన బ్రోకర్ కవిత, ఈరోడ్ జిల్లా కరుందరై గ్రామానికి చెందిన షణ్ముగ ప్రియ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. అలాగే ఢిల్లీకి చెందిన బిడ్డల విక్రయ ముఠా నాయకుడు గోపి కృష్ణన్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కర్ణాటక రాష్ట్రం బెల్‌లెక్షవి జిల్లా జన్మమ్మానగర్‌కు చెందిన భాగ్యశ్రీ అనే మహిళకు బిడ్డను విక్రయించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఆమె వద్ద నుంచి బిడ్డను స్వాధీనం చేసుకుని శరణాలయంలో అప్పగించారు.

కోడి పందేల్లో రూ.2.40 లక్షల బైక్ సొంతం



విజేతకు రూ.2.40 లక్షల విలువైన బైక్‌ను అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వినోజ్ సెల్వ

తిరువళ్లూరు: సంక్రాంతిని పురస్కరించుకుని తిరువళ్లూరు జిల్లా తంగానూర్ గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన కోడి పందేలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరుకు చెందిన కుప్పన్ మొదటి బహుమతిగా రూ.2.40 లక్షల విలువైన బైక్‌ను సొంతం చేసుకున్నారు. తిరుచిరాపల్లికి చెందిన అశోక్ రెండో స్థానంలో నిలిచి రూ.90 వేల విలువైన బైక్‌ను అందుకున్నారు. కరోనా తరువాత పోటీలను నిర్వహించడానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించి కోడిపందేలు నిర్వహించడానికి అనుమతి పొందారు. ఈ నెల 20వ తేదీ నుంచి పోటీలు జరిగాయి. ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు చెందిన క్రీడాకారులు పందెం కోళ్లతో హాజరయ్యారు. తమ కోళ్లను బరిలో దించి తలపడ్డారు. పోటీల్లో విజయం సాధించిన వారికి బంగారు కాయిన్, రెండు ద్విచక్ర వాహనాలు, మెడల్స్, సర్టిఫికెట్లను అందజేసే కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వినోజ్ సెల్వ, జిల్లా అధ్యక్షుడు అశ్విన్, ప్రధాన కార్యదర్శులు కరుణాకరన్, ఆర్యశ్రీనివాసన్, నిర్వాహకులు దేవ బహుమతులను అందజేశారు. కాగా పోటీల్లో నూరీ, ఖదర్, జావా, యాకూత్, గిరి, బీలాక్లిక్ రకాలకు చెందిన కోళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఉపాధ్యాయురాలికి రెండేళ్ల జైలు

– రూ.34 లక్షల జరిమానా

అన్నానగర్: ఆవడిలో దీపావళి చీటీ నిర్వహిస్తూ.. మోసానికి పాల్పడిన ఓ పాఠశాల ఉపాధ్యాయురాలికి పూందమల్లి కోర్టు శనివారం రెండేళ్ల జైలు శిక్ష, రూ.34 లక్షల జరిమానా విధించింది. వివరాలు.. చెన్నైలోని పల్లవన్ వీధికి చెందిన జాస్మిన్ (52). ఆవడిలోని ఓ ప్రైవేటు స్కూలులో తమిళ టీచర్‌గా పని చేస్తోంది. 2014 నుంచి దీపావళి పండుగకు ముందు కిరాణా సామగ్రి తక్కువగా ఇస్తానని చీటీ నడుపుతోంది. ఆమెపై నమ్మకంతో చీటి వేసి పలువురు ప్రతి నెలా డబ్బులు చెల్లిస్తూ వచ్చారు. ఆ విధంగా దీపావళి చీటి పేరుతో రూ.50 లక్షల వరకు వసూలు చేసి 500 మందిని మోసం చేసింది. తనతో పాటు పని చేసిన సహోద్యోగి ఉష వద్ద రూ.6 లక్షలు అప్పు తీసుకుని తిరిగి చెల్లించలేదు. దీంతో ఉష , చీటి వేసిన వ్యక్తులు చెన్నైలోని సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి 2015లో జాస్మిన్‌ను అరెస్టు చేసి జైలులో పెట్టారు. పూందమల్లి క్రిమినల్ కోర్టు -1లో కేసు విచారణ జరుగుతోంది. ఈ స్థితిలో శనివారం కేసు విచారణకు వచ్చింది. ఈ కేసు విచారించిన న్యాయమూర్తి స్టాలిన్ మాట్లాడుతూ దీపావళి చీటీ పేరుతో జాస్మిన్ మోసానికి పాల్పడినట్లు నిర్ధారించారు. ఈమేరకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

వృద్ధురాలి ఇంట్లో చోరీ.. వ్యక్తి అరెస్టు

-22 సవర్ల నగలు,
రూ. 1.47 లక్షలు స్వాధీనం



నిందితుడు గోవింద్

తిరువొత్తియూరు: చెన్నై పులియంతోపులో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి ఇంట్లో చోరీ చేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 22 సవర్ల నగలు, రూ. 1.47 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. చెన్నై పులియంతోపు, బోలునాయకన్ వీధిలో శాంత (68) ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఈ నెల 19వ తేదీ ఇంటికి తాళం వేసుకుని ఊరికి వెళ్లి 20వ తేదీ తిరిగి వచ్చారు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 22 సవర్ల నగలు, రూ. 1.55 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఫిర్యాదు మేరకు పులియంతోపు పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడు గోవింద్ (38)ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి నగలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

బాలుడి మృతి

- బంధువుల ఆందోళన

అన్నానగర్: బాలుడు మృతిచెందడంతో బంధువులు ఆందోళనకు దిగారు. వివరాలు.. తారమంగళానికి చెందిన ఈశ్వరన్ (35), ప్రియ (27) దంపతులకు కుమారుడు దిలీప్ (02) ఉన్నాడు. ఇతనికి రెండు రోజులుగా జ్వరం ఉండడంతో తారమంగళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించారు. శనివారం రాత్రి విరేచనాలు ఎక్కువ కావడంతో బాలుడిని తారమంగళం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఓమలూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలని సూచించారు. అయితే బాలుడి తల్లిదండ్రులు ప్రైవేటు అంబులెన్స్‌లో సేలం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ బాలుడిని అడ్మిట్ చేయడానికి ఆలస్యం కావడంతో దిలీప్ మృతి చెందాడు. దీంతో ఈశ్వరన్ కుటుంబ సభ్యులు, బంధువులు తారమంగళం ప్రభుత్వాస్పత్రిని ముట్టడించి ఆందోళనకు దిగారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

తిరుత్తణి ఆలయంలో చైన్‌స్నాచింగ్

తిరుత్తణి: సుబ్రహ్మణ్యస్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తురాలి మెడలోని ఐదు సవర్ల తాళిని దొంగ లాక్కుని పరుగులు తీశాడు. ఆమె కేకలతో భక్తులు అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలు.. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. దీంతో అధిక సంఖ్యలో భక్తులు క్యూలో వేచివున్నారు. సర్వదర్శనం క్యూలైన్‌లో తిరునల్వేలికి చెందిన శాంతి(42) ఉన్నారు. పక్కనే ఉన్న ఓ వ్యక్తి హఠాత్తుగా ఆమె మెడలోని ఐదు సవర్ల తాళిని లాక్కుని పరుగులు తీశాడు. ఆమె కేకలతో భక్తులు ఆ వ్యక్తిని పట్టుకున్నారు. తాళి స్వాధీనం చేసుకుని నిందితుడిని పోలీసులకు అప్పగించారు. తిరుత్తణి పోలీసులు విచారణ చేస్తున్నారు.

నగల దుకాణంలో దోపిడీ

–30 సవర్ల నగలు, 25 కిలోల వెండి లూటీ

అన్నానగర్: కృష్ణగిరి జిల్లా ఊతంగరైలోని శ్రీవిఘ్నేశ్వర జ్యువెలరీ దుకాణంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. దుకాణం వెనుక గోడకు రంధ్రం చేసి లోపలికి ప్రవేశించిన దుండగులు 30 సవర్ల నగలు, 25 కిలోల వెండి దోచుకెళ్లారు. తిరుపత్తూరు టౌన్ అవ్వై నగర్‌కు చెందిన దుకాణ యజమాని శేఖర్ (52) ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజీ హార్డ్‌డిస్క్‌ను దుండగులు ఎత్తుకెళ్లినట్టు తెలిసింది.

16 సవర్ల నగలున్న బ్యాగ్ మిస్సింగ్

అన్నానగర్: కళ్లకురిచ్చి జిల్లా తిరుకోవిలూరు సమీపంలోని సీర్పందనల్లూరు గ్రామ మఠానికి చెందిన రామచంద్రన్(35) చెన్నైలో మొబైల్‌షాప్ నడుపుతున్నాడు. పొంగల్ పండుగ సందర్భంగా వారం క్రితం చెన్నై నుంచి తన స్వగ్రామమైన సీర్పందనల్లూరు గ్రామానికి వచ్చాడు. చెన్నై వెళ్లేందుకు శనివారం మధ్యాహ్నం భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి తిరుకోవిలూరు నుంచి రామచంద్రన్ ప్రభుత్వ బస్సు ఎక్కాడు. ఆ సమయంలో 16 సవర్ల నగలు, రూ.లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు తీసుకెళ్తున్నాడు. ముగైయార్ బస్టేషన్ సమీపంలో బస్సు వెళ్తుండగా.. తన బ్యాగ్ కనిపించకపోవడంతో అరగండ నల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పార్వతీపురం మన్యం జిల్లా మీసాలపేటలో మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



బాపట్ల జిల్లా అమర్తలూరులో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున



చిత్తూరు జిల్లా దయాలగడ్డలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



పశ్చిమగోదావరి జిల్లా తణుకులో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

కాలు పోయిందని కలత పడలేదు

- ప్రకృతి వ్యవసాయంలో స్ఫూర్తిగా నిలుస్తున్న కోటేశ్వరమ్మ
- ఆమె చేస్తున్న కృషికి గుర్తింపుగా ఎన్నో అవార్డులు
- కోటేశ్వరమ్మపై లఘు చిత్రాన్ని రూపొందించిన 'వైఎస్సార్ క్రాంతి పథం' అధికారులు



కలెక్టర్ శివశంకర్ నుంచి జ్ఞాపికను అందుకుంటున్న కోటేశ్వరమ్మ

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవకు చెందిన పరామత్తుల కోటేశ్వరమ్మ 2018లో భర్త వెంకటేశ్వరరావుతో కలిసి ప్రకృతి వ్యవసాయం చేపట్టింది. 2020 ఏప్రిల్ 20న భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై పొలానికి వెళ్తుండగా ప్రమాదం బారినపడింది. దీంతో ఆమె కుడి కాలు పూర్తిగా తొలగించాల్సి వచ్చింది. అయినా ప్రకృతి వ్యవసాయం చేయాలన్న కోరిక మాత్రం ఆమెలో కుంటుపడలేదు. కృత్రిమ కాలు సహాయంతో ప్రకృతి వ్యవసాయం చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తోంది. అతి తక్కువ ఖర్చుతో మిరప, పత్తి పంటలు పండిస్తూ లాభాలను స్వీకరిస్తోంది. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను పదిమందికీ తెలియజేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది.

ఆదాయం ముఖ్యం కాదు

ప్రకృతి వ్యవసాయం చేస్తూనే ఇంటివద్ద కషాయాలు తయారీ చేస్తోంది కోటేశ్వరమ్మ. వ్యవసాయ అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన కషాయాలను తోటి ప్రకృతి వ్యవసాయదారులకు విక్రయిస్తోంది. మరోవైపు తను పండించిన పంట ఉత్పత్తులతో ఇంటివద్దే పచ్చళ్లు, కారం పొడులు తయారుచేసి విక్రయిస్తోంది. ఆమె కృషికి ఎన్నో అవార్డులు ఆమెను వరించాయి. ప్రకృతి వ్యవసాయంలో ఎందరికో స్ఫూర్తిగా నిలవాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు ఆమెపై ఓ లఘుచిత్రాన్ని చిత్రీకరించారు.

కానిస్టేబుల్ రాత పరీక్ష ప్రశాంతం

6,100 పోస్టులకు 4,58,219 మంది అభ్యర్థుల హాజరు

- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్.. సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- కీపై 25వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ
- రెండు వారాల్లో రాత పరీక్ష ఫలితాల విడుదల



సాక్షి, అమరావతి/బాలాజీచెరువు (కాకినాడ సిటీ)/రాజంపేట/చీమకుర్తి : ఏపీ పోలీస్ శాఖలో సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 34 పట్టణాల్లోని 997 పరీక్షా కేంద్రాల్లో ఉ.10 గంటల నుంచి మ.1 గంట వరకు ఈ పరీక్ష జరిగింది. మొత్తం 6,100 కానిస్టేబుల్ పోస్టుల కోసం 5,03,487 మందికి హాల్ టికెట్లు జారీచేశారు. వీరిలో 4,58,219 మంది (91శాతం) పరీక్షకు హాజరయ్యారని జేఎన్‌టీయూకే ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. పరీక్ష నిర్వహణలో కాకినాడ జేఎన్‌టీయూ అధ్యాపక సిబ్బంది, పోలీసు యంత్రాంగం సహకరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈ పరీక్ష నిర్వహించారు. మరోవైపు.. ఏ, బీ, సీ సిరీస్ ప్రశ్నల బుక్‌లెట్, వాటి ప్రిలిమినరీ ఆన్సర్ కీ ఆదివారం రాత్రి 8 గంటల నుంచి www. slprb. ap. gov. in వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. దీనిపై అభ్యర్థులకు అభ్యంతరాలుంటే సూచించిన ఫార్మాట్‌లో ఈ నెల 25వ తేదీ సా.5 గంటల్లోపు www. slprb. ap. gov. inకు మెయిల్ చేయాలని డీజీపీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. రెండు వారాల్లో ప్రిలిమినరీ రాత పరీక్ష ఫలితాలు విడుదల చేస్తారు.

తల్లుల పాత్రలో తండ్రులు

ఇక కానిస్టేబుల్ పోస్టుల పరీక్ష సందర్భంగా అక్కడక్కడ పలు ఆసక్తికర సంఘటనలు చోటుచేసుకున్నాయి. వివిధ ప్రాంతాల్లో తమ భార్యలు కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షలు రాస్తుండగా, సెంటర్ బయట వారి భర్తలు, కుటుంబ సభ్యులు పిల్లల బాగోగులు చూసుకున్నారు. ఏడుపులందుకున్న చిన్నారులను బుజ్జగించేందుకు నానాతంటాలు పడ్డారు. కొందరు ఉయ్యాల కట్టి జోలపాడారు. మరికొందరు చెట్లకిందే ఆడించారు.

మానవత్వం చాటిన పోలీసులు

ఒంగోలు జిల్లా సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ కాలేజీలో పరీక్ష రాయడానికి ఒక మహిళ ఆరునెలల వయసున్న తన పాపతో హాజరైంది. బిడ్డను భర్త చేతిలో ఉంచి లోపలికి వెళ్లింది. ఆ తర్వాత బిడ్డ ఏడవడంతో ఏం చేయాలో తెలీక తండ్రి కంట్రోల్ రూం నెం.112కు ఫోన్‌చేసి తన సమస్యను వివరించాడు. ఎస్పీ మలికా గర్గ్ సూచనలతో అదే కాలేజీలో విధులు నిర్వహిస్తున్న మహిళా హెడ్ కానిస్టేబుల్ పరమేశ్వరి ఆ చంటిబిడ్డను ఓదార్చి పాలడబ్బాతో పాలు పట్టడంతో కథ సుఖాంతమైంది.



పసిపాపకు పాలు పడుతున్న హెడ్ కానిస్టేబుల్ పరమేశ్వరి

'అమరావతి' అమ్మతనం

ఇలాంటి సంఘటనే రాజంపేటలోనూ జరిగింది. కడపకు చెందిన మల్లీశ్వరి నాలుగు నెలల చంటిబిడ్డతో పరీక్ష కేంద్రానికి చేరుకుంది. చంటిబిడ్డను అవ్వకు ఇచ్చి లోపలికి వెళ్లిపోయింది. కొద్దిసేపటికి బాబు ఏడుపు మొదలుపెట్టాడు. అవ్వ ఓదార్చలేకపోయింది. ఆప్తులు తల్లిడిల్లిపోయారు. దీంతో అక్కడే విధులు నిర్వర్తించేందుకు వచ్చిన రాజంపేట రూరల్ పోలీసుస్టేషన్‌కు చెందిన మహిళ కానిస్టేబుల్ అమరావతి (బాలింత) స్పందించి బిడ్డను లాలించింది. పాలసీసాతో పాలూ పట్టింది. అయినా ఏడుపు ఆపకపోవడంతో చివరికి తన చనుబాలివ్వడంతో బిడ్డ వెంటనే నిద్రలోకి జారుకున్నాడు. అమరావతి అమ్మతనానికి అక్కడ ఉన్న తోటి పోలీసులు, స్థానికులతో పాటు అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అమరావతిని ప్రత్యేకంగా అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్.. మరో పదేళ్లు పొడిగింపు

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఆయా వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్డినెన్స్ తేవడం గొప్ప విషయం

ఈ సందర్భంగా పలువురు మంత్రులు, వివిధ ప్రజా సంఘాల నేతలు స్పందించారు. ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున స్పందిస్తూ.. సబ్‌ప్లాన్ చట్టం 2013 జనవరి 23 నుంచి అమలులోకి వచ్చిందని.. చట్ట ప్రకారం పదేళ్ల తర్వాత ఇప్పుడు రద్దయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై సకాలంలో సీఎం వైఎస్ జగన్ స్పందించి.. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆమోదంతో ముందుగానే ఆర్డినెన్స్ తేవడం గొప్ప విషయమన్నారు. దీంతో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపట్ల సీఎం తనకున్న ప్రేమను మరోసారి చూపించారని కొనియాడారు. సబ్‌ప్లాన్ మరో పదేళ్లు కొనసాగేలా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, దేశంలో మెరుగ్గా సబ్‌ప్లాన్ అమలుచేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలవడం వెనుక సీఎం జగన్ చిత్తశుద్ధే కారణమని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి. విజయసాయిరెడ్డి.. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. సబ్‌ప్లాన్‌ను మరో పదేళ్లు పొడిగించడం హర్షణీయమంటూ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

సీపీఎం, కేవీపీఎస్, సెంటర్ ఫర్ దళిత స్టడీస్ హర్షం

ఇక ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్సు తేవడం పట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఒ.నల్లప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, సెంటర్ ఫర్ దళిత స్టడీస్ (హైదరాబాద్) చైర్‌పర్సన్ మల్లేపల్లి లక్ష్మయ్య, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తంచేశారు. అలాగే, జాతీయ దళిత హక్కుల చైర్మన్ పెరికె ప్రసాదరావు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంతు నాయక్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు కూడా ముఖ్యమంత్రి నిర్ణయంపట్ల సంతోషం వ్యక్తంచేశారు. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామన్నారు.

ఆదరణ పెరిగింది.. ఆదాయం అదిరింది

- బొర్రా గుహలకు భారీ తాకిడి విజయవాడలో బోటింగ్‌కు డిమాండ్
- 50 శాతానికి పైగా వృద్ధి నమోదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జల పర్యాటకం దూసుకుపోతోంది. గత ఆర్థిక సంవత్సరం 2021–22 (డిసెంబర్ వరకు) వాటర్ ఫ్లీట్, సౌండ్ అండ్ లైటింగ్ విభాగాల ద్వారా వచ్చిన ఆదాయంతో పోలిస్తే 2022–23 డిసెంబర్ నాటికి 50 శాతానికి పైగా అధికంగా పెరిగింది. రుషికొండ, విజయవాడలోని భవానీ ద్వీపం, పాపికొండలు, శ్రీశైలం, నాగార్జున సాగర్ బోటింగ్ పాయింట్లు, శ్రీశైలం రోప్‌వే, బొర్రా గుహలకు భారీ ఆదరణ లభిస్తోంది. వాటర్ ఫ్లీట్, సౌండ్ అండ్ లైటింగ్ షో విభాగాలు పర్యాటక శాఖకు బలమైన ఆర్థిక వనరులుగా మారాయి. 2021–22 డిసెంబర్ వరకు రూ.8.63 కోట్లు వసూలు చేస్తే.. అది గడచిన తొమ్మిది నెలల్లోనే రూ.16.08 కోట్లకు చేరుకుంది. వచ్చే మూడు నెలలు పండుగలు ఉండటంతో ఆదాయం మరింత పుంజుకోనుంది. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, నెల్లూరు, కడప, కర్నూలు డివిజన్‌లలో 14 చోట్ల బోటింగ్ యూనిట్లు ఉన్నాయి.

ఇందులో విజయవాడ, శ్రీశైలం, విశాఖ డివిజన్లలో అధిక టికెట్ కలెక్షన్లు వస్తున్నాయి. 2022–23లో డిసెంబర్ వరకు వాటర్ ఫ్లీట్ ద్వారా రూ.6.60 కోట్లు వచ్చింది. విజయవాడ బెరంపార్కు బోటింగ్ యూనిట్ ద్వారా ఒక్క డిసెంబర్‌లోనే రూ.30.61 లక్షలు వసూలైంది.

బొర్రా గుహలకు భలే క్రేజ్

సౌండ్ అండ్ లైటింగ్ షో విభాగంలో బొర్రా గుహల ఆదాయం రికార్డులను నమోదు చేస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక్క డిసెంబర్‌లోనే రూ.1.20 కోట్లను ఆర్జించడం విశేషం. తర్వాత శ్రీశైలం రోప్‌వేకు మంచి ఆదరణ లభిస్తోంది.

యూ టర్న్

ఆ పాత మధురం.. ఆరోగ్య జీవనం

ప్రపంచీకరణ నేపథ్యంలో అతివేగంగా పాశ్చాత్య సంస్కృతి భారతీయులను చుట్టుముట్టేసింది. అయితే అదే సమయంలో అనారోగ్యం వెంటాడింది. దీనికితోడు కరోనా వచ్చి మన సంప్రదాయాల ప్రాధాన్యతను గుర్తు చేసింది. అంతే.. పాత రోజుల వైపు జీవనశైలి మళ్లింది. మట్టి, రాగి పాత్రలకు గిరాకీ వచ్చింది. తిరగలి, రుబ్బు రోళ్లకు పూర్వ వైభవం వచ్చింది. సేంద్రియం, చిరుధాన్యాల వైపు రైతాంగం మొగ్గు చూపుతోంది. మొత్తంగా మన లైఫ్ స్టైల్ యూ టర్న్ తీసుకుంది.

- మళ్లీ మట్టి పాత్రలు, గానుగ నూనెల వినియోగం
- చిరుధాన్యాల సాగు, సేంద్రియ విధానం
- మిద్దెలపై కూరగాయల సాగు



ఇళ్లల్లో దర్శనమిస్తున్న రుబ్బురోళ్లు



రుబ్బురోలులో ఇడ్లీపిండి రుబ్బుతున్న మహిళ



కొర్రలు, సామలు, అరెకలు..

వెంకటగిరి: మన పూర్వీకుల సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, జీవన విధానంపై మళ్లీ అన్వేషణ మొదలైంది. క్రమంగా ఆ పాత మధురాలు ఒక్కొక్కటిగా వాడుకలోకి వస్తున్నాయి. మన జీవన శైలి మలుపు తిరిగింది. ఎక్కడైతే ఈ ప్రయాణం మొదలు పెట్టామో తిరిగి తిరిగి అక్కడికే వెళుతోంది. ఒక తరానికి ముందు ప్రజలు ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకునేవారు. ఇందుకోసం రాగులు, సజ్జలు, కొర్రలు, అరికెలు, అండు కొర్రలు వంటి పంటలను సాగుచేసేవారు. వాటిని వాడుకుని, మిగిలిన వాటిని విక్రయించేవారు. వీటిని పండించడంలో సేంద్రీయ పద్ధతులను అనుకరించేవారు. అందుకే నాటితరం వారు ఆరోగ్యవంతులుగా ఉండేవారు. కాలక్రమంలో అధిక దిగుబడుల కోసం మోతాదు మించి రసాయనిక ఎరువుల వినియోగం ఎక్కువయింది. వాటిని ఆహారం తీసుకున్న వారిలో సైతం పలు ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో షుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులు చుట్టుముట్టేశాయి. వీటికితోడు కరోనా మరో గుణపాఠం నేర్పింది. దీంతో ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ఆరంభించారు. రోజూ వాడే బియ్యం నుంచి వినియోగించే వంటపాత్రల వరకూ పాత పద్ధతులను అనుసరిస్తున్నారు. వెంకటగిరి వంటి చిన్న చిన్న పట్టణాల్లో సైతం కొర్రలు, సజ్జలు, రాగులు విక్రయించే దుకాణాలు వెలుస్తున్నాయి. ఆరోగ్య స్పృహ పెరుగుతున్న నేపథ్యంలో ముడి బియ్యం, సేంద్రియ విధానంలో పండించిన కూరగాయలను వాడేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

కొర్రలన్నం.. రాగి సంగటి

జొన్నన్నం, రాగిసంగటి ఐదు దశాబ్దాల క్రితం ప్రధాన ఆహారం. తెల్లటిబియ్యం రాకతో కనుమరుగైన ఈ చిరుధాన్యాలు ఇప్పుడు మళ్లీ నియోగంలోకి వస్తున్నాయి. దీంతో వీటికి పూర్వ వైభవం వచ్చింది. బియ్యం బదులు ఒకపూట చిరుధాన్యల భోజనంపై ఆసక్తి కనబరుస్తున్నారు. జొన్న, సజ్జ, రాగి తదితర చిరుధాన్యాలతో తయారు చేసిన చిరుతిండ్లకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో వీటి సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

మిద్దె పంటలు

కూరగాయలు పండించే రైతులు చాలామంది వాటిని చీడపీడలనుండి కాపాడేందుకు రకరకాల పురుగుమందులు పిచికారీ చేస్తుంటారు. త్వరగా వచ్చేందుకు రసాయనిక ఎరువులు వాడుతుంటారు. వీటి వల్ల ఆరోగ్యపరంగా దుష్ప్రభావాలు ఉంటాయన్న ఆలోచనతో పెరట్లోనే సొంతంగా కూరగాయాలు పెంచుకుంటున్నారు. అయితే పట్టణాల్లో స్థలాల కొరత కారణంగా మిద్దెలపైనే ఆకుకూరలు, కూరగాయలు పండించడం మొదలుపెట్టారు.

తిరగలి..రుబ్బురోళ్లు

పల్లెల్లోనే కాదు పట్టణాల్లో కూడా రోళ్లు, తిరగళ్లు అడుగుపెడుతున్నాయి. రోట్లో రుబ్బిన పిండితో తయారు చేసే ఆహర పదార్థాలు మెత్తగా, రుచిగా ఉంటున్నాయని మహిళలు వీటిపై ఆసక్తి కనబరుస్తున్నారు. బయట కొనుగోలు చేస్తున్న పప్పుల్లో వేర్వేరు పదార్థాలు కల్తీ అవుతున్నాయని, మినుములు, పెసలు వంటివి గింజలు కొనుక్కుని రోళ్లలో విసురుకుని పప్పు చేసుకుంటున్నారు.

సమస్తం.. సేంద్రియం

రసాయన మందులు వాడకుండా పండించే కూరగాయలు, ఆకుకూరలు, ఆహరధాన్యాల వాడకం రోజు రోజుకూ పెరుగుతోంది. జీవామృతం, ఘన జీవామృతం, పంచగవ్య ఆధారిత ఎరువులతో పండించే వారి పొలాల వద్దకే వెళ్లి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. సేంద్రియ ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని పట్టణాల్లోని దుకాణాలు వెలుస్తున్నాయి.

రాగి చెంబులు, మట్టిపాత్రలు

దశాబ్దాల క్రితం వంటకు వినియోగించే రాగి, మట్టిపాత్రల స్థానంలో క్రమంగా అల్యూమినియం, స్టీలు పాత్రలు ఉపయోగంలోకి వచ్చాయి. ధరలు అందుబాటులో ఉండడం, బరువు తక్కువగా ఉండడంతో వీటి వినియోగంపైనే ఆసక్తి చూపారు. అయితే ఈ తరహా పాత్రల్లో వండిన పదార్థాల తినడం వల్ల ఆరోగ్యసమస్యలు వస్తుండడంతో, మళ్లీ ఇత్తడి, మట్టితో చేసిన పాత్రలు వైపు మొగ్గుచూపుతున్నారు. రాగిపాత్రలో నిల్వచేసిన నీరు తాగడం ఆరోగ్యకరమని పరిశోధనల్లో రుజువు కావడంతో రాగి వాటర్ బాటిళ్లు, కూజాలు మార్కెట్లో లభిస్తున్నాయి. పలువురు శుభకార్యాల్లో రాగి గ్లాసులను సైతం బహూకరిస్తున్నారు. అల్యూమినియం పాత్రల కంటే ప్రస్తుతం మట్టిపాత్రల ధరలే అధికంగా ఉన్నాయి. అయినా వాటిని వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పిండి వంటలకూ గానుగనూనెలే

సంక్రాంతి పండుగకు చేసుకున్న పిండివంటలకూ ఈ ఏడాది గానుగ నూనెనే వినియోగించాం. ఆ నూనెలతో తయారు చేసిన ఆహారపదార్థాలు మంచి వాసన, రుచిగా ఉంటున్నాయి. దీంతో ఈ ఏడాది అరెసెలు కూడా గానుగ నూనెను ఉపయోగించి తయారు చేశాం.

– కె భాగ్యమ్మ, వెంకటగిరి

మేమే పండించుకుంటున్నాం

సేంద్రియ పద్ధతిలో సొంతంగా పండించిన కూరగాయలు వండుకుంటాం. మిద్దెపైనే 50 రకాల కూరగాయలు, పూల మొక్కలు పెంచుతున్నాం. గతంలో మార్కెట్ నుంచి కొనుగోలు చేసి వినియోగించేవాళ్లం. అయితే మిద్దెతోటలపై శిక్షణ తీసుకుని తోటను పెంచడం వల్ల ఖర్చులు గణనీయంగా తగ్గాయి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటున్నాం అనే తృప్తి ఉంది.

– ఎం కుమారి, రాణీపేట, వెంకటగిరి

బంతి భోజనాల్లో రాగి సంగటి

బంతి భోజనాల్లో కొంతకాలంగా రాగిసంగటి పెడుతున్నారు. గతంలో బంతి భోజనం అంటే పులిహోర, ఆ తర్వాత ఆ స్థానాన్ని వెజ్ బిరియాని ఆక్రమించింది. ప్రస్తుతం వాటి బదులు రాగిసంగటి ఉండేలా చూస్తున్నారు. మరికొంతమంది కొర్రఅన్నం, సగ్గుబియ్యంతో చేసిన రుచికరమయిన పాయసం చేసి మరీ వడ్డిస్తున్నారు.

– బి.కరుణాకర్‌రెడ్డి, వెంకటగిరి



గానుగ నూనెల వాడకంపై ఆసక్తి

చిన్న చిన్న పట్టణాల్లో సైతం గానుగనూనె వాడకం పెరుగుతోంది. ఉడ్‌ప్రెస్ ఆయిల్ కోరుకునేవారు దగ్గరుండి కల్తీ లేని స్వచ్ఛమైన నూనెను పట్టిఇచ్చే దుకాణాలు వెంకటగిరిలోనూ కనిపిస్తున్నాయి. ఎక్కువ మంది వేరుశెనగనూనెకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కొబ్బరినూనెను కూడా ఇదే విధానంలో తీయించుకుంటున్నారు. మార్కెట్‌లో లభించే నూనెల కంటే రెండు, మూడు రెట్లు అధిక ధర ఉంటున్నా, ఆరోగ్యపరంగా మంచిదనే అభిప్రాయంతో పలువురు ఆ నూనెల కొనుగోళ్లకు వెనుకాడడం లేదు.

100% ఆక్యుపెన్సీతో వందేభారత్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ఎన్నో అంచనాలు.. అనేక పరీక్షల అనంతరం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య లాంఛనంగా ప్రారంభమైన వందేభారత్ ఎక్స్‌ప్రెస్.. 100 శాతం ఆక్యుపెన్సీతో రాకపోకలు సాగిస్తోంది. సంక్రాంతి రోజున సికింద్రాబాద్‌లో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఈ రైలును ప్రారంభించగా.. సోమవారం నుంచి రెగ్యులర్ రైలుగా పట్టాలపై పరుగులు తీస్తోంది. మొదటిరోజు దాదాపు అన్ని స్టేషన్లలో హాల్ట్‌లు ఉండడం, ప్రారంభోత్సవం ఆలస్యం కావడంతో కొంత ఆలస్యంగా విశాఖపట్నం చేరుకున్నా.. మరుసటి రోజు నుంచి సమయానికి గమ్యస్థానానికి చేరుకుంటోంది.

వందేభారత్ రైలు గంటకు సగటున 110 నుంచి 130 కి.మీల వేగంతో విశాఖపట్నం–సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య ప్రయాణిస్తోంది. ప్రయాణికులు విశాఖపట్నం నుంచి కేవలం ఎనిమిదిన్నర గంటల్లోనే సికింద్రాబాద్ చేరుకుంటున్నారు. ఏ మాత్రం అలసట లేకుండా ఉండే సీటింగ్ సౌకర్యం, కోచ్‌ల లోపల ఆహ్లాదపరిచే ఇంటీరియర్, నాణ్యమైన అల్పాహారం, భోజనం, స్నాక్స్, వాటర్ బాటిల్స్ వంటి సదుపాయాలు(అన్ని టికెట్ ధరలోనే), తక్కువ సమయంలోనే ప్రయాణం ఈ రైలు ప్రత్యేకతలుగా నిలుస్తున్నాయి. ఆరు రోజులు ఇటు చెయిర్‌కార్ కోచ్‌లతో పాటు ఎగ్జిక్యూటివ్ కోచ్‌ల్లో పూర్తి ఆక్యుపెన్సీతో వందేభారత్ నడిచింది. విశాఖపట్నం–సికింద్రాబాద్ వందేభారత్‌లో మొత్తం 16 కోచ్‌లు, 1128 సీట్లు ఉన్నాయి. వీటిలో ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 104, చెయిర్‌కార్ కోచ్‌లో మొత్తం 1024 సీట్లు అందుబాటులో ఉండగా.. విశాఖపట్నం కోటా కిందట ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో 57, చెయిర్‌కార్ కోచ్‌లో 627 సీట్లు రిజర్వేషన్‌కు అవకాశం కల్పించారు. ఆరు రోజులుగా ఈ రెండు క్లాస్‌లలో అన్ని సీట్లు నిండిపోయాయి. వచ్చే వారం కూడా దాదాపుగా ఎగ్జిక్యూటివ్ కోచ్‌లో సీట్లు ఫుల్ అయిపోయాయి. ఇప్పటికే వెయిటింగ్ లిస్ట్ కనిపిస్తోంది.



వందేభారత్ ఎక్స్‌ప్రెస్

ఈ వారంలో విశాఖపట్నం నుంచి వందేభారత్ ఆక్యుపెన్సీ

తేదీ	ఎగ్జిక్యూటివ్ కోచ్	చెయిర్ కార్
16.01.2023	57/57	627/627
17.01.2023	57/57	627/627
18.01.2023	57/57	627/627
19.01.2023	57/57	627/627
20.01.2023	57/57	627/627
21.01.2023	57/57	627/627

టికెట్ చార్జీలు ఇలా

చెయిర్‌కార్ టికెట్ ధర	రూ.1720
ఎగ్జిక్యూటివ్ చెయిర్ కార్	రూ.3,205

• అటు రైలు.. ఇటు పూలు!



అటు పక్క రంగుల రైలు.. ఇటు పక్క రంగు రంగుల పూలు.. నగరంలోని చావుల మదుం వద్ద ఈ సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. రైల్వే స్టేషన్ నుంచి యార్డుకు తరలించే క్రమంలో రైళ్లు చావులమదుం మీదుగా వెళ్తాయి. ఈ చావుల మదుం సమీపంలో రోడ్డు పక్కన పేపరు/ప్లాస్టిక్ పూల మొక్కలను విక్రయానికి ఉంచారు. చావుల మదుం మీదుగా వెళ్తున్న ఓ డబుల్ డెక్కర్ రైలు, దిగువన పూలు కాని పూల మొక్కలు.. ఈ రెండూ కాసేపు కనువిందు చేశాయి.

– సాక్షి ఫోటోగ్రాఫర్, విశాఖపట్నం

సన్నిధి

మంచి మాట

పని చెయ్యడం ఒక వేడుక

ఫలితం రావడానికి పనిచెయ్యడం ప్రాతిపదిక. ప్రయత్నం పని చెయ్యడానికి ప్రాతిపదిక. ఏ పరిణామానికైనా ప్రయత్నం, పని చెయ్యడం ఉండాలి. ప్రయత్నంతో పని చెయ్యడానికి మనిషి పూనుకోవాలి; ప్రయోజనకరమైన ఫలితాలను సాధించాలి.

'తప్పులు జరుగుతాయన్న భయంతో పని మొదలుపెట్టకపోవడం చెడ్డవాడి లక్షణం; అజీర్ణం అవుతుందనే భయంవల్ల భ్రాంతిలో ఎవరు భోజనాన్ని వదిలేస్తారు? అని హితోపదేశం మాట. తప్పులు జరుగుతాయని పని చెయ్యకపోవడం నేరం. పని చెయ్యడం గురించి ఓషో ఇలా చెప్పారు...

జీవితం అన్నది బాధ్యతలతో మాత్రం పని చెయ్యడమా? లేదా వేడుకలో పాలుపంచుకోవడమా? పని చెయ్యడం మాత్రమే జీవితం అయితే జీవితం ఇబ్బందికరమైనదై ఇరుకైందిగా మారిపోతుంది. బరువెక్కిన హృదయంతో జీవించాల్సి వస్తుంది. కృష్ణుడు పని చెయ్యడం మాత్రమే బాధ్యతగా జీవించినవాడు కాదు. జీవితాన్ని ఒక వేడుకగా; ఒక ఉత్సవంగా మార్చుకున్నవాడు. జీవితం ఇంట్లో చదువుకునే పాఠం కాదు. జీవితాన్ని ఒక ఉత్సవంగా మార్చుకోవడం వల్ల ఎవరూ జీవితాన్ని కోల్పోవడం లేదు. పని చెయ్యి; ఆ పనిని వేడుకలాగా మార్చెయ్యి. అప్పుడు పని కూడా ఆటపాటల సంకలనంగా మారిపోతుంది. అందువల్ల చిన్నపని కూడా నిండుగా ఉంటుంది. పని సౌందర్యాత్మకం అవుతుంది.



పనికి బానిసలుగా మారినవాళ్ల గురించి మీకు తెలిసి ఉంటుంది. పని చెయ్యడం కోసం జీవించేవాళ్లు ఉద్రిక్తతలో జీవించాల్సి వస్తుంది. పని పిచ్చివాళ్లైనవాళ్లు జీవించడాన్ని ఒక కర్మాగారంగా మార్చేసు కుంటున్నారు.'చెయ్యి లేదా చచ్చిపో' అని ఘోషిస్తున్నారు. పని చెయ్యడం తప్పితే మరో కోణం వాళ్లకు తెలీదు. వాస్తవానికి వాళ్లకు పని చెయ్యడానికి ప్రయోజనం ఏమిటో తెలియదు.

జీవితం అన్నది ఒక వేడుక. మనం పని చెయ్యడం నాట్యం చేస్తున్నట్టు ఉండాలి. పని చెయ్యడం ద్వారా వేడుకను తీసుకురావాలి. కఠినమైన జీవితాన్ని తలుచుకుంటూ ఉంటే పాడడానికీ, ఆడడానికీ, వేడుక చేసుకోవడానికీ సమయం లేకుండా పోతుంది. జీవితం ఇంటికీ, కార్యాలయానికీ మధ్యలో ఆగిపోతుంది. ఈ రెండు ప్రదేశాల మధ్యలో ముళ్లకంచెను ఏర్పరుచుకుని మానసికంగా మీరు బాధకు గురి అవుతున్నారు. ఒక రోజున జీవితంలో విశ్రాంతిని, ప్రశాంతతను అనుభవించాలని మీరు అనుకుంటారు. కానీ ఆ రోజు రాదు; పని పిచ్చివాళ్లు ఎప్పటికీ జీవితాన్ని వేడుక చేసుకోరు.

కృష్ణుడు జీవితాన్ని ఉత్సవంగా మార్చుకున్నాడు. పువ్వులు, పక్షులు, ఆకాశ తారలు జీవితాన్ని వేడుక చేసుకుంటున్నాయి. మనిషి తప్పితే జీవరాశులన్నీ జీవితాన్ని వేడుక చేసుకుంటున్నాయి. పువ్వులు ఎందుకు పూస్తూ ఉన్నాయి? అని అడగండి. తారలు ఎందుకు ఆకాశంలో తేలుతున్నాయి? అని అడగండి. గాలి ఎందుకు ఒంటరిగా వీస్తోంది? అని అడగండి. సూర్యుడికి కింద జీవిస్తున్నవి అన్నీ వేడుక చేసుకుంటున్నాయి. ప్రపంచమే వేడుక చేసుకుంటోంది. మనిషి కూడా ప్రపంచంలో భాగమే అని కృష్ణుడు చెబుతున్నాడు; వేడుక చేసుకోండి అని చెబుతున్నాడు.

ఏ పనీ చెయ్యకుండా వేడుక చేసుకోమని కృష్ణుడు చెప్పలేదు. గాలి పని చెయ్యకుండా వీచడం లేదు. తార ఒకేచోట నుంచుని వేడుక చేసుకోవడంలేదు. అది కదులుతూనే ఉంది. పువ్వులు పుయ్యడం కూడా పనే. అయితే వీటికి పని చెయ్యడం ముఖ్యం కాదు. వేడుక ముఖ్యం. వేడుక ముందు ఉంటుంది అదే సమయంలో అవి తమ బాధ్యతల్ని కూడా నెరవేరుస్తాయి. వేడుకకు కొనసాగింపే పని; జీవితమే ఒక ఉత్సవం.

పని చెయ్యడంలోని సౌందర్యాన్ని, పని చెయ్యడంవల్ల సత్ఫలితాన్ని మనిషి సొంతం చేసుకోవాలి. పని చేస్తూ మనిషి తన జీవితాన్ని ఉత్సవం చేసుకోవాలి.

– శ్రీకాంత్ జయంతి

గురువాణి

అభ్యాసానుసారిణీ విద్యా



అయినదానికీ కానిదానికీ అబద్ధం చెప్పడం అలవాటయితే... ఎన్ని పుణ్యకర్మలు చేసినా అనుభవించే యోగ్యత ఉండని స్థితికి చేరుకుంటాం. ఎంతగా నూనెపోస్తున్నా.. గాలి గట్టిగా వీస్తుంటే దీపం ఎలా వెలుగుతుంది! అందుకే పెద్దలు చెబుతారు ''సత్యానుసారిణీ లక్ష్మీ - కీర్తిః త్యాగానుసారిణీ/అభ్యాసాను సారిణీ విద్యా - బుద్ధిః కర్మానుసారిణీ''అని. సత్యం పలుకుతున్నంత కాలం లక్ష్మీదేవి కటాక్షం తనంతట తానుగా కలుగుతూనే ఉంటుంది. ప్రతిదానికీ అబద్ధం ఆడడం అంటే మన మనసు మోసం చేయడానికి అలవాటు పడిందని గుర్తు. అటువంటి మనసు ఉన్నప్పుడు సుఖాలు అనుభవించడానికి కావలసిన యోగ్యతను భగవంతుడు ఎలా అనుగ్రహిస్తాడు!

అందుకే శ్రీరామచంద్రమూర్తి అంటాడు ''సత్యమేవేశ్వరో లోకే సత్యం పద్మాశ్రితా సదా/ సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరం పదమ్.'' అంటే సత్యమే భగవంతుడని. మన సంపదలన్నీ దాన్ని ఆశ్రయించే ఉన్నాయంటున్నాడు. అయితే ఒక్కొక్కసారి ఉపద్రవం వస్తుంటుంది. అప్పుడు కూడా సత్యమే చెప్పండి ..అని శాస్త్రాలు చెప్ప లేదు. 80వేల మంది కింకరులు యుద్ధానికి వెళ్ళేముందు అశోకవనాన్ని బంధించిన హనుమ ప్రతాపాన్ని చూసి.. సీతమ్మ దగ్గరకు వెళ్ళి..'సీతమ్మా! ఇప్పటివరకు నీతో కిచకిచలాడిన వానరం అశోక వనాన్ని బంధించింది. ఆ వానరం ఎందుకొచ్చింది, నీతో ఏం మాట్లాడింది'' అని అడిగారు.

''పాముకు ఎన్ని కాళ్ళున్నాయో, ఎలా ముందుకుపోతున్నదో మరో పాముకు మాత్రమే తెలుస్తుంది. మీ రాజ్యంలోకి ఎవరు వచ్చారో, మీ వనాన్ని బంధించడానికిఎవరొచ్చారో మీకే తెలియాలి. నాకెలా తెలుస్తుంది..'' అన్నది. అంటే ఆమె అబద్ధం చెప్పినట్లేనా! కావచ్చు కానీ తన క్షేమం కోరి, తన భర్త తరపున దూతగా వచ్చిన వ్యక్తి ప్రాణానికి ప్రమాదం కలుగకుండా చూడడానికి అలా చెప్పవలసి వచ్చింది. ప్రాణ రక్షణకు, ప్రాణి రక్షణకు అలా చెప్పినప్పుడు దోషం అన్వయం కాదు. ఇటువంటి ధర్మసూక్ష్మాలను తెలుసుకొని ప్రవర్తించాలి. దీనిని సాకుగా తీసుకొని ప్రతిదానికీ అబద్ధం ఆడడం మంచిది కాదు.అబద్ధాలాడడాన్ని తప్పుగా భావించి ప్రయత్నపూర్వకంగా సత్యం పలకడం అలవాటు చేసుకోవాలి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అభ్యాసానుసారిణీ విద్యా... ఎంతగా శ్రమించి అభ్యసిస్తే చదువు అంత బాగా ఒంటపడుతుంది. అభ్యాసం అంటే స్మరిస్తూ, మననం చేస్తూ ఉండాలి. అప్పుడే విద్య మనకు కరతలామలకం అవుతుంది.

ఇస్లాం వెలుగు

సంస్కరించే సిగ్గు

కొన్నిసార్లు మానవుడు పైశాచిక ప్రభావానికి లోనై దొంగతనం, అసత్యం, తాగుడు, జూదం, వ్యభిచారంలాంటి పాపాలకు ఒడిగడుతుంటాడు. నిజానికి ఇవన్నీ మానవ నైజానికి వ్యతిరేకమైనవి. దైవగ్రంథం ఇలాంటి కార్యాలను 'మున్కర్ 'అన్న పదంతో సంబోధించింది. అంటే పాపం, లేక దుష్కార్యం అని అర్థం. వీటిని మున్కర్ తో పోల్చడమంటే, ఇవి మానవ నైజానికి సరిపడనివి, వ్యతిరేకమైనవి అన్నమాట. నైజం అంగీకరించనప్పుడు పైశాచిక స్వభావం ఆ కార్యాలను చేయమని బలవంతం చేస్తుంది. అలాంటప్పుడు దుష్కార్యాలను అసహ్యించుకునే ఏదో ఒక వస్తువు మానవ స్వభావంలో ఖచ్చితంగా ఉండాలి. అందుకే దేవుడు, 'సిగ్గు'లేక 'బిడియం' అన్న పదార్థాన్ని మానవ స్వభావంలో ప్రవేశపెట్టాడు. ధార్మిక పరిభాషలో 'సిగ్గు'(బిడియం)అంటే, ఏదైనా పాపకార్యం వైపుకు మొగ్గేమనిషి స్వయంగా తన నైజం ముందు, తన ప్రభువు ముందు వ్యక్తంచేసే దాన్ని సిగ్గు అంటారు. సిగ్గు అనబడే ఈ శక్తే మానవులను అన్నిరకాల అశ్లీలతలు, దుర్మార్గాలనుండి కాపాడుతుంది. ఒకవేళ ఎప్పుడైనా, ఏదైనా పైశాచిక ప్రలోభానికి లోనై ఏదైనా పాపకార్యానికి పాల్పడితే, 'సిగ్గు' అనేది వారి మనసును కెలుకుతూ ఉంటుంది. పశ్చాత్తాపానికి లోను చేస్తుంది. ముహమ్మద్ ప్రవక్త (స) వారి బోధనల్లో కూడా సిగ్గుబిడియాల పరిధి చాలా విస్తృతంగా ఉంది. జీవితంలోని అన్నిరంగాలనూ అది పరివేష్టించి ఉంది. అందుకని దాంపత్య జీవితానికి సంబంధించి కూడా నైతిక సంస్కరణ విషయంలో సిగ్గు, బిడియాల పాత్రే ప్రధానం.

సిగ్గు అన్న విషయం స్వభావంలో ఉన్న మనిషి ఏ విధమైన అనైతిక కార్యకలాపాలకూ పాల్పడే అవకాశం ఉండదు. సిగ్గు అనేది లేనప్పుడు విచ్చలవిడితనం పెరిగిపోతుంది. అందుకే సిగ్గులేని చేష్టల్ని అందరూ అసహ్యించుకుంటారు. 'అలా ప్రవర్తించడానికి సిగ్గులేదూ?'అన్న మాటల్ని మనం తరచూ వింటూ ఉంటాం కూడా! ప్రవక్త మహనీయుల వారు పరస్త్రీతో చాలా జాగ్రత్తగా, వినమ్రంగా, గౌరవభావంతో మాట్లాడాలని, అమ్మతో మాట్లాడుతున్నప్పుడు, తోబుట్టువుతో మాట్లాడుతున్నప్పుడు ఎలాంటి భావన ఉంటుందో అదే భావన పరాయి మహిళల విషయంలో కూడా ఉండాలని స్పష్టంగా చెప్పారు. సిగ్గు బిడియాలన్నవి స్త్రీలకైనా, పురుషులకైనా పెట్టని ఆభరణాలని, వాటిని అలవరచుకోవాలని ఆయన సెలవిచ్చారు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

సువార్త

రెండంతల ఆశీర్వాదం



పూర్వము కలిగిన దానికంటే రెండంతలు అధికముగా యెహోవా అతనికి దయచేసెను (యోబు 42:10). ఊజు దేశములో యోబు అనే భక్తుడు నివసించేవాడు. అతని ప్రవర్తన గురించి చాలా చక్కగా బైబిల్‌లో రాయబడింది. చెడుతనాన్ని విసర్జించిన వ్యక్తిగా అతని గూర్చి చేయబడిన పరిచయం విలక్షణమైనది. దేవునియందు భయభక్తులు కలిగి జీవించుటలో ఎన్నడు వెనకడుగు వేయలేదు. ఒక పక్క దేవునితో సహవాసం మరొక పక్క అనేకులకు సహాయపడే మనస్తత్వం కలిగినవాడు. ఉన్నతమైన ఆశీర్వాదాలతో కొనసాగుచున్న తన జీవితంలో అకస్మాత్తుగా శ్రమలు ఓ ప్రవాహం వలె పొర్లుకొని వచ్చాయి.

యోబు పొందిన శ్రమలు వర్ణనాతీతం. అన్ని విధాలుగా అపవాది యోబును శోధించినప్పటికి అంతిమ విజయాన్ని మాత్రం యోబు పొందుకున్నాడన్నది లేఖన సత్యం. శ్రమలు దొమ్మీగా మన మీద పడుతున్నప్పుడు వాటికి ఎలా స్పందించాలో, ఆ పరిస్థితులలో ఎలా ప్రవర్తించాలో యోబు నుండి చాలా నేర్చుకోవచ్చు. దేవుడు యోబును రెండంతలుగా ఆశీర్వదించడంలో ఆయనకున్న దివ్య ప్రణాళికల ఔన్నత్యాన్ని తెలియచేస్తుంది. కొన్ని కొన్ని సార్లు మనకు అర్థం కాని శ్రమలను సయితం దేవుడే మన జీవితాల్లో అనుమతిస్తాడు. అటువంటి సందర్భాల్లో మనం కృంగిపోకుండా ఉండగలిగితే విజయ తీరాలకు చేరుకోగలము. శ్రమల్లో మనం చాలా పాఠాలు నేర్చుకోవాలని, విశ్వాసంలో ఇంకా ఇంకా బలపడాలని దేవుడు ఆశిస్తున్నాడు. ఒక్కమాటలో చెప్పాలంటే మన శ్రమల్లోనే మన విశ్వాస జీవిత పటిష్ఠత బహిర్గతమౌతుంది.

క్రైస్తవ జీవితంలో కొన్నిసార్లు వచ్చి పడే శ్రమలు విశ్వాసిని నిలబెట్టడానికే గానీ పడగొట్టడానికి కాదు. శ్రమల్లో అందరూ విడిచిపెట్టి వెళ్లిపోవచ్చు లేదా నిందించవచ్చు గానీ దేవుడు ఆ వ్యక్తిని చూచేవాడు, బలపరిచేవాడు. మేఘాలు వర్షించాలంటే అవి బద్దలవ్వాలి. భూమిలో వేసిన గింజ ఫలించాలంటే అన్నిటికంటే ముందుగా అది పగలాలి. దానిలో ఉన్న పైపొర పగిలినప్పుడు మొక్క మొలకెత్తుతుంది. అదేవిధంగా దేవుని కరుణా కటాక్షములతో రెట్టింపు ఆశీర్వాదం, రెండంతల దీవెనలు నీ స్వంతమౌతాయి.

– డా।। జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

సినిమా

ఆగస్టులో జైలర్?



రజనీకాంత్

వెండితెరపై 'జైలర్' రాక ఏప్రిల్ నుంచి ఆగస్టుకు మారిందా? అంటే అవుననంటోంది కోలీవుడ్. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'జైలర్'. ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో రిలీజ్ చేయడానికి చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సన్నాహాలు చేస్తోందనే వార్తలు వచ్చాయి. తాజాగా ఆగస్టులో రిలీజ్ చేయాలని భావిస్తున్నారని సమాచారం. మణిరత్నం దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న 'పొన్నియిన్ సెల్వన్ పార్ట్ 2' (ఏప్రిల్ 28 విడుదల) బాక్సాఫీస్ వసూళ్లకు ఇబ్బంది లేకుండా ఉండేలా 'జైలర్' టీమ్ స్నేహపూర్వకంగా ఏప్రిల్ రిలీజ్‌ను వాయిదా వేసుకుందని కోలీవుడ్ టాక్. అయితే ఈ విషయంపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.



ప్రభాస్



మహేశ్‌బాబు



రామ్‌చరణ్



అల్లు అర్జున్



నాని



విజయ్ దేవరకొండ, సమంత


'పాన్' కథా చిత్రమ్

'బాహుబలి'తో తెలుగు సినిమాలో మార్పు వచ్చింది. అప్పటివరకూ మన తెలుగు సినిమా తెలుగు ప్రేక్షకులకు నచ్చితే చాలన్నట్లు ఉండేది. అయితే 'బాహుబలి' తర్వాత తెలుగు సినిమా పాన్ ఇండియా రేంజ్‌కి ఎదిగింది. అందుకే ప్రస్తుతం 'పాన్ కథ'లకే ఇండస్ట్రీ మొగ్గు చూపుతోంది. ఈ ఏడాది తెలుగు నుంచి దాదాపు డజనుకి పైగా 'పాన్ ఇండియా' చిత్రాలు రానున్నాయి. ఇక ఈ 'పాన్ కథా చిత్రమ్' వివరాలు తెలుసుకుందాం.

'ధమాకా', 'వాల్తేరు వీరయ్య' (రవితేజ కీ రోల్ చేశారు) చిత్రాల సక్సెస్ జోష్‌లో ఉన్న రవితేజ చేస్తున్న తాజా చిత్రాల్లో 'టైగర్ నాగేశ్వరరావు' ఒకటి. స్టూవర్టుపురం దొంగగా చెప్పుకునే టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు వంశీ. 1970 బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది. అలాగే రవితేజ హీరోగా నటిస్తున్న మరో చిత్రం 'రావణాసుర' కూడా పాన్ ఇండియా రిలీజ్ అని తెలుస్తోంది. సుధీర్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. మరోవైపు 'బాహుబలి' పాన్ ఇండియా సక్సెస్ తర్వాత ప్రభాస్ చేసే ప్రతి సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో ప్రేక్షకుల ముందుకు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది మూడు పాన్ ఇండియా చిత్రాలతో ప్రభాస్ రానున్నారు. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'సలార్', దర్శకుడు ఓం రౌత్ తెరకెక్కించిన మైథలాజికల్ ఫిల్మ్ 'ఆదిపురుష్' ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. జూన్ 16న 'ఆదిపురుష్', సెప్టెంబరు 28న 'సలార్' రిలీజ్‌కి రెడీ అవుతున్నాయి. ఈ సినిమాలే కాకుండా ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో 'రాజా డీలక్స్' (అధికారిక ప్రకటన రావాల్సి ఉంది) అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం కూడా ఈ ఏడాదే పాన్ ఇండియా రిలీజ్‌గా థియేటర్స్‌లోకి వస్తుందనే టాక్ వినిపిస్తోంది. ఇక హీరో మహేశ్‌బాబు తాజా చిత్రం పాన్ ఇండియా రిలీజ్ కానుంది. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా ఇది. ఫ్యామిలీ అండ్ ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఆగస్టు 11న ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. ఇక పవన్ కల్యాణ్ నుంచి కూడా ఓ పాన్ ఇండియా చిత్రం రానుంది. క్రిష్ దర్శకత్వంలో పవన్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ ఫిల్మ్ 'హరిహర వీరమల్లు'. 17వ శతాబ్దం నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం వేసవిలో రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. మరోవైపు శంకర్ దర్శకత్వంలో హీరో రామ్‌చరణ్ ఓ పాన్ ఇండియా మూవీ చేస్తున్నారు. రాజకీయాలు, ఐఏఎస్ ఆఫీసర్ల నేపథ్యంతో కూడిన ఈ యాక్షన్ ఫిల్మ్ ఈ ఏడాదే థియేటర్స్‌లోకి రానుంది. ఇంకోవైపు ఆల్రెడీ 'పుష్ప: ది రైజ్'తో పాన్ ఇండియా సక్సెస్ కొట్టిన అల్లు అర్జున్ ఇదే సినిమాకు కొనసాగింపుగా వస్తున్న 'పుష్ప: ది రూల్' సినిమాతో ప్రస్తుతం బిజీగా ఉన్నారు. దర్శకుడు సుకుమార్ తెరకెక్కిస్తున్న 'పుష్ప: ది రూల్' చిత్రం ఈ ఏడాది చివర్లో రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. ఇక శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని హీరోగా నటించిన విలేజ్ బ్యాక్‌డ్రాప్ మాస్ ఫిల్మ్ 'దసరా' కూడా పాన్ లిస్టులో ఉంది. ఈ చిత్రం మార్చి 30న రిలీజ్ కానుంది. 'శాకుంతలం'తో సమంత కూడా పాన్ ఇండియా జాబితాలో చేరారు. దేవ్ మోహన్ ఓ లీడ్ రోల్ చేసిన ఈ మైథలాజికల్ లవ్‌స్టోరీకి గుణశేఖర్ దర్శకుడు. ఈ చిత్రం ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఇంకోవైపు హీరో రామ్, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో పాన్ ఇండియా స్థాయిలో ఓ హై ఓల్టేజ్ యాక్షన్ ఫిల్మ్ రూపొందుతోంది. అలాగే అఖిల్ హీరోగా సురేందర్‌రెడ్డి తెరకెక్కిస్తున్న స్టైలిష్ యాక్షన్ మూవీ 'ఏజెంట్' వేసవి రిలీజ్‌కి రెడీ అవుతోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్‌దేవర కొండ-సమంతల పాన్ ఇండియా ప్రేమకథా చిత్రం 'ఖుషి' ఈ ఏడాది వెండితెరపై ప్రేమ కురిపించనుంది. అలాగే రంజిత్ జయకొడి దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా చేసిన గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్ 'మైఖేల్' వచ్చే నెల 3న రిలీజ్ కానుంది. సాయిధరమ్‌తేజ్ హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో రూపొందిన మిస్టిక్ థ్రిల్లర్ 'విరూపాక్ష' ఏప్రిల్ 21న విడుదల కానుంది. వరుణ్ తేజ్ కూడా పాన్ క్లబ్‌లో చేరారు. తెలుగు, హిందీ భాషల్లో శక్తీకాంత్ దర్శకత్వంలో వరుణ్ ఓ పాన్ మూవీ కమిట్ అయ్యారు. ఇక 'గూఢచారి'కి సీక్వెల్‌గా అడివి శేష్ చేస్తున్న 'గూఢచారి 2' కూడా పాన్ ఇండియా రిలీజే. ఇంకా గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో నిఖిల్ చేసిన స్పై థ్రిల్లర్ 'స్పై', తేజా సజ్జా హీరోగా దర్శకుడు ప్రశాంత్ వర్మ తీసిన అడ్వెంచరస్ మైథలాజికల్ ఫిల్మ్ 'హను మాన్' (మే 12న రిలీజ్) తదితర చిత్రాలు పాన్ ఇండియా రిలీజ్‌లుగా ఈ ఏడాదే రానున్నాయి.



అఖిల్



అడివి శేష్



సమంత

మంచి కథకు పాటలు అవసరంలేదు - మహేశ్



సుధీర్‌బాబు హీరోగా, శ్రీకాంత్, 'ప్రేమిస్తే' ఫేమ్ భరత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హంట్'. ఎస్. మహేశ్ దర్శకత్వంలో వి. ఆనంద ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఎస్. మహేశ్ మాట్లాడుతూ– ''ఓ యాక్సిడెంట్‌లో గతం మర్చిపోయే ఓ పోలీసాఫీసర్ తన గురించి ఎలా తెలుసుకున్నాడు? తన లైఫ్‌లో జరిగిన ఓ చేదు ఘటన తాలూకు మిస్టరీని ఎలా ఛేదించాడు? అన్నదే ఈ చిత్రకథ. మంచి కథ కుదిరితే సినిమాలో కమర్షియల్ సాంగ్స్ అవసరం ఉండదు. 'హంట్'లో అలాంటి పాటలు ఉండవు. అయితే సందర్భోచితంగా సాగే ఒకే ఒక్క పాట ఉంటుంది. అలాగే హీరోయిన్ క్యారెక్టర్ లేదు. ఈ మధ్య వచ్చిన 'ఖైదీ', 'విక్రమ్' సినిమాల్లో హీరోయిన్ పాత్ర, కమర్షియల్ పాటలు లేకపోయినా ప్రేక్షకులు ఆదరించారు. నేను 'హంట్' చేయడానికి ఆ సినిమాలు కాన్ఫిడెన్స్ ఇచ్చాయి. ఇక ఈ సినిమాలోని ఆరు యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు ఎమోషన్ సీన్స్ కూడా ఉన్నాయి. క్లైమాక్స్ చూశాక ఓ మంచి ఫీలింగ్‌తో ప్రేక్షకులు థియేటర్ నుంచి బయటకు వెళ్తారు'' అని అన్నారు.


సిక్స్ టీన్స్‌కి సీక్వెల్‌గా...



సందీప్

సందీప్ అశ్వా, రవీంద్ర నాథ్ ఠాకూర్, తరుణ్ సాగర్, విశ్వేష్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రిస్క్'. '6 టీన్స్' (2001)కు సీక్వెల్‌గా ఈ చిత్రాన్ని ఘంటాడి కృష్ణ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను దర్శకుడు నక్కిన త్రినాథరావు విడుదల చేశారు. ''6టీన్స్'లోని 'దేవుడు వరమందిస్తే..' పాట తెలుగు ప్రేక్షకులకు నన్ను మ్యూజిక్ డైరెక్టర్‌గా పరిచయం చేసింది. ఇక అక్రమ మార్గంలో డబ్బు సంపాదించుకోవాలనుకునే నలుగురు కుర్రాళ్ల కథతో 'రిస్క్' తీశా. ఈ చిత్రంలో 8 పాటలు, బిట్ సాంగ్ ఉన్నాయి'' అని ఘంటాడి కృష్ణ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఘంటాడి కృష్ణ.

ఓ సాథియా...



ఆర్యన్ గౌర, మిస్తీ చక్రవర్తి

'జీ జాంబీ' ఫేమ్ ఆర్యన్ గౌర, మిస్తీ చక్రవర్తి జంటగా నటించిన చిత్రం 'ఓ సాథియా'. తన్విక-జశ్విక క్రియేషన్స్ పతాకంపై దివ్య భావన దర్శకత్వంలో చందన కట్టా నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాలోని టైటిల్ సాంగ్ 'ఓ సాథియా'ను ప్రముఖ సంగీతదర్శకుడు మణిశర్మ విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సంగీత దర్శకుడు విన్ను సారథ్యంలో జావేద్ అలీ పాడిన ఈ పాటకు భాస్కర్‌భట్ల సాహిత్యం అందించారు. ''ప్యూర్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందించాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు కెమెరా: ఈజే వేణు.



టాప్ సీడ్‌పై గెలిచి... విజేతగా నిలిచి...

ఇండియా ఓపెన్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రపంచ నాలుగో ర్యాంకర్ ఆన్ సె యంగ్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. మహిళల సింగిల్స్ విభాగంలో ఆమె చాంపియన్‌గా నిలిచింది. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన ఫైనల్లో ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా) 15–21, 21–16, 21–12తో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ అకానె యామగుచి (జపాన్)పై గెలిచింది. ఆన్ సె యంగ్ కెరీర్‌లో ఇది 12వ అంతర్జాతీయ టైటిల్. విజేతగా నిలిచిన ఆన్ సె యంగ్‌కు 59,500 డాలర్ల (రూ. 48 లక్షల 17 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

అక్సెల్‌సన్‌కు కున్లావుత్ షాక్

ఇండియా ఓపెన్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్, టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అక్సెల్‌సన్ (డెన్మార్క్)కు చుక్కెదురైంది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ ఆరో ర్యాంకర్ కున్లావుత్ వితిడ్‌సర్న్ (థాయ్‌లాండ్) 22–20, 10–21, 21–12తో అక్సెల్‌సన్‌ను తన కెరీర్‌లో తొలిసారి ఓడించి విజేతగా నిలిచాడు. కున్లావుత్‌కు 59,500 డాలర్ల (రూ. 48 లక్షల 17 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.



హతవిధి!

'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో భారత్ బోల్తా

'షూటౌట్'లో 4-5తో న్యూజిలాండ్ చేతిలో ఓటమి

టీమిండియా పతకం ఆశలు ఆవిరి

ఇక 9 నుంచి 16 స్థానాల కోసం భారత్ పోరు

మన హాకీ ఘనం... కానీ ఇది గతం! మరిప్పుడు... సొంతగడ్డపై ఆడుతున్నా... వేలాదిమంది ప్రేక్షకులు మైదానంలోకి వచ్చి మద్దతిస్తున్నా... భారత జట్టు పేలవమైన ప్రదర్శనతో మళ్లీ నిరాశపరిచింది. 2018 ప్రపంచకప్ హాకీలో నేరుగా క్వార్టర్ ఫైనల్ చేరిన టీమిండియా... ఈసారి 'క్రాస్ ఓవర్'తోనే సరిపెట్టుకుంది. క్వార్టర్ ఫైనల్లో బెర్త్ కోసం న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో భారత్ అన్ని రంగాల్లో విఫలమై ఓడిపోయింది. దాంతో ఈ మెగా ఈవెంట్ చరిత్రలో భారత పతక నిరీక్షణ మరో నాలుగేళ్లు కొనసాగనుంది. 1975 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత్ ఆ తర్వాత ఏనాడూ సెమీఫైనల్ దశకు చేరుకోలేకపోయింది.

భువనేశ్వర్: ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్‌లో భారత పతకం కథ కంచికి చేరింది. కళింగ స్టేడియంలో ఆదివారం జరిగిన 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో భారత్ 'షూటౌట్'లో 4–5తో న్యూజిలాండ్ చేతిలో పరాజయం చవిచూసింది. దీంతో పతకం బరిలో లేని భారత్ ఇప్పుడు 9 నుంచి 16 స్థానాల కోసం వర్గీకరణ మ్యాచ్‌లు ఆడనుంది. ఈనెల 26న జపాన్‌తో భారత్ తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే 9 నుంచి 12 స్థానాల కోసం 28న రెండో మ్యాచ్ ఆడుతుంది. జపాన్ చేతిలో భారత్ ఓడిపోతే 13 నుంచి 16 స్థానాల కోసం ఆడుతుంది.

న్యూజిలాండ్‌తో కీలకమైన సమయంలో రక్షణ శ్రేణి నిర్లక్ష్యం భారత జట్టు కొంపముంచింది. మూడో క్వార్టర్ వరకు 3–2తో ఆధిక్యంలో ఉన్న భారత్ నాలుగో క్వార్టర్‌లో పెనాల్టీ కార్నర్ అవకాశాలు ఎన్నో వచ్చినా... ఒక గోల్ చేయకపోగా... ప్రత్యర్థి గోల్‌నూ అడ్డుకోలేకపోయింది. దీంతో నిర్ణీత సమయం (నాలుగు క్వార్టర్లు) ముగిసే సమయానికి 3–3తో మ్యాచ్ 'డ్రా' అయ్యింది. టీమిండియా జట్టులో లలిత్ కుమార్ ఉపాధ్యాయ్ (17వ ని.లో), సుఖ్‌జీత్ సింగ్ (25వ ని.లో), వరుణ్ కుమార్ (41వ ని.లో) తలా ఒక గోల్ చేశారు. న్యూజిలాండ్ తరఫున సామ్ లేన్ (29వ ని.లో), కేన్ రసెల్ (44వ ని.లో), సీన్ ఫిండ్లే (50వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. మ్యాచ్ మొత్తంలో భారత్‌కు 10 పెనాల్టీ కార్నర్‌లు రాగా రెండింటిని సద్వినియోగం చేసుకొని మిగితా ఎనిమిదింటిని వృథా చేసుకుంది. న్యూజిలాండ్ జట్టుకు లభించిన రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచింది. ఆట 54వ నిమిషంలో న్యూజిలాండ్ ప్లేయర్ నిక్ రాస్‌కు ఎల్లో కార్డు లభించడంతో ఆ జట్టు చివరి ఆరు నిమిషాలు పది మంది ఆటగాళ్లతోనే ఆడింది. ఈ అవకాశాన్నీ భారత్ సద్వినియోగం చేసుకోలేకపోయింది.



న్యూజిలాండ్ ఆటగాళ్ల సంబరం

హోరాహోరీ షూటౌట్...

నిర్ణీత సమయంలో రెండు జట్లు సమంగా నిలువడంతో ఫలితం తేలడానికి 'షూటౌట్' నిర్వహించారు. 'షూటౌట్'లో తొలి ఐదు షాట్‌ల తర్వాత రెండు జట్లు 3–3తో సమంగా నిలిచాయి. దాంతో 'సడెన్ డెత్' అనివార్యమైంది. 'సడెన్ డెత్' నిబంధనల ప్రకారం ఒక జట్టు ప్లేయర్ గోల్ చేసి.. ఆ వెంటనే మరో జట్టు ప్లేయర్ విఫలమైనా... ఒక జట్టు ప్లేయర్ విఫలమై... ఆ వెంటనే మరో జట్టు ప్లేయర్ సఫలమైనా మ్యాచ్ ముగుస్తుంది. 'సడెన్ డెత్' తొలి షాట్‌లో న్యూజిలాండ్ ప్లేయర్ నిక్ వుడ్స్ విఫలమయ్యాడు. ఫలితంగా తదుపరి షాట్‌లో గోల్ చేస్తే భారత్‌కు విజయం దక్కేది. కానీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ తడబడ్డాడు. రెండో షాట్‌లో రెండు జట్ల ఆటగాళ్లు సఫలమయ్యారు. మూడో షాట్‌లో కివీస్ ప్లేయర్ హేడెన్ ఫిలిప్స్ విఫలం కావడంతో గెలిచేందుకు భారత్‌కు రెండో అవకాశం దక్కింది. అయితే మూడో షాట్‌లో భారత ప్లేయర్ సుఖ్‌జీత్ విఫలమయ్యాడు. నాలుగో షాట్‌లో కివీస్ ఆటగాడు సామ్ లేన్ గోల్ చేయగా... భారత ప్లేయర్ షంషేర్ సింగ్ గోల్ చేయకపోవడంతో న్యూజిలాండ్ విజయం ఖరారైంది. అంతకుముందు మరో 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో స్పెయిన్ 'షూటౌట్'లో 4–3తో మలేసియాను ఓడించింది. ఈనెల 24న జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో ఆస్ట్రేలియాతో స్పెయిన్; బెల్జియంతో న్యూజిలాండ్ ఆడతాయి.



నిరాశలో భారత ఆటగాళ్లు

'షూటౌట్' సాగిందిలా...

భారత్		స్కోరు		న్యూజిలాండ్
హర్మన్‌ప్రీత్ సింగ్	✔	1-1	✔	నిక్ వుడ్స్
రాజ్‌కుమార్	✔	2-2	✔	సీన్ ఫిండ్లే
అభిషేక్	✘	2-3	✔	హేడెన్ ఫిలిప్స్
షంషేర్ సింగ్	✘	2-3	✘	సామ్ లేన్
సుఖ్‌జీత్ సింగ్	✔	3-3	✘	సామ్ హిహా
హర్మన్‌ప్రీత్ సింగ్	✘	3-3	✘	నిక్ వుడ్స్
రాజ్‌కుమార్	✔	4-4	✔	సీన్ ఫిండ్లే
సుఖ్‌జీత్ సింగ్	✘	4-4	✘	హేడెన్ ఫిలిప్స్
షంషేర్ సింగ్	✘	4-5	✔	సామ్ లేన్

స్వియాటెక్ అవుట్

- ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన ప్రపంచ నంబర్‌వన్
- టాప్ సీడ్‌కు షాక్ ఇచ్చిన రిబాకినా
- ఏడో సీడ్ కోకో గాఫ్ కూడా ఓటమి



స్వియాటెక్



రిబాకినా

మెల్‌బోర్న్: గత ఏడాది ఎనిమిది టైటిల్స్ నెగ్గి.. వరుసగా 37 మ్యాచ్‌ల్లో విజయం సాధించి... స్థిరంగా టాప్ ర్యాంక్‌లో కొనసాగిన పోలాండ్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ కలిసి రాలేదు. తొలి మూడు రౌండ్ మ్యాచ్‌ల్లో వరుస సెట్‌లలో నెగ్గిన ఆమెకు ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 25వ ర్యాంకర్, కజకిస్తాన్ అమ్మాయి ఎలీనా రిబాకినా క్లెం వేసింది. గత సంవత్సరం వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించి వార్తల్లో నిలిచిన రిబాకినా ఆద్యంతం నిలకడగా రాణించి ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 6–4, 6–4తో స్వియాటెక్‌ను ఓడించి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తొలిసారి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. గంటా 29 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో 22వ సీడ్ రిబాకినా ఆరు ఏస్‌లు సంధించింది. 24 విన్నర్స్ కొట్టిన ఆమె స్వియాటెక్ సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.

ఒస్టాపెంకో తొలిసారి...

మరోవైపు ఏడో సీడ్, అమెరికా టీనేజర్ కోకో గాఫ్ కథ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. 17వ ర్యాంకర్ ఒస్టాపెంకో (లాత్వియా) 7–5, 6–3తో కోకో గాఫ్‌ను ఓడించింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) 7–5, 6–2తో క్రిచికోవా (చెక్ రిపబ్లిక్)పై, అజరెంకా (బెలారస్) 4–6, 6–1, 6–4తో లిన్ జు (చైనా)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

పురుషుల సింగిల్స్‌లో సెబాస్టియన్ కోర్డా (అమెరికా) 3–6, 6–3, 6–2, 1–6, 7–6 (10/7)తో పదో సీడ్ హుర్కాజ్ (పోలాండ్)ను.. అన్‌సీడెడ్ జీరీ లెహెచ్కా (చెక్ రిపబ్లిక్) 4–6, 6–3, 7–6 (7/2), 7–6 (7/3)తో ఆరో సీడ్ అలియాసిమ్ (కెనడా)ను ఓడించి తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కించుకున్నారు. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) 6–4, 6–4, 3–6, 4–6, 6–3తో జానిక్ సినెర్ (ఇటలీ)పై, 18వ సీడ్ ఖచనోవ్ (రష్యా) 6–0, 6–0, 7–6 (7/4)తో నిషియోక (జపాన్)పై గెలిచారు.

సానియా జోడీ ఓటమి

మహిళల డబుల్స్ రెండో రౌండ్‌లో సానియా మీర్జా (భారత్)-డానిలినా (కజకిస్తాన్) ద్వయం 4–6, 6–4, 2–6తో కలినినా (ఉక్రెయిన్)-ఉత్కావంక్ (బెల్జియం) జోడీ చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో జీవన్-శ్రీరామ్ బాలాజీ (భారత్) ద్వయం 4–6, 4–6తో జెరెమి చార్డీ-ఫాబ్రిస్ మార్టిన్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడింది.

సెమీస్ రేసులో భారత్



పార్శవి

పోష్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా): అండర్–19 ప్రపంచకప్ మహిళల టి20 టోర్నీలో సెమీఫైనల్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత జట్టు అదరగొట్టింది. శ్రీలంక జట్టుతో ఆదివారం జరిగిన 'సూపర్ సిక్స్' గ్రూప్–1 మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. లెగ్ స్పిన్నర్ పార్శవి చోప్రా 5 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టడంతో... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 9 వికెట్లకు 59 పరుగులు సాధించింది. మన్నత్ కశ్యప్ 2 వికెట్లు తీయగా... టిటాస్ సాధు, అర్చన దేవిలకు ఒక్కో వికెట్ దక్కింది. అనంతరం భారత్ 7.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసి విజయం సాధించింది. షఫాలీ వర్మ (15; 1 ఫోర్, 1 సిక్స్), శ్వేత సెహ్రావత్ (13; 2 ఫోర్లు), సౌమ్య తివారి (28 నాటౌట్; 5 ఫోర్లు) రాణించారు. ఈ మ్యాచ్‌తో భారత్ 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లు పూర్తయ్యాయి. భారత్ 6 పాయింట్లతో ప్రస్తుతం గ్రూప్–1లో అగ్రస్థానంలో ఉంది. ఇదే గ్రూప్‌లోని ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా బంగ్లాదేశ్ జట్లు నాలుగు పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాయి. ఈ మూడు జట్లకు ఒక్కో మ్యాచ్ మిగిలి ఉంది. ఈ మూడు జట్ల మ్యాచ్‌లు ముగిశాకే 25న భారత్‌కు సెమీఫైనల్ బెర్త్ ఖరారయ్యేది తేలుతుంది. మరోవైపు 'సూపర్ సిక్స్' గ్రూప్–2 నుంచి న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లు సెమీఫైనల్ చేరుకున్నాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ హైకోర్టులో అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులు

తెలంగాణ హైకోర్టులో అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** బీఎల్ఐఎస్సీ, ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతో పాటు లైబ్రరీ నిర్వహణలో కంప్యూటర్ పరిజ్ఞానంపై పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 11.01.2023 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఆదిమ తెగలు /బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.38,890 నుంచి రూ.1,12,510 చెల్లిస్తారు.
- **పరీక్షా విధానం:** సీబీటీ పరీక్ష(90 మార్కులు), ఇంటర్వ్యూ(10 మార్కులు). పరీక్షా సమయం 120 నిమిషాలు.
- **ఎంపిక విధానం:** పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.02.2023.
- **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 20.02.2023.
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** మార్చి 2023.
- **వెబ్‌సైట్:** tshc.gov.in

తెలంగాణ హైకోర్టులో యూడీ స్టెనో పోస్టులు

తెలంగాణ హైకోర్టులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన యూడీ స్టెనో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(ఆర్ట్స్/సైన్స్/లా)తో పాటు ఇంగ్లిష్ షార్ట్‌హ్యాండ్, ఇంగ్లిష్ హయ్యర్ టైప్‌రైటింగ్ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 11.01.2023 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఆదిమ తెగలు /బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.32,810 నుంచి రూ.96,890 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.02.2023.
- **హాల్‌టికెట్‌ల డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 20.02.2023.
- **పరీక్ష తేది:** మార్చి 2023.
- **వెబ్‌సైట్:** tshc.gov.in

తెలంగాణ హైకోర్టులో 10 అసిస్టెంట్ పోస్టులు

తెలంగాణ హైకోర్టులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(ఆర్ట్స్/సైన్స్/లా) లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 11.01.2023 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఆదిమ తెగలు /బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.24,280 నుంచి రూ.72,850 చెల్లిస్తారు.
- **పరీక్షా విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)లో 90(జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లిష్) ప్రశ్నలుంటాయి. పరీక్షా సమయం 120 నిమిషాలు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.02.2023.
- **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 20.02.2023.
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** మార్చి 2023.
- **వెబ్‌సైట్:** tshc.gov.in

తెలంగాణ హైకోర్టులో 45 సిస్టమ్ అసిస్టెంట్ పోస్టులు

తెలంగాణ హైకోర్టులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన సిస్టమ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 45
- **అర్హత:** కనీసం 55% మార్కులతో బీఈ, బీటెక్ (సీఎస్ఈ/ఐటీ/ఈసీఈ) /డిప్లొమా (ఎలక్ట్రానిక్స్), బీఎస్సీ(ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్స్/ఐటీ)లో ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్, ఆపరేటింగ్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్‌పై పరిజ్ఞానం అవసరం.
- **వయసు:** 11.01.2023 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఆదిమ తెగలు /బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు రూ.24,280 నుంచి రూ.72,850 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** పరీక్ష , రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)లో 90 (కంప్యూటర్ నాలెడ్జ్, జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లిష్) ప్రశ్నలుంటాయి. ప్రశ్నకు ఒక మార్కు కేటాయించారు. పరీక్ష సమయం 120 నిమిషాలు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.02.2023.
- **హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 20.02.2023
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** మార్చి 2023.
- **వెబ్‌సైట్:** tshc.gov.in

ప్రసిద్ధ సంస్థల్లో పీజీకి.. సీయూఈటీ

» పరీక్ష తేదీలు వెల్లడించిన ఎన్‌టీఏ
» జూన్ 1 నుంచి 10వ తేదీ వరకూ పరీక్షలు
» మార్చిలో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం!

దేశవ్యాప్తంగా పేరున్న విద్యాసంస్థల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ) కోర్సుల్లో చేరాలని చాలా మంది విద్యార్థులు కోరుకుంటారు. ఇలాంటి వారికోసం కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) ఫర్ పీజీ(పోస్ట్‌గ్రాడ్యుయేషన్) పరీక్షను నిర్వహిస్తున్నారు. ఈ ప్రవేశ పరీక్ష ద్వారా జాతీయస్థాయిలో ప్రసిద్ధ విద్యాసంస్థల్లో, కేంద్రీయ విశ్వవిద్యాలయాలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులను చదవడానికి వీలవుతుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పరీక్ష నిర్వహణ బాధ్యతలను చూస్తోంది. ఇటీవల సీయూఈటీ పీజీ-2023 పరీక్ష తేదీలను ఎన్‌టీఏ వెల్లడించింది. ఈ నేపథ్యంలో..ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం...

గత ఏడాదికి ముందు జాతీయస్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశం పొందాలంటే.. అనేక వ్యయప్రయాసలు. అనేక ఎంట్రెన్స్ టెస్టులు రాయాల్సి వచ్చేది. 2022 నుంచి అన్ని సెంట్రల్ యూనివర్సిటీల్లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉమ్మడి పరీక్ష నిర్వహిస్తున్నారు. ఒకే ఒక్క పరీక్ష సీయూఈటీ-పీజీ ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ), బెనారస్ హిందూ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ.. ఇలా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో చదవడానికి సీయూఈటీ-పీజీలో సాధించిన స్కోర్ ప్రామాణికంగా నిలుస్తోంది. 2023లో సీయూఈటీ పీజీ ద్వారా.. 60పైకి యూనివర్సిటీల్లో ప్రవేశం లభించే అవకాశముంది.



సీయూఈటీ పీజీ 2023

కోర్సులు

ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎల్ఎల్ఎం వంటి పీజీ స్థాయి కోర్సుల్లో సీయూఈటీ పీజీలో ప్రతిభ ఆధారంగా అడ్మిషన్ లభిస్తుంది. ఎంఏ/ఎమ్మెస్సీ కోర్సులకు సంబంధించి యోగ, ఇంగ్లిష్, మ్యూజిక్, నానోసైన్స్, స్పోర్ట్స్ సైకాలజీ, బయాలజీ, జాగ్రఫీ, ఎలక్ట్రానిక్స్ డిజైన్ అండ్ టెక్నాలజీ, స్టాటిస్టిక్స్, ఫైన్ ఆర్ట్స్, ఆంత్రోపాలజీ, ఎకనామిక్స్, మ్యూజియాలజీ, ఓషన్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్సెస్, పబ్లిక్ హెల్త్, కంప్యూటర్ అప్లికేషన్స్, జియోఇన్ఫర్మాటిక్స్, క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్ సైన్స్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, ఎకనామిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్‌సైన్స్, తెలుగు, హిందీ తదితర కోర్సులను ఆయా సంస్థలు అందిస్తున్నాయి. పలు యూనివర్సిటీలు ఎల్ఎల్ఎం, ఎంటెక్, ఎంఈడీ, ఎంఏ/ఎమ్మెస్సీ బీఎడ్ కోర్సులను కూడా ఆఫర్ చేస్తున్నాయి.

అర్హతలు

ఎంపిక చేసుకునే కోర్సును బట్టి బ్యాచిలర్ డిగ్రీ ఉండాలి. పలు ప్రత్యేక కోర్సులకు డిగ్రీలో సంబంధిత కోర్సును చదివి ఉండాలి. ఇప్పటికే డిగ్రీ పూర్తిచేసుకున్న వారు, ప్రస్తుతం ఆఖరు సంవత్సరం చదువుతున్న వారు కూడా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష ఇలా

- కంప్యూటర్ బేస్డ్ విధానంలో ఆన్‌లైన్‌లో ఈ పరీక్షను నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు.
- మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు. పార్ట్-ఎ, పార్ట్-బి అనే రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్-ఎలో 25, పార్ట్-బిలో 75 ప్రశ్నలు వస్తాయి. పార్ట్-ఎలో జనరల్, పార్ట్-బిలో సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు ఉంటాయి. తప్పు జవాబుకు ఒక మార్కును తగ్గిస్తారు.
- రెండు షిఫ్టుల్లో పరీక్ష జరుగుతుంది. షిఫ్ట్-1లో 10 నుంచి 12 గంటల వరకు, షిఫ్ట్-2ను 3 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు.
- భాష, సాహిత్యానికి సంబంధించిన పేపర్లు మినహా మిగత అన్ని పేపర్లకు ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఉంటుంది.
- పేపర్ కోడ్ 38, పేపర్ కోడ్ 40లో మాత్రం రెండు పార్ట్‌లుగా కాకుండా మొత్తం 100 ప్రశ్నలకు ఉంటుంది. ఇందులో లాంగ్వేజ్ కాంప్రహెన్షన్/వెర్బల్ ఎబిలిటీ, మ్యాథమేటిక్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలను అడుగుతారు.
- ఎంఏ లేదా ఎమ్మెస్సీ కోర్సులకు సంబంధించి పార్ట్-ఎలో ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, మ్యాథమెటికల్ ఆప్టిట్యూడ్, అనలిటికల్ స్కిల్స్‌పై ప్రశ్నలు వస్తాయి. ఆయా సబ్జెక్టుల వారీగా పార్ట్-బి సిలబస్ వివరాలు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. డిగ్రీ పాఠ్యాంశాల నుంచే పార్ట్-బి ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి సంబంధిత పాఠ్యంశాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి.

పరీక్ష కేంద్రాలు

రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ప్రధాన నగరాల్లో పరీక్ష కేంద్రాలున్నాయి. ఏపీలో 29, తెలంగాణలో 23 చోట్ల ఈ పరీక్షను నిర్వహిస్తున్నారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తు ప్రారంభం:** మార్చి రెండో వారంలో
- **పరీక్షతేదీ:** 2023 జూన్ మొదటి వారంలో
- **వెబ్‌సైట్:** https://cuet.nta.nic.in/

ఒడిషా కోల్‌ఫీల్డ్‌లో 295 ఉద్యోగాలు

పీఎస్‌యూ జాబ్స్

ఒడిషాలోని కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన మహానది కోల్‌ఫీల్డ్స్ పలు ఉద్యోగాల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా మొత్తం 295 జూనియర్ ఓవర్‌మ్యాన్, మైనింగ్ సర్దార్, సర్వేయర్ పోస్టులను భర్తీ చేయనుంది. డిప్లొమా, బీటెక్ మైనింగ్ ఇంజనీరింగ్‌తో ఈ ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చు. రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు గల ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి.

- **పోస్టుల సంఖ్య:** 295(జూనియర్ ఓవర్‌మ్యాన్-82, మైనింగ్ సర్దార్-145, సర్వేయర్-68).

అర్హతలు

- జూనియర్ ఓవర్‌మ్యాన్ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు మూడేళ్ల మైనింగ్ ఇంజనీరింగ్ డిప్లొమా/మైనింగ్ ఇంజనీరింగ్ డిగ్రీ/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఓపెన్ కాస్ట్, అండర్‌గ్రౌండ్ మైన్స్‌లో పనిచేసినట్లుగా ఓవర్‌మ్యాన్ కాంపిటెన్సీ సర్టిఫికేట్, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికేట్, గ్యాస్ టెస్టింగ్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
- మైనింగ్ సర్దార్ పోస్టులకు 10+2 లేదా తత్సమాన విద్యార్హతలో ఉత్తీర్ణత ఉండాలి. లేదా మూడేళ్ల మైనింగ్ ఇంజనీరింగ్ డిప్లొమా/మైనింగ్ ఇంజనీరింగ్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణలై ఉండాలి. ఓపెన్‌కాస్ట్, అండర్‌గ్రౌండ్ మైన్స్‌లో పనిచేసినట్లుగా మైనింగ్ సర్దార్‌షిప్ సర్టిఫికేట్ ఆఫ్ కాంపిటెన్సీ, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికేట్, గ్యాస్ టెస్టింగ్ సర్టిఫికేట్ ఉండాలి.
- సర్వేయర్ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు 10+2 లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. లేదా మైనింగ్/మైన్ సర్వేయింగ్ ఇంజనీరింగ్‌లో మూడేళ్ల డిప్లొమా/తత్సమాన పరీక్ష పాసవ్వాలి. ఓపెన్‌కాస్ట్, అండర్‌గ్రౌండ్ మైన్స్‌లో పనిచేసినట్టుగా సర్వే సర్టిఫికేట్ ఆఫ్ కాంపిటెన్సీ ఉండాలి.

వయసు

23.01.2023 నాటికి 18–30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఓబీసీ(ఎన్‌సీఎల్) అభ్యర్థులకు 3 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనాలు

ఎంపికైన జూనియర్ ఓవర్‌మ్యాన్, మైనింగ్ సర్దార్ ఉద్యోగులు ప్రతినెల రూ.31,852 మూలవేతనంగా పొందుతారు.అలాగే సర్వేయర్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.34,391 వేతనంగా లభిస్తుంది.

ఎంపిక ఇలా

ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-సీబీటీ) ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూ ఉండదు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ అనంతరం అభ్యర్థులను తుది ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష

- ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో నిర్వహించే ఈ పరీక్షలో ఎ, బి అనే రెండు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-ఎలో జనరల్ అవేర్‌నెస్/ఆప్టిట్యూడ్ ప్రశ్నలు 20 ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. సెక్షన్-బిలో టెక్నికల్ నాలెడ్జ్‌కు సంబంధించి 80 ప్రశ్నలకు ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు ఇస్తారు. రుణాత్మక మార్కులు లేవు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్

సీబీటీలో సాధించిన మార్కుల ఆధారంగా, రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకొని 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను డాక్యుమెంట్ వెరిఫికేషన్‌కు పిలుస్తారు. సీబీటీలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను తుది ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. కోల్‌ఇండియా దాని అనుబంధ సంస్థల్లో పనిచేసే అభ్యర్థులు నో అబ్జెక్షన్ సర్టిఫికేషన్ సమర్పించాలి. వెరిఫికేషన్ వేదికను వెబ్‌సైట్ ద్వారా ప్రకటిస్తారు.

పోస్టింగ్

- ఎంపికైన అభ్యర్థులు కోల్‌ఫీల్డ్స్/కోల్ ఇండియా లిమిటెడ్‌లోని ఏదైనా గనులలో లేదా ప్రాజెక్టులలో నియమించే అవకాశం ఉంటుంది.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 23.01.2023
- **వెబ్‌సైట్:** www.mahanadicoal.in

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
23-1-2023

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
237	80
60,622	18,028

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ		
నాస్‌డాక్	11,140	△ 228
డోజోన్స్	33,375	△ 331
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,771	△ 23
డాక్స్	15,034	△ 113
సాంఘై	3,265	△ 25
నికాయ్	26,554	△ 148

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.45	82.12
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	86.55	89.59
€	యూరో	ఒకటి	98.98	102.32
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	62.11	64.16
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.14	57.53
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.46	62.45
SAR	సౌదీ రియాల్	ఒకటి	20.64	22.31
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.19	22.98
¥	చైనా యువాన్	ఒకటి	10.84	12.92

ముందే రిటైర్మెంటా..!



20 ప్లస్‌లో ఆరంభిస్తే సాధ్యమే ● వ్యవధి ఎక్కువ ఉంటే లక్ష్యం తేలిక ● ఆలస్యం చేసిన కొద్దీ ఆర్థిక భారం ● ముందస్తు విరమణకు అధిక నిధి కావాలి
జీవితాంతం పోషణకు సమకూర్చుకోవాలి ● ఏటా పెట్టుబడుల మొత్తాన్ని పెంచుకోవాలి ● రుణాలకు దూరంగా ఉండాలి

నేటి తరం యువత 60 ఏళ్లు వచ్చే వరకు కష్టపడాలని అనుకోవడం లేదు. కెరీర్‌ను ముందుగానే ముగించాలని కోరుకుంటోంది. ముందస్తు రిటైర్మెంట్ ఆకాంక్ష క్రమంగా విస్తరిస్తోంది. ముందుగా రిటైర్ అయితే, అప్పటి నుంచి తమ అభిరుచులకు అనుగుణంగా స్వేచ్ఛగా జీవించొచ్చనే కాన్సెప్ట్ ఆదరణకు నోచుకుంటోంది. తోటి వారిని చూసి దీనికి ఆకర్షితులయ్యే వారూ ఉంటున్నారు. కానీ, ఇది ఎలా సాధ్యం? ఇదే ఎక్కువ మందికి ఎదురయ్యే ప్రశ్న. దీనిపై స్పష్టత తెచ్చుకోలేక, తర్వాత చూద్దాంలే.. అని అనుకుని కెరీర్‌లో సాగిపోయేవారూ ఉన్నారు. ఉద్యోగ, వృత్తి బాధ్యతలకు ముందస్తుగా విరమణ పలికి, నచ్చినట్టు జీవించడం అంటే వినడానికి ఎంతో ఆకర్షణీయంగా అనిపించొచ్చు. కానీ, దీన్ని చేరుకోవాలంటే సరైన లెక్కలు, ప్రణాళికలు కావాలి. వాటిని ఆచరణలో పెట్టినప్పుడు లక్ష్యం సఫలమవుతుంది. ఇందుకు ఏం చేయవచ్చన్నది అవగాహన కల్పించే కథనం ఇది.

రిటైర్మెంట్ అన్నది అన్నింటిలోకి చివరి లక్ష్యం అవుతుంది. దీనికంటే ముందు జీవితంలో నెరవేర్చాల్సిన, సాధించాల్సిన లక్ష్యాలు ఎన్నో ఉంటాయి. ఉదాహరణకు పిల్లల విద్య, వివాహాలు, సొంతిల్లు తదితరాలు. వీటిని సాధించేందుకు సరైన దిశలోనే అడుగులు వేస్తున్నారా? రిటైర్మెంట్ కంటే ముందుగా ఎదురయ్యే లక్ష్యాలకు సంబంధించి కచ్చితమైన ప్రణాళిక అవసరం. వీటిని చేరుకునేందుకు కావాల్సినంత, సరైన సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారా? ఒక్కసారి పరిశీలించుకోవాలి. లేకపోతే జీవితంలో అత్యంత ముఖ్యమైన లక్ష్యాల విషయంలో ఏ మాత్రం లెక్కలు తప్పినా, రిటైర్మెంట్ లక్ష్యం విషయంలో రాజీ పడాల్సి రావచ్చు. ఎవరైనా కానీ, ముందుగా ఎదురుపడే అవసరం గురించే ఆలోచిస్తారు. అందుకే ముందే రిటైర్మెంట్ తీసుకోవాలంటే, దానికంటే ముందు ఎదురయ్యే వాటి గురించి కూడా ప్రణాళిక వేసుకోవాలి. జీవితంలో కీలకమైన లక్ష్యాలు సాధించలేకపోతే రిటైర్మెంట్ సాధ్యం కాదన్న సూక్ష్మాన్ని గుర్తించాలి. ''సురక్షితమైన భవిష్యత్తుకు కావాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలి. ప్రస్తుత మీ జీవన శైలి పదవీ విరమణ తర్వాత దిగజారిపోకూడదు. వైద్య చికిత్సలకు అవసరమైనంత నిధి ఉండాలి. పిల్లల విద్య, వారి వివాహాలు, కారు కొనుగోలు, సెలవుల్లో పర్యటనలు వీటన్నింటికీ ఏర్పాట్లు ఉండాలి'' అని హమ్ ఫౌజీ సీఈవో సంజీవ్ గోవిలా సూచించారు.



ఎంత కావాలి..?

విశ్రాంత జీవనం కోసం సమకూర్చుకోవాల్సిన నిధి విషయంలో ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలి. లేదంటే సమకూర్చుకున్న నిధి ఏ మూలకూ చాలకపోవచ్చు. అదే జరిగితే పేరుకే రిటైర్మెంట్ అవుతుంది. ఆ తర్వాత ఖర్చులకు చాలక మళ్లీ ఏదో ఒక ఉపాధి వెతుక్కోవాల్సిన పరిస్థితి తెచ్చుకున్నట్టు అవుతుంది. అందుకుని రిటైర్మెంట్ కోసం కావాల్సిన నిధిని పక్కా అంచనా వేయాలి. ఈ విషయంలో నిపుణుల సాయం ఎంతో అవసరం పడుతుంది. రిటైర్మెంట్‌కు సంబంధించి కావాల్సిన నిధిని అంచనా వేయడం అత్యంత ముఖ్యమైనదని రైట్ హోరిజాన్స్ ఫండ్ మేనేజర్ అనిల్ రెగో పేర్కొన్నారు. ఉదాహరణకు 25 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం నెలవారీ ఖర్చులు రూ.25,000 ఉన్నాయని అనుకుందాం. అతడు ఏ వయసులో రిటైర్ అయితే ఆ తర్వాత జీవనానికి ఎంత మొత్తం కావాలన్నది ఇక్కడి పట్టికలో చూడొచ్చు. ప్రస్తుత నెలవారీ వ్యయాలకు ఏటా సగటున 5 శాతం ద్రవ్యోల్బణం ప్రభావం పరిగణనలోకి తీసుకుని రిటైరయ్యే నాటికి ఎంత కావాలో వేసిన అంచనాలు ఇవి. పట్టికలోని నెలవారీ పెట్టుబడిని ఏడాదికోసారి 8 శాతం పెంచుతూ వెళ్లాలి. పెట్టుబడిపై ఏటా 10 శాతం రాబడి వస్తుందన్న అంచనా. రిటైర్మెంట్ నాటికి సమకూరిన ఫండ్‌పై ఆ తర్వాత ఏటా 7 శాతం రాబడి వస్తుందని అనుకుంటే, ఇంత మొత్తం సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

రిటైర్మెంట్ వయసు	65ఏళ్లు	60 ఏళ్లు	55 ఏళ్లు	50 ఏళ్లు	45 ఏళ్లు	40 ఏళ్లు
కావాల్సిన నిధి	రూ.3.97కోట్లు	రూ.3.58 కోట్లు	రూ.3.13 కోట్లు	రూ.2.69 కోట్లు	రూ.2.27 కోట్లు	రూ.1.90 కోట్లు
నెలవారీ పెట్టుబడి	రూ.2,812	రూ.4,476	రూ.7,070	రూ.11,253	రూ.18,366	రూ.31,850

అవసరాలు వేర్వేరు..

రిటైర్మెంట్‌కు తక్కువ వ్యవధి ఉన్నప్పుడు నెలవారీ పెట్టుబడికి ఎక్కువ మొత్తం అవసరపడుతుంది. ప్రతి వ్యక్తికి ప్రత్యేకమైన జీవనశైలి, అవసరాలు, ఖర్చులు ఉంటుంటాయి. కనుక నెలవారీ ఎంత మొత్తం, ఏడాదికి ఎంత చొప్పున కావాలన్నది ఎవరికి వారు అంచనాకు రావాలి. ఏడాదికి తమ ఖర్చులు, తమ ఆరోగ్య అవసరాలు, ఆరోగ్య బీమా, జీవిత బీమా ఉన్నాయా? పిల్లలు ఎంత మంది? వారికి ఏ స్థాయి ఖర్చులో విద్య చెప్పించాలని అనుకుంటున్నారు? సొంతింటి ప్రణాళిక, వాహనం ఇత్యాది అవసరాలన్నింటినీ ఒక జాబితాగా రాసుకోవాలి. ఆ తర్వాత ఆర్థిక సలహాదారు లేదంటే పెట్టుబడి సలహాదారును సంప్రదించాలి. వారు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, నెలవారీగా దేనికి ఎంత మొత్తం పొదుపు, మదుపు చేయాలి, ఏ సాధనాలను ఎంపిక చేసుకోవాలి? అనేది ఒక ప్రణాళిక రూపొందించి ఇస్తారు. దీనికోసం ద్రవ్యోల్బణం, జీవిత కాలం తదితర అంశాలను వారు విశ్లేషిస్తారు. వారిచ్చిన ప్రణాళిక ప్రకారం సాగిపోవాలి. 30 ఏళ్ల వ్యక్తి నెలవారీ ఖర్చులు రూ.30,000 ఉన్నాయని అనుకుంటే ఏ వయసులో రిటైర్మెంట్ అయితే ఎంత మొత్తం కావాలో ఇక్కడి టేబుల్‌లో చూడొచ్చు. పైన టేబుల్ మాదిరే జీవిత కాలం 90 ఏళ్లకు అనుకుని, ఏటా పెట్టుబడిపై 10 శాతం రాబడి అంచనా ప్రకారం, ఏటా పెట్టుబడి 8 శాతం పెంచుతూ వెళ్లే విధంగా, రిటైర్మెంట్ తర్వాత 7 శాతం రాబడి కోసం సమకూర్చుకోవాల్సిన నిధి అంచనాలు ఇవి.

రిటైర్మెంట్ వయసు	65ఏళ్లు	60 ఏళ్లు	55 ఏళ్లు	50 ఏళ్లు	45ఏళ్లు
కావాల్సిన ఫండ్	రూ.4.98 కోట్లు	రూ.4.48కోట్లు	రూ.3.93కోట్లు	రూ.3.37కోట్లు	రూ.2.85కోట్లు
నెలవారీ పెట్టుబడి	రూ.6,231	రూ.10,116	రూ.16,425	రూ.27,212	రూ.47,341

ఒకవేళ 35 ఏళ్ల వ్యక్తికి అంచనాలు ఇలా ఉంటాయి..

రిటైర్మెంట్ వయసు	65 ఏళ్లు	60ఏళ్లు	55 ఏళ్లు	50ఏళ్లు
కావాల్సిన ఫండ్	రూ.3.90కోట్లు	రూ.3.51కోట్లు	రూ.3.08కోట్లు	రూ.2.64కోట్లు
నెలవారీ పెట్టుబడి	రూ.8,801	రూ.14,688	రూ.24,824	రూ.43,839

గమనిక: ఇక్కడ పట్టికల్లో ఇచ్చిన అంచనాలు అన్నీ కూడా పెట్టుబడిపై ఏటా 10 శాతం రాబడి ప్రకారం వేసిన అంచనాలు. కానీ, ఈక్విటీ ఫండ్స్‌లో దీర్ఘకాలంలో 12 శాతం వార్షిక రాబడి సాధ్యమే. కనుక ఆ ప్రకారం చూస్తే చేయాల్సిన నెలావారీ పెట్టుబడి 10 శాతం తక్కువైనా అనుకున్న కార్పస్‌ను సమకూర్చుకోవడం సాధ్యపడుతుంది.

అప్రమత్తత



రిటైర్మెంట్‌కు మరో ఐదేళ్లు ఉండగా పెట్టుబడుల విషయంలో అప్రమత్తం కావాలి. ఈక్విటీలకు అధిక కేటాయింపులు చేసుకునే వారు మార్కెట్ సైకిల్‌ను పరిగణనలోకి తీసుకుని, అందుకు అనుగుణమైన వ్యూహాన్ని అమల్లో పెట్టాలి. ఉదాహరణకు 2008 మార్కెట్ పతనం, 2020 మార్కెట్ పతనం గుర్తుండే ఉంటాయి. 2020 మార్కెట్ పతనం తర్వాత స్టాక్స్ రికవరీకి ఏడాది సమయం పట్టింది. కొన్ని స్టాక్స్ పూర్తిగా కోలుకుని కొత్త గరిష్టాలకు చేరుకుంటే, కొన్ని ఆలస్యంగా రికవరీ అయ్యాయి. అందుకుని రిటైర్మెంట్‌కు మరో మూడు–ఐదేళ్లు ఉండగా, మార్కెట్ సైకిల్‌ను అర్థం చేసుకోవాలి. భారీ దిద్దుబాటు వచ్చి దిద్దుబాటు వచ్చి చాలా ఏళ్లు అయ్యిందా? మార్కెట్ల వ్యాల్యుయేషన్లు జీవిత కాల గరిష్ఠ స్థాయిల్లో చలిస్తున్నాయా? ఇలాంటి అంశాలపై నిపుణుల సాయంతో అంచనాకు రావాలి. మూడు ఐదేళ్ల ముందు నుంచి ఏటా నిర్ణీత శాతం చొప్పున ఈక్విటీ పెట్టుబడులను ఉపసంహరించుకుంటూ డెట్ సాధనాల్లోకి మళ్లించుకోవాలి. రిటైర్మెంట్ తర్వాత కూడా ఈక్విటీల్లో కొంత మేర పెట్టుబడులు అవసరంపడతాయి. ఎందుకంటే ముందుగా రిటైర్మెంట్ తీసుకుంటున్నారు. ఆ తర్వాత కనీసం 25 ఏళ్ల నుంచి 35–40 ఏళ్ల పాటు జీవించి ఉండే వారికి ఈక్విటీలు తప్పనిసరి. అప్పుడే కార్పస్ కరిగిపోకుండా ఉంటుంది. అందుకుని నిపుణులు సూచించిన మేర ఈక్విటీల్లో పెట్టుబడులు కొనసాగించి, మిగిలిన మొత్తాన్ని క్రమంగా వెనక్కి తీసుకోవాలి. ఒకవేళ ఊహించని విధంగా రిటైర్మెంట్ నాటికి మార్కెట్లు భారీ దిద్దుబాటుకు గురైతే అప్పుడు రిటైర్మెంట్ లక్ష్యాన్ని ఏడాది నుంచి మూడేళ్ల పాటు వాయిదా వేసుకోవాల్సి రావచ్చు. అందుకుని సాధ్యమైన మేర లక్ష్యం వాయిదా పడకూడదంటే ముందస్తు జాగ్రత్తలు తప్పదు.

అవరోధాలు..

ముందుగా పదవీ విమరణ తీసుకునే వారికి సంపాదించే కాలం ఇతరులతో పోలిస్తే తక్కువ ఉంటుంది. ఉదాహరణకు 30 ఏళ్ల కాలంలో సమకూర్చుకోవాల్సినంత 20–25 ఏళ్లకే సాధించాలి. రిటైర్మెంట్ తర్వాత ఇతరులపై ఆధారపడకూడదు. పైగా ముందస్తు రిటైర్మెంట్ అంటే ఉదాహరణకు 55 ఏళ్లకు రిటైర్మెంట్ తీసుకుంటారని అనుకుందాం. అక్కడి నుంచి కనీసం 80 ఏళ్ల వరకు జీవించి ఉంటారని అనుకుంటే, 35 ఏళ్ల కాలానికి అవసరాలు తీర్చేంత ఫండ్ కావాలి. 25–30 ఏళ్లకు కెరీర్ ఆరంభిస్తే.. అక్కడి నుంచి ముందస్తు రిటైర్మెంట్‌కు 30–25 ఏళ్లే మిగిలి ఉంటుంది. తక్కువ కాలంలో ఎక్కువ కాలానికి ఫండింగ్ ఏర్పాటు చేసుకోవడం అంటే సాధారణ విషయం కాదన్నది గుర్తుంచుకోవాలి. క్రమశిక్షణతో, ఎటువంటి దుబారాకు చోటు ఇవ్వకుండా సంపాదనలో అధిక భాగం భవిష్యత్తుకు పొదుపు చేసుకున్నప్పుడు లక్ష్యం సాకారం అవుతుంది. ఉదాహరణకు పిల్లల విద్య కోసం బడ్జెట్ వేసుకుంటే, ఆ బడ్జెట్ మించకుండా దాన్ని అధిగమించాలి. లేదంటే వేరే లక్ష్యం కోసం ఉద్దేశించిన మొత్తం నుంచి దానికి సర్దుబాటు చేసుకోవాల్సి వస్తుంది. అలాంటప్పుడు గొలుసుకట్టు మాదిరి ఒకదాని కోసం మరో లక్ష్యం విషయంలో రాజీపడాల్సి వస్తుంది. లేదంటే రుణం తప్పదు.

రాబడి రేటు కీలకం



సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ రూపంలో (సిప్) ఇన్వెస్ట్ చేసినప్పుడు దీర్ఘకాలంలో మెరుగైన రాబడులు అందుకోవచ్చని చారిత్రక గణాంకాలు తెలియజేస్తున్నాయి. అలాగే, పెట్టుబడుల విధానంలో చిన్న మార్పుతోనూ మెరుగైన నిధిని సమకూర్చుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. మనకు ఏటా ఆదాయం ఎంతో కొంత పెరుగుతూనే ఉంటుంది. ఇలా పెరిగే మొత్తానికి అనుగుణంగా సిప్ పెట్టుబడినీ పెంచుకుంటూ వెళ్లాలి. ఏడాదికోసారి ఆర్జన పెరిగినప్పుడు పెట్టుబడిని పెంచుకోవడం ఏమంత పెద్ద కష్టం కాదు. ఖర్చులు కూడా ద్రవ్యోల్బణ ప్రభావంతో ఏటా పెరుగుతూ ఉంటాయి. ఖర్చులు పెరిగాయని పెట్టుబడుల విషయంలో రాజీ పడితే లక్ష్యం సాకారం కాదు. అనవసర ఖర్చులను తగ్గించుకుని అయినా అనుకున్న మేర, ప్రణాళిక మేరకు ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాలి. ఏటా ఆదాయం అనుకున్న మేర పెరగకపోతే ఎలా? దీనికి సంబంధించి కూడా ప్లాన్–బి రెడీ చేసుకుని పెట్టుకోవాలి. భవిష్యత్తు పెట్టుబడుల కోసం ప్రస్తుత జీవనశైలిలో పూర్తి రాజీ పడకూడదన్నది ఆర్థిక సలహాదారుల సూచన. రెండింటినీ సమన్వయం చేసుకునే విధంగా ఆచరణ ఉండాలి.

అలాగే, ఏటా పెట్టుబడిని పెంచడం ఒక్కటి కాకుండా, పెట్టుబడి సాధనాల మధ్య సమతూకం కూడా ఉండాలి. అధిక రాబడులను ఇచ్చే ఈక్విటీలకు తప్పకుండా చోటు ఉండాల్సిందే. పెట్టుబడులకు కనీసం 20 ఏళ్లు అంతకుమించి కాలం ఉంటే అగ్రెస్సివ్ ప్రణాళిక వేసుకోవచ్చు. ఈక్విటీలకు 75 శాతం నుంచి 100 శాతం వరకు కేటాయింపులు చేసుకోవచ్చు. ఎన్‌పీఎస్ ప్లాన్‌లోనూ 75 శాతం ఈక్విటీ పెట్టుబడులకు ఆప్షన్ ఉంది. ఎంత ఎక్కువ కాలం ఉంటే కాంపౌండింగ్ వల్ల అంత పెద్ద మొత్తం సమకూరుతుంది. రిటైర్మెంట్‌కు సంబంధించి అధిక రిస్క్ తీసుకునే వారికి సాధారణంగా 70–80 శాతం ఈక్విటీలు, మిగిలిన 20 శాతం మేర స్థిరాదాయ (డెట్) పథకాలను నిపుణులు సూచిస్తుంటారు. నిజానికి చాలా మంది విషయంలో గమనిస్తే అన్నింటికంటే ఆలస్యంగా మొదలు పెట్టేది రిటైర్మెంట్ కోసమే అవుతోంది. ఎక్కువ మంది చేసే పెద్ద తప్పిదం ఇదే. ఆర్జన మొదలైన మొదటి నెల నుంచే రిటైర్మెంట్ కోసం ఇన్వెస్ట్‌మెంట్ ఆరంభించిన వారు చాలా సులభంగా కావాల్సిన నిధిని సమకూర్చుకోగలరు. అంతే కాదు, కాంపౌండింగ్ పవర్‌తో ముందస్తు రిటైర్మెంట్ వీరికి చాలా సులభం అవుతుంది. ఆలస్యం చేసే కొద్దీ ఈ లక్ష్యం భారంగా మారుతుంది.

రిస్కులు–రక్షణ

ముందస్తు రిటైర్మెంట్ లక్ష్యం పెట్టుకున్న వారు రుణాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. రుణాలు తీసుకున్నా, రిటైర్మెంట్ పెట్టుబడుల ప్రణాళికకు అవరోధంగా లేకుండా ఉండాలి. రిటైర్మెంట్ నాటికి తీర్చేలా ఉండాలి. మరీ ముఖ్యంగా ముందస్తు రిటైర్మెంట్ తీసుకునే వారు ఉద్యోగం భద్రత అంశాన్ని తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలి. కరోనా సంక్షోభ సమయంలో ఎంతో మంది ఉపాధిని కోల్పోయారు. రుణాలపై మారటోరియం ఆప్షన్ తీసుకున్న వారు ఎందరో ఉన్నారు. ఇలాంటి ఊహించని పరిణామాలు ఎదురైతే ప్రణాళిక వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకే ఈ విధమైన రిస్కులను ఎదుర్కొనే ప్రణాళిక కూడా కావాలి. అలాగే, రోడ్డు ప్రమాదంలో గాయపడి వైకల్యం పాలై ఆర్జన ఆగిపోయే పరిస్థితి వస్తే..? అనుకున్నదంతా తలకిందులైపోతుంది. దీనికి సంబంధించి బీమా కవరేజీ తప్పకుండా తీసుకోవాలి. అలాగే, మనకు ఏదైనా అనుకోనిది జరిగితే కుటుంబాన్ని ఆదుకునే జీవిత బీమా, ఆస్పత్రిలో వైద్యం కోసం హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ తప్పకుండా తీసుకోవాలి. వృద్ధాప్యంలో ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. అందుకుని చాలా ముందుగానే హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకోవాలి.

హెచ్‌ఎస్‌బీసీ ఎంఎఫ్ మల్టీ క్యాప్ ఫండ్ ..



హెచ్‌ఎస్‌బీసీ మ్యుచువల్ ఫండ్ తాజాగా మల్టీ క్యాప్ ఫండ్ పేరిట న్యూ ఫండ్ ఆఫర్‌ను ప్రకటించింది. ఇది జనవరి 24తో ముగుస్తుంది. ఈక్విటీ, ఈక్విటీ సంబంధ సెక్యూరిటీల్లో పెట్టుబడుల ద్వారా దీర్ఘకాలికంగా సంపద వృద్ధి అవకాశాలను అందించడం ఈ స్కీము లక్ష్యం. దీని ద్వారా సమీకరించిన నిధులను లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో తలో 25 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేస్తారు. మిగతా 25 శాతం వరకూ మొత్తాన్ని ఈక్విటీ లేదా డెట్ సెక్యూరిటీస్ లేదా మనీ మార్కెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తారు. తద్వారా డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు పొందవచ్చు. ఎల్‌అండ్‌టీ మ్యూచువల్ ఫండ్ స్కీములను కొనుగోలు చేసిన తర్వాత హెచ్‌ఎస్‌బీసీ ఎంఎఫ్ ప్రవేశపెడుతున్న తొలి ఎన్ఎఫ్ఓ ఇది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

23-1-2023	
విశాఖ	550–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	78.00
22-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

ప్యాసివ్ ఈఎల్ఎస్ఎస్ స్కీమ్ ఆవిష్కరణకు అనుమతి

అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు సెబీ సమాచారం



న్యూఢిల్లీ: పన్ను ఆదా ప్రయోజనంతో కూడిన ఈఎల్ఎస్ఎస్ పథకాలకు సంబంధించి సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ప్రతి మ్యూచువల్ ఫండ్స్ సంస్థ ఒక్కటే ఈఎల్ఎస్ఎస్ పథకాన్ని నిర్వహించేందుకు సెబీ అనుమతించేది. ఒకటే సంస్థ ఒకటికి మించిన ఈఎల్ఎస్ఎస్ స్కీమ్‌లను నిర్వహించకూడదు. కానీ, ఇక మీదట యాక్టివ్ ఈఎల్ఎస్ఎస్ పథకాలను ఆఫర్ చేసే ప్రతి సంస్థ ప్యాసివ్ విభాగంలో (ఇండెక్స్‌ల పరిధిలోని స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసేవి) ఈఎల్ఎస్ఎస్ పథకాన్ని తీసుకొచ్చేందుకు అనుమతించింది. ఈ మేరకు అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు సమాచారం ఇచ్చింది. కానీ, ఈ విషయంలో పలు షరతులు విధించింది. ఇప్పటికే యాక్టివ్ ఈఎల్ఎస్ఎస్ పథకం నిర్వహించే అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ/మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ సంస్థ) ప్యాసివ్ స్కీమ్‌ను కూడా తీసుకురావాలని భావిస్తే.. యాక్టివ్ పథకంలోకి ఇక మీదట పెట్టుబడులను తీసుకోకూడదు.

కొటక్ బ్యాంక్ మార్జిన్ల రికార్డ్



క్యూ3 లాభం రూ. 3,995 కోట్లు

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో ప్రయివేట్ రంగ దిగ్గజం కొటక్ మహీంద్రా బ్యాంక్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 17 శాతం ఎగసి రూ. 3,995 కోట్లను తాకింది. స్టాండెలోన్ లాభం మరింత అధికంగా 31 శాతం జంప్‌చేసి రూ. 2,792 కోట్లను తాకింది. ఇందుకు బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్లు 0.3 శాతం బలపడి రికార్డ్ స్థాయిలో 5.47 శాతానికి చేరడం, రుణాల నాణ్యత మెరుగుపడటం సహకరించింది. జీవిత బీమా, మైక్రోఫైనాన్స్ విభాగాలుమినహా మిగిలిన అనుబంధ సంస్థల లాభాలు నీరసించినప్పటికీ కన్సాలిటేడెడ్ స్థాయిలో పటిష్ట ఫలితాలను సాధించినట్లు డిప్యూటీ ఎండీ దీపికా గుప్తా పేర్కొన్నారు. వడ్డీ రేట్లు పెరుగుతున్న నేపథ్యంలో సుమారు 63% రుణాలపై ఆర్జన మెరుగుపడనున్నట్లు తెలియజేశారు. కాగా.. క్యూ3లో ఫీజు ఆదాయం 23 శాతం ఎగసి రూ. 1,847 కోట్లకు చేరింది. స్థూల మొండిబకాయిలు 2.71% నుంచి 1.90 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.79 శాతం నుంచి 0.43 శాతానికి తగ్గాయి.

ఐసీఐసీఐ లాభం జూమ్

డిసెంబర్ త్రైమాసికంలో రూ. 8,792 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో రూ. 8,792 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో ఆర్జించిన రూ. 8,312 కోట్లతో పోలిస్తే ఇది 34 శాతం అధికం. నికర వడ్డీ ఆదాయం సైతం 35 శాతం జంప్‌చేసి రూ. 16,465 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 0.7 శాతం బలపడి 4.65 శాతానికి చేరాయి. త్రైమాసికవారీగా స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.19 శాతం నుంచి 3.07 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 16.26 శాతంగా నమోదైంది. అనుబంధ సంస్థలలో జీవిత బీమా లాభం రూ. 331 కోట్ల నుంచి రూ. 221 కోట్లకు క్షీణించింది. సాధారణ బీమా లాభం 11 శాతం మెరుగై రూ. 353 కోట్లను తాకింది. అసెట్ మేనేజ్‌మెంట్ లాభం రూ. 334 కోట్ల నుంచి రూ. 420 కోట్లకు వృద్ధి చూపింది. బ్రోకింగ్ విభాగం లాభం రూ. 281 కోట్లకు పరిమితమైంది.


స్లిప్పేజీలు ఇలా...

క్యూ3లో ఐసీఐసీఐ బ్యాంక్ స్థూల స్లిప్పేజీలు రూ. 5,723 కోట్లను తాకాయి. వీటిలో రిటైల్, రూరల్ బ్యాంకింగ్ విభాగం నుంచి రూ. 4,159 కోట్లు, కార్పొరేట్ల నుంచి రూ. 1,500 కోట్లు చొప్పున నమోదయ్యాయి. ఇక రూ. 2,257 కోట్లమేర ప్రొవిజన్లు చేపట్టింది. వీటిలో ప్రుడెన్షియల్ కేటాయింపులకింద రూ. 1,500 కోట్లు పక్కనపెట్టింది. దీంతో మొత్తం బఫర్ రూ. 11,500 కోట్లకు చేరింది. ఈ కాలంలో కొత్తగా ఏర్పాటు చేసిన 300తో కలిపి మొత్తం బ్రాంచీల సంఖ్య 5,700కు చేరింది.

ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చా?

ఆల్టర్నేటివ్ డెట్ ఇన్‌స్ట్రుమెంట్లు, ముఖ్యంగా ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ గురించి తరచూ వింటున్నాను. ఇవి కాల పరీక్షకు నిలబడినవేనా? – శ్రీరామ్

ఈక్విటీలు దీర్ఘకాలంలో సంపద సృష్టికి ఉద్దేశించినవి. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలు (డెట్ సెక్యూరిటీలు) పెట్టుబడికి రక్షణతోపాటు, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా కొంత రాబడిని ఇచ్చేవి. ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్ అంటే, హెడ్జ్ ఫండ్స్, ప్రైవేటు క్యాపిటల్, సహజ వనరులు, రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై ఇన్వెస్ట్ చేస్తాయి. వీటన్నింటిలోనూ లిక్విడిటీ (పెట్టుబడులను నగదుగా మార్చుకునే సౌలభ్యం) తక్కువ. నియంత్రణలు, పారదర్శకత కూడా తక్కువే. వ్యయాలు ఎక్కువ. చారిత్రకంగా రిస్క్, రాబడుల డేటా కూడా పరిమితంగానే అందుబాటులో ఉంది. కనుక రిటైల్ ఇన్వెస్టర్లకు ఈ సాధనాలు సూచనీయం కాదు. ఇన్‌వాయిస్ డిస్కౌంట్ అన్నది వ్యాపారం కోసం సమీకరించుకునే తాత్కాలిక రుణం. సాధారణంగా బ్యాంకులు ఈ రుణాలు ఇస్తుంటాయి. ఇవి ప్రైవేటు క్యాపిటల్, ప్రైవేటు డెట్ కిందకు వస్తాయి. దశాబ్ద కాలం నుంచి ఉన్న ఉత్పత్తి ఇది. రిస్క్–రాబడుల కోణంలో చూస్తే అంత అనుకూలంగా కాదు. లాభాలు పరిమితం, నష్టాలు అపరిమితం. అంటే 100 శాతం నష్టానికీ అవకాశం ఉంటుంది. వైవిధ్యం పరంగా చూసినా పోర్ట్‌ఫోలియోకి వీటిని జోడించుకోవడం సహేతుకం కాదు. ఉదాహరణకు మీరు ఓ కంపెనీకి రుణంపై వస్తువులు సరఫరా చేశారని అనుకుందాం. దీనికి బిల్ జారీ చేస్తారు. ఈ బిల్లు గడువు (30–90 రోజులు) ముగిసిన తర్వాత కొనుగోలుదారుడు చెల్లించేందుకు అంగీకరిస్తాడు. ఒకవేళ ఈ లోపే మీకు డబ్బులు అవసరం పడితే బ్యాంకును సంప్రదించింది ఈ బిల్లుపై నిధులు పొందుతారు. బ్యాంకులు రిస్క్ ఆధారంగా బిల్లు మొత్తంలో కొంత తగ్గించి మిగిలింది ఇస్తాయి. దీన్నే ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ అంటారు. ఇప్పటి వరకు ఈ వ్యాపారాన్ని బ్యాంకులే నిర్వహిస్తుండగా, ఇటీవలే రిటైల్ ఇన్వెస్టర్లు సైతం ఈ బిల్లులపై రుణాలు ఇచ్చే అవకాశాన్ని కొన్ని ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. ఒకవేళ రుణంపై వస్తువులు తీసుకున్న సంస్థలు చెల్లించడంలో విఫలమైతే ఏంటి పరిస్థితి? అందుకే రాబడుల కంటే ఈ రిస్కును రిటైల్ ఇన్వెస్టర్లు ముందు అర్థం చేసుకోవాలి. వీటిల్లో లిక్విడిటీ ఉండదు. మీరు విక్రయించాలంటే కొనుగోలుదారులు లభించకపోవచ్చు.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేనొక మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ ద్వారా ఇన్వెస్ట్ చేస్తున్నాను. అయితే, సదరు డిస్ట్రిబ్యూటర్ సేవల విషయంలో సంతోషంగా లేను. కనుక ఈ మొత్తం పోర్ట్‌ఫోలియోని మరో బ్రోకర్ వద్దకు మార్చాలని అనుకుంటున్నాను. అలా చేస్తే నేను పన్ను చెల్లించాల్సి వస్తుందా? – సల్మాన్ అహ్మద్

మీ మొత్తం పోర్ట్‌ఫోలియోని ప్రస్తుత డిస్ట్రిబ్యూటర్ నుంచి నూతన డిస్ట్రిబ్యూటర్‌కు మార్చుకోవచ్చు. రాతపూర్వకంగా అభ్యర్థన ఇవ్వాల్సి ఉంటుంది. ఇటువంటి సందర్భాల్లో మ్యూచువల్ ఫండ్ సంస్థ ప్రస్తుత డిస్ట్రిబ్యూటర్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోరకూడదు. పన్ను విషయానికొస్తే, దీనిపై ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పెట్టుబడులు కాకుండా, కేవలం డిస్ట్రిబ్యూటర్‌నే మారుస్తున్నారు. ఒక మ్యూచువల్ ఫండ్ పథకం నుంచి మరో మ్యూచువల్ ఫండ్‌కు మారినా లేదా రెగ్యులర్ ప్లాన్ నుంచి డైరెక్ట్ ప్లాన్‌కు మారినా పన్ను చెల్లించాల్సిన అవసరం ఏర్పడుతుంది.

క్లుప్తంగా...

ఎయిమ్స్‌ను మరింత అభివృద్ధి చేస్తాం

- కేంద్ర వైద్యశాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్
- శ్రీలక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో పూజలు



శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయం వద్ద కేంద్ర సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్

మంగళగిరి: అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను మరింత అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ చెప్పారు. మంగళగిరిలోని శ్రీ పానకాల లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం పవార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పవార్ విలేకరులతో మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎయిమ్స్‌లో ప్రాంతీయ భాష లోపం కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని, త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. తొలుత కేంద్ర సహాయ మంత్రికి ఆలయ ఈవో రామకోటిరెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం నగరంలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో జరిగిన బీజేపీ గుంటూరు పార్లమెంట్ జిల్లా కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బీఈడీ కోర్సుల పునరుద్ధరణ

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎల్‌వీకే



రాజంపేట టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో పరిపాలనా కారణాల వల్ల 2019 నుంచి నిలిపివేసిన బీఈడీ కోర్సును 2022–23 విద్యా సంవత్సరం నుంచి పునః ప్రారంభించనున్నట్లు అభ్యాసక సహాయ సేవా విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి(ఎల్‌వీకే) తెలిపారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఈడీ కోర్సు పునరుద్ధరణకు యూనివర్సిటీకి అనుమతి లభించిందన్నారు. బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) కోర్సును కూడా వర్సిటీ అందిస్తుందని తెలిపారు. త్వరలోనే నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు చెప్పారు. బీఈడీ, బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్)లో అడ్మిషన్ పొందేందుకు ఓసీ విద్యార్థులు డిగ్రీలో 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు 45 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు వేర్వేరుగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు చేయనున్నట్లు చెప్పారు. కాగా, వర్సిటీలో కొత్తగా పీజీ డిప్లొమా ఇన్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ ఆపరేషనల్ మేనేజ్‌మెంట్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు వివరించారు.

డీజీపీ ట్విట్టర్ అకౌంట్ హ్యాక్‌పై కేసు నమోదు

సాక్షి, అమరావతి: డీజీపీ పేరుతో వినియోగంలో లేని ఒక ట్విట్టర్ అకౌంట్‌ను హ్యాక్ చేసి దుర్వినియోగ పరిచిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు సాంకేతిక విభాగం డీఐజీ పీహెచ్‌డీ రామకృష్ణ ఆదివారం తెలిపారు. 2019లో ట్విట్టర్ ఐడీ 2020 ఫిబ్రవరి నుంచి వాడకాన్ని పూర్తిగా నిలిపివేసినట్టు చెప్పారు. వినియోగంలో లేని ఆ అకౌంట్‌ను హ్యాక్ చేసి తప్పుడు ఫొటోలు, అసభ్యకరమైన ఫొటోలకు లైకులు కొడుతూ ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నట్లుగా గుర్తించామన్నారు. దీనిపైన సైబర్ క్రైమ్ విభాగంలో కేసు నమోదు చేశామని చెప్పారు. హ్యాకింగ్‌కు పాల్పడిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రామకృష్ణ తెలిపారు.

రాజధానిగా అమరావతికే కేంద్రం కట్టుబడి ఉంది

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికే కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. ఆయన ఆదివారం విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ రాజధానిగా అమరావతి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాజధాని లేకుండా పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఏపీ అభివృద్ధిపై ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, పలు ప్రాజెక్టులకు రూ.వేల కోట్ల నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. భీమవరంలో జరగనున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

- జనాభా విషయంలో కొన్ని దేశాలను సైతం అధిగమించిన మన రాష్ట్రాలు
- తమిళనాడు జనాభా జర్మనీతో సమానం
- మయన్మార్‌తో పోటాపోటీగా ఏపీ
- ద.కొరియాను దాటేసిన ఆంధ్రప్రదేశ్
- మెక్సికోతో సమానంగా బిహార్
- జపాన్ ఎంతో.. మహారాష్ట్ర కూడా అంతే

జనంలో మనం!



ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి

జనాభా విషయంలో భారత్ ప్రపంచ రికార్డులు సృష్టిస్తోంది. తాజాగా 142 కోట్లకు పైగా జనాభాతో చైనాను అధిగమించి తొలి స్థానంలో నిలిచింది. ప్రపంచంలో చాలా దేశాలు జనాభా విషయంలో మన రాష్ట్రాలతో సరితూగలేవు. రెండు మూడు దేశాల్లో ఉన్న జనాభా కంటే మన రాష్ట్రాల్లో అత్యధికంగా ప్రజలు నివసిస్తున్నారు. మన దేశంలో అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్ కాగా అతి తక్కువ జనాభా ఉన్న రాష్ట్రం సిక్కిం. 2022 గణాంకాల ప్రకారం చైనా, అమెరికా, ఇండోనేషియా తరువాత అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 23.7 కోట్ల జనాభా నివసిస్తున్నారు. చైనాలో కూడా యూపీతో సమానంగా జనాభా ఉన్న రాష్ట్రాలు లేకపోవడం గమనార్హం. చైనాలో జనాభా పరంగా 12.6 కోట్లతో గువన్‌డాంగ్ ప్రావిన్స్ తొలిస్థానంలో నిలిచింది. ఈ ప్రావిన్స్ జనాభా ప్రపంచ దేశాలతో పోలిస్తే 11వ స్థానంలో ఉంటుంది.

- ఆంధ్రప్రదేశ్ జనాభా ప్రపంచంలో 27వ స్థానంలో ఉన్న మయన్మార్‌తో దాదాపు సమానం.
- దక్షిణ కొరియా (ప్రపంచంలో 28వ స్థానం) కంటే మన రాష్ట్రంలోనే ఎక్కువ మంది నివసిస్తున్నారు.
- భారత్‌లో అత్యల్ప జనాభా ఉన్న సిక్కిం కంటే మూడు దేశాల్లో (మకావ్, బహమాస్, కేమన్ ఐలాండ్స్) జనాభా తక్కువ.
- మహారాష్ట్ర జనాభా జపాన్‌తోసమానం.
- బెంగాల్ జనాభా ఈజిప్టుతో, తమిళనాడు జనసంఖ్య జర్మనీతో సమానం.
- ఉత్తరప్రదేశ్ జనాభా బ్రెజిల్ + ఈక్వెడార్ కంటే ఎక్కువ.
- యూపీ జనాభా మన పొరుగున ఉన్న పాకిస్థాన్‌తో సమానం.

ఆధార్ డేటా, ఐ.రా.స. అంచనాల గణాంకాలు ఇవీ.. (2022 ఆఖరు వరకు)

రాష్ట్రం	జనాభా కోట్లలో	దేశం	జనాభా కోట్లలో
యూపీ	23.7	బ్రెజిల్+ఈక్వెడార్	23.5
బిహార్	13	మెక్సికో	13
మహారాష్ట్ర	12.6	జపాన్	12.6
బెంగాల్	10.7	ఈజిప్ట్	10.7
మధ్యప్రదేశ్	8.7	టర్కీ	8.7
తమిళనాడు	8.4	జర్మనీ	8.4
రాజస్థాన్	8.0	ఉక్రెయిన్+పోలండ్	8.1
గుజరాత్	7.0	థాయిలాండ్	7.0
కర్ణాటక	7.0	యూకే	6.9
ఆంధ్రప్రదేశ్	5.4	మయన్మార్	5.5
ఒడిశా	4.7	స్పెయిన్	4.7
జార్ఖండ్	4.0	ఇరాక్	4.2
తెలంగాణ	4.0	మలేషియా+సింగపూర్	3.9
అసోం	3.6	కెనడా	3.9
కేరళ	3.5	సౌదిఅరేబియా	3.6
ఛత్తీస్‌గఢ్	3.4	పెరు	3.4
పంజాబ్	3.1	ఆస్ట్రేలియా+న్యూజిలాండ్	3.1
హరియాణ	2.9	వెనిజులా	2.8
ఢిల్లీ	1.9	రొమేనియా	1.9
జమ్ము-కశ్మీర్	1.5	జింబాబ్వే	1.5
ఉత్తరాఖండ్	1.2	బొలీవియా	1.2
హిమాచల్‌ప్రదేశ్	0.75	హాంగ్‌కాంగ్	0.76
త్రిపుర	0.42	క్రొయేషియా	0.40
మేఘాలయ	0.38	ఎరిట్రియా	0.37
మణిపూర్	0.34	ఉరుగ్వే	0.35
నాగాలాండ్	0.21	స్లొవేనియా	0.21
పుదుచ్చేరి	0.16	బెహ్రెయిన్	0.18
అరుణాచల్‌ప్రదేశ్	0.17	లాట్వియా	0.18
గోవా	0.15	ఈక్విటోరియల్ గినియా	0.15
మిజోరాం	0.13	ఎస్తోనియా	0.13
చండీగఢ్	0.12	సైప్రస్	0.13
దాద్రా, నగర్ హవేలి, దయ్యూ డామన్	0.08	గుయనా	0.08
సిక్కిం	0.07	మకావ్	0.07
అండమాన్ నికోబార్	0.04	బహమస్	0.04
లక్షద్వీప్	0.007	కేమన్ ఐలాండ్స్	0.007

పిల్లలపై కోవిడ్ ప్రతాపం

▶ మొదటి పేజీ తరువాయి

పరిస్థితులు బాగున్నట్లు 73శాతం మంది విద్యార్థులు సంతోషం వ్యక్తంచేశారు. దీర్ఘకాలం పాఠశాలలు మూతపడటం, ఆటపాటలకు దూరంకావడంతో పిల్లల శరీరాకృతుల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. తమ శరీర ఆకృతిపై 45 శాతం మంది అసంతృప్తి వ్యక్తంచేశారు.

- బోధనాంశాలను గ్రహించడం, ప్రతి స్పందించడంలో మాధ్యమిక స్థాయిలో 43 శాతం మంది విద్యార్థులు చురుగ్గా ఉండగా 57 శాతం మంది తక్కువ చొరవతో ఉన్నారని సర్వేలో తేలింది. సెకండరీ స్థాయిలో 46 శాతం మంది ప్రతిస్పందిస్తున్నట్లు వెల్లడైంది.
- ఆన్‌లైన్ అభ్యసనాలతో 49 శాతం మంది నైపుణ్యాన్ని ప్రదర్శించగా, 51 శాతం మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అర్థంకాని అంశాలను టీచర్ల ద్వారా నివృత్తి చేసుకునేందుకు 28 శాతం మంది సందేహిస్తున్నారు. మాధ్యమిక స్థాయి నుంచి పైదశకు మారిన పిల్లలు చదువుపై పూర్తి ఆసక్తిని కనబర్చడం లేదు. సెకండరీలో 29 శాతం మంది, మాధ్యమికలో 25 శాతం మంది ఒంటరితనంతో బాధ పడుతున్నట్లు తెలిపారు.

సర్వేలో కొన్ని ముఖ్యాంశాలు ఇవీ..

ఏకాగ్రత లేమి: 29 శాతం
చదువుల్లో వెనుకబడని వారు: 22 శాతం
చదువు అలవాటు లేమి: 16 శాతం
సమయ నిర్వహణ చేయలేనివారు: 14 శాతం
చదువులకు ఆటంకాలున్న వారు: 12 శాతం
చదివింది అర్థంకాని వారు: 7 శాతం
చదువంటే ఆందోళనతో ఉన్న వారు: 50 శాతం
పరీక్షలంటే భయపడేవారు: 31 శాతం
ఆందోళన చెందని వారు: 15 శాతం

భావోద్వేగాల పరిస్థితి ఇలా

భావోద్వేగాల్లో తరచూ మార్పు: 43 శాతం
తీవ్రమైన భావోద్వేగాలు లేనివారు: 27 శాతం
తీవ్రమైన భావోద్వేగాలున్నవారు: 14 శాతం
భయంతో ఉన్న వారు: 7 శాతం

నిద్ర అలవాటులో మార్పులు

మాధ్యమిక విద్యార్థులు: 32 శాతం
సెకండరీ విద్యార్థులు: 43 శాతం
రోజూ ఒకేమాదిరిగా ఉన్న వారు:
మాధ్యమిక: 28 శాతం
సెకండరీ: 24 శాతం

వైఎస్సార్‌సీపీ సర్పంచ్ కుటుంబంపై టీడీపీ వర్గీయుల దాడి

- మాజీ మంత్రి ఉమా ప్రధాన అనుచరుడి ఆధ్వర్యంలో రాళ్లు, ఇనుప రాడ్లతో దాడి



గాయపడిన సర్పంచ్ మేనమామ పుల్లారావు



గాయపడిన సీహెచ్ వెంకటకృష్ణ

జి.కొండూరు(మైలవరం): విద్యుత్ స్తంభం ఏర్పాటు విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్ కుటుంబంపై టీడీపీ వర్గీయులు రాళ్లు, ఇనుప రాడ్లతో దాడికి తెగబడ్డారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం గంగినేని గ్రామంలో శనివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రధాన అనుచరుడే ఈ దాడికి సూత్రధారుడని బాధితులు ఆరోపిస్తున్నారు. శనివారం ఉదయం తన ఇంటికి సమీపంలో విద్యుత్ స్తంభం ఏర్పాటుకు సర్పంచ్ పిల్లి రామారావు సిద్ధమయ్యారు. స్తంభం ఏర్పాటు చేసే ప్రదేశానికి పక్కనే నివసిస్తున్న టీడీపీ వర్గీయుడు నక్కనబోయిన తిరుపతిరావు, అతని సోదరుడు సుబ్బారావు, సుబ్బారావు కుమారుడు శ్రీధర్‌తో పాటు కుటుంబ సభ్యులైన దుర్గ, ప్రమీల కలిసి సర్పంచ్‌పై దాడికి యత్నించారు. సర్పంచ్ రామరావుకు మద్దతుగా అతని తల్లి పిల్లి వెంకాయమ్మ, సోదరుడైన ఎంపీటీసీ సభ్యుడు పిల్లి ప్రసాద్, మరదలు కల్యాణి వచ్చారు. వెంకాయమ్మ, కల్యాణిలపైనా టీడీపీ వర్గీయులు దాడి చేసి గాయపరిచారు. తమపై నక్కనబోయిన తిరుపతిరావు కుటుంబ సభ్యులు దాడిచేశారని తల్లి వెంకాయమ్మ, మరదలు కల్యాణితో కలిసి సర్పంచ్ రామారావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. సర్పంచ్ రామరావు మేనమామ సాగర్ల పుల్లారావు శనివారం రాత్రి 11 గంటల సమయంలో తమ బంధువులపై దాడిచేయడమేంటని టీడీపీ వర్గీయులతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన మాజీ మంత్రి దేవినేని ఉమా బంధువు, ప్రధాన అనుచరుడైన మంగళంపాటి వెంకటేశ్వరరావు తన అనుచరులను సర్పంచ్ కుటుంబంపై దాడికి మరోమారు ఉసిగొల్పాడు. దీంతో 40మంది రాళ్లు, ఇనుప రాడ్లతో అర్ధ రాత్రి దాటాక సర్పంచ్ కుటుంబంపై దాడి చేశారు. ఈ దాడిలో పుల్లారావుతో పాటు సర్పంచ్ అనుచరుడు సీహెచ్ వెంకటకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. సర్పంచ్ ఇంటి ప్రాంగణంలో ఉన్న బైక్‌లు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనకు సంబంధించి జి.కొండూరు పోలీసులు ఆదివారం పలువురిపై కేసు నమోదు చేశారు. దాడిచేసేలా ప్రేరేపించిన దేవినేని ఉమ అనుచరుడు మంగళంపాటి వెంకటేశ్వరరావు, మరో అనుచరుడు కోపూరి చిట్టిబాబు, దాడి చేసిన చింతలచెరువు పుల్లారావు, నక్కనబోయిన సుబ్బారావు, కొండూరు మహాలక్ష్మణరావు, నక్కనబోయిన తిరుపతిరావు, ఆళ్ల గోపాలకృష్ణ, వరగల చిరంజీవి, మంగళంపాటి ప్రసాద్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

ఇక స్మార్ట్ లైసెన్స్, ఆర్‌సీ కార్డులు

- ప్లాస్టిక్ కార్డుల స్థానంలో కాంపోజిట్ కార్డులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇక స్మార్ట్ డ్రైవింగ్ లైసెన్సు, వాహనాల ఆర్సీ కార్డులు జారీ కానున్నాయి. ఈ మేరకు రవాణా శాఖ విధాన నిర్ణయం తీసుకుంది. అందుకోసం వివిధ కార్డుల ప్రతిపాదనలను పరిశీలించి కాంపోజిట్ కార్డును ఎంపిక చేసింది. దీనికి క్యూఆర్ కోడ్ జతచేసి స్మార్ట్ కార్డుగా ముద్రించనుంది. ప్రస్తుతం దాదాపు 20 లక్షల లైసెన్స్, ఆర్సీ కార్డుల జారీ పెండింగులో ఉంది. ఇక ప్రతి నెలా సగటున 2.50 లక్షల కార్డులు కొత్తగా జారీ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటికీ స్మార్ట్ కార్డులు వాడాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనలను త్వరలోనే ప్రభుత్వానికి పంపనుంది. ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన నెల రోజుల్లో స్మార్ట్ కార్డుల టెండర్ల ప్రక్రియ చేపడుతుంది. కార్డుల ముద్రణ, పంపిణీ అంతా విజయవాడ నుంచే కేంద్రీకృతంగా నిర్వహించనున్నారు.

కాంపోజిట్ స్మార్ట్ కార్డు ఉపయోగాలివీ..

డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ కార్డులను ఇన్నాళ్లూ ప్లాస్టిక్ కార్డుతో రూపొందించేవారు. సెంటర్ ఫర్ ప్లాస్టిక్ టెక్నాలజీ నిపుణుల సూచనల మేరకు కాంపోజిట్ కార్డులను రూపొందించాలని రవాణా శాఖ నిర్ణయించింది. ప్లాస్టిక్, పాలిస్టర్ మిశ్రమంగా కాంపోజిట్ కార్డులను తయారు చేస్తారు. ఈ కార్డులు ఎక్కువ కాలం మన్నుతాయి. వంగిపోవు. వాటిపై ముద్రణ స్పష్టంగా, చెరిగిపోకుండా ఉంటుంది. ఈ కార్డులపై క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తారు. ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే లైసెన్సుదారులు, వాహనానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుస్తుంది.

బోగస్ ఓట్లకు చిరునామా కుప్పం

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం/తిరుపతి ఎడ్యుకేషన్ (తిరుపతి జిల్లా): కుప్పం నియోజకవర్గం 35 వేల బోగస్ ఓట్లతో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి చెప్పారు. పుత్తూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఐదు సార్లు కుప్పం నుంచి బోగస్ ఓట్లు ద్వారానే గెలిచారని చెప్పారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, మూడుసార్లు ముఖ్యమంత్రి, మూడుసార్లు ప్రతిపక్ష నాయకుడినంటూ ప్రగల్బాలు పలికే చంద్రబాబు.. బోగస్ ఓట్ల ద్వారా గెలిచానని రాష్ట్ర ప్రజానీకానికి ఎందుకు చెప్పలేకపోతున్నారని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న నవరత్నాలు, సంక్షేమ పథకాలను ప్రచారం చేయలేని ఎల్లో మీడియా.. నేడు ఎన్నికల సంఘం కుప్పంలో వెలుగులోకి తెచ్చిన 35 వేల బోగస్ ఓట్లు గురించి కూడా ఎందుకు ప్రచారం చేయడం లేదని ప్రశ్నించారు. అన్యాయం ఎక్కడ జరిగినా ప్రశ్నిస్తానన్న దత్తపుత్రుడు ఎందుకు మౌనంగా ఉన్నారని విమర్శించారు. ఆయనకు ఉపాధి కోసం ప్యాకేజీ కూడా అందినట్లుందంటూ ఎద్దేవా చేశారు. చంద్రబాబు, దత్తపుత్రుడు, ఎల్లో మీడియా కంకణం కట్టుకుని చంద్రబాబు గెలుపు కోసం జగనన్న సువర్ణ పాలనపై విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 2024లో ఎన్నికల్లో టీడీపీకి మద్దతు తెలిపే పార్టీలన్నీ భూస్థాపితం కావడం తథ్యమని నారాయణస్వామి అన్నారు.

వాటిని ఏరివేస్తున్నాం.. : మంత్రి రోజా



కుప్పంలో చంద్రబాబు ఇన్నాళ్లూ బోగస్ ఓట్లతోనే గెలుస్తున్నారని, అలాంటి బోగస్ ఓట్లను తొలగిస్తున్నామని రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా తెలిపారు. తిరుపతిలో ఆమె మీడియాతో మాట్లాడుతూ లోకేశ్ చేపట్టిన యువగళంతో రాష్ట్ర ప్రజలు టీడీపీకి మంగళం పాడతారని ఎద్దేవా చేశారు. గతంలో ప్రజారాజ్యం పార్టీని యువశక్తి అంటూ కాంగ్రెస్‌లో విలీనం చేశారని, ఇప్పుడు జనసేన యువశక్తి అంటూ 2019లో బీజేపీకి, ఇప్పుడు టీడీపీకి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఉత్తపుత్రుడైన నారా లోకేశ్, దత్తపుత్రుడైన పవన్ ఇద్దరూ కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీని ఏమీ చేయలేరని ఆమె స్పష్టంచేశారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని మంత్రి రోజా డిమాండ్ చేశారు.

నాన్న జ్ఞాపకాలు పదిలం

- అణచివేతకు గురయ్యే వారిని ప్రేమించమని చెప్పేవారు
- నాన్న హత్య తర్వాత ఫిడేల్ క్యాస్ట్రో అన్నీ తానై చూసుకున్నారు
- 'చేగువేరా-వైద్యం' అనే పుస్తకం రాస్తున్నా
- క్యూబాలో నూరు శాతం స్త్రీ, పురుష సమానత్వం
- 'సాక్షి'తో విప్లవవీరుడు చేగువేరా కుమార్తె అలైదా గువేరా



సాక్షి, హైదరాబాద్: 'లాటిన్ అమెరికా దేశాల్లో విప్లవాన్ని రగిలించేందుకు వెళ్లిన నాన్నను బొలీవియాలో 1967లో అమెరికా అనుకూల బొలివీయా దళాలు కాల్చి చంపినప్పుడు నాకు సుమారు ఏడేళ్లు. అయినప్పటికీ ఆయనతో గడిపిన క్షణాలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి' అని ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులకు స్ఫూర్తి ప్రదాత, నిస్వార్థ గెరిల్లా యుద్ధ యోధుడు, మార్క్సిస్టు విప్లవ వీరుడు అయిన చేగువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా తెలిపారు. మానవ హక్కుల కార్యకర్త అయిన ఆమె 'సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిద్దాం.. ప్రపంచ శాంతిని కాపాడుకుందాం' అంటూ ప్రపంచమంతా చాటి చెబుతున్నారు. క్యూబా రాజధాని హవానాలోని విలియం సోలెర్ చిల్డ్రన్స్ హాస్పిటల్లో వైద్యురాలిగా పని చేస్తూనే ప్రపంచ దేశాల్లో జరిగే వివిధ కార్యక్రమాలకు ఆమె హాజరవుతుంటారు. క్యూబా సంఘీభావ యాత్రలో భాగంగా భారత్‌లో పర్యటిస్తున్న ఆమె ఆదివారం తన కుమార్తె, చేగువేరా మనవరాలు ప్రొఫెసర్ ఎస్తెఫినా గువేరాతో కలసి హైదరాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

ప్రపంచానికి క్యూబా వైద్య రంగం ఆదర్శం

వైద్య రంగంలో ప్రపంచానికి క్యూబా ఆదర్శంగా నిలిచింది. మా దేశంలో చిన్నారులకు 14 రకాల టీకాలు ఇస్తుంటాం. క్యూబాలో ప్రస్తుతం శిశు మరణాల రేటు ప్రతి వెయ్యిలో ఐదుగా ఉంది. క్యూబాలో 100 శాతం స్త్రీ, పురుష సమానత్వం ఉంది. మా దేశంలో పిల్లలను కొట్టకూడదు. క్యూబా డాక్టర్లలో 72 శాతం మంది మహిళలే.

వీపుపై ఎక్కించుకుని ఆడించేవారు..

నాన్న ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు నన్ను లేపేవారు. చెరకు తోటలకు తీసుకెళ్లేవారు. అక్కడ ఆయన పనిచేస్తుంటే నేను చెరకుగడలు తింటూ గడిపేదాన్ని. ఇతరులతో మాట్లాడుతూ నన్ను ఆడిస్తూ ఉండేవారు. ఆయన ఇంట్లో ఉన్నప్పుడు వీపుపై ఎక్కించుకుని తిప్పుతూ ఆడించేవారు. నాకు, నా సోదరులకు జంతువుల కథలు ఎక్కువగా చెప్పేవారు. వారాంతాల్లో స్వచ్ఛంద పనులు చేసేవారు. ప్రపంచంలో అణిచివేతకు గురవుతున్న మానవ సమూహాలను ప్రేమించాలని చెప్పేవారు. సామాజిక సేవా కార్యక్రమాలకు తీసుకెళ్లేవారు. మాకు దూరంగా ఉన్నా ఉత్తరాలు రాసే వారు. నాన్న చనిపోయాక క్యూబా కమ్యూనిస్టు పితామహుడు, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నేతల్లో ఒకరైన ఫిడేల్ క్యాస్ట్రోనే అన్నీ తానై నన్ను చూసుకున్నారు. క్యాస్ట్రో మరో తండ్రిలాంటి వారు. 1987లో నాకు పెళ్లయింది. రాత్రి 11:30 గంటలకు పెళ్లి జరిగింది. ఆయన రాక కోసం వేచిచూసి ఆ సమయంలో చేసుకున్నాం. నాకు కూతురు పుట్టినప్పుడు ఆయన ఆసుపత్రికి వచ్చారు. నాన్న చేగువేరా పూర్తి కమ్యూనిస్టు. ఇరాన్ వంటి దేశాల్లోనూ ఆయన్ను ఆరాధిస్తారు. నేను నాన్న గురించి 'చేగువేరా-వైద్యం' అనే పుస్తకం రాస్తున్నా. అందు కోసం నాన్న రాసిన పుస్తకాలను లోతుగా అధ్యయనం చేస్తున్నా. బొలీవియన్ డైరీస్ పుస్తకం చదువుతుంటే గుండె బరువెక్కుతుంది. ఎన్ని కష్టాలు ఎదురైనా భవిష్యత్తు గురించి ఆందోళన చెందకూడదు.



1964లో హవానాలో తన తండ్రి చేగువేరాతో మాట్లాడుతున్న ఫిడేల్ క్యాస్ట్రోతో చిన్నారి అలైదా గువేరా

30 లోపు గృహ సారథులు

- ఎంపిక ప్రక్రియ వేగవంతం: సజ్జల
- 1 నుంచి మండల స్థాయిలో శిక్షణ

సాక్షి అమరావతి: సచివాలయాల పరిధిలో పార్టీ కన్వీనర్లు, ప్రతి 50ఇళ్లకు గృహసారథులను ఎంపికను ఈనెల 30వ తేదీలోపు పూర్తిచేయాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ ఆదేశించారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, పరిశీలకులు, మండల కన్వీనర్లతో ఆయన ఆదివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి కుటుంబం అభిప్రాయాలను తెలుసుకుంటూ కన్వీనర్లు, గృహసారథుల నియామకాన్ని పూర్తిచేయాలని సూచించారు. ప్రతి సచివాలయానికి సంబంధించి ముగ్గురు కన్వీనర్ల నియామకం ఇప్పటికే పూర్తి కాగా, గృహ సారథుల నియామకాలకు ఎమ్మెల్యేల అభ్యర్థన మేరకు పొడిగించినట్లు చెప్పారు. మండల కన్వీనర్ల ఆధ్వర్యంలో గృహ సారథుల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలను ఫిబ్రవరి 1 నుంచి 7వ తేదీలోపు నిర్వహించేలా కన్వీనర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ముఖ్య అతిథిగా పాల్గొని సమీక్షించాలని సూచించారు. సీఎం జగన్ నిర్దేశించిన ప్రకారం జగనన్న సచివాలయ కన్వీనర్స్, గృహసారథుల యంత్రాంగం నిర్మాణంపై ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, పరిశీలకులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఎన్నికల యుద్ధాన్ని సమర్థంగా ఎదుర్కోవడం, ప్రజలతో మమేకమై ముందుకు సాగేందుకు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలన్నది సీఎం జగన్ అభిమతమని సజ్జల వివరించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at MNS Printers Private Limited, Survey No 76/1 Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943